# క్యాంపస్ వాయిస్

సామాజిక, రాజకీయ, ఆర్థిక మాస పత్రిక

సంపుటి : 4 సంచిక : 2 జూన్ : 2014 వెల : 30/-




## 'ఆర్డినెన్స్' కాదు ... పోలవరం ప్రాజెక్టును రద్దు చేయాలి.

'ఈలం' ఆకాంక్ష బతికే ఉంటుంది | నరేంద్ర మోడీకి బహిరంగ లేఖ | పోలవరాన్ని పునఃసమీక్షించాలి | ప్రజాస్వామ్య తెలంగాణ | బతుకు పోరులో ఓయూ 'స్వీపర్స్'

# కవర్ స్టోరీ

ఈ దేశ పాలకవర్గాలు బహుళజాతి కంపెనీలకోసం, పెట్టుబడిదారులకు లాభాల కోసం చట్టాలను తుంగలో తొక్కడమే కాకుండా అవసరమైతే ఆదివాసీ, దళితుల ప్రాణాలను సహితం పణంగా పెడతామని మరోసారి నిరూపించారు. ఒక పక్క దేశంలోని విలువైన ఖనిజ సంపదను బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నింస్తుంటే ఆ సంపదను కాపాడుతున్న ఆదివాసులను 'గ్రీన్‌హంట్' ఆపరేషన్ పేరుతో మట్టుబెడుతూ ఇంకోవైపు భారీ ప్రాజెక్టులపేరుతో ఆదివాసులను నిర్వాసితులను చేస్తున్నారు. ఇవ్వాళ దేశంలో అభివృద్ధి పేరుతో ఏ కార్యక్రమం జరిగిన అక్కడ నష్టపోయేది మొదట ఆదివాసులే. ఆంధ్రప్రదేశ్ పునర్వవస్థికరణ చట్టం -2014 పేరుతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతోపాటు పోలవరం ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కల్పించి 7 తెలంగాణ మండలాలను ఆంధ్రలో కలిపే కుట్రలకు పాల్పడింది. ఈ ప్రాజెక్ట్ వలన నిర్వాసితులయ్యేది కూడా ఆదివాసీలే. ఈ నేపథ్యంలో 'పోలవరం' ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల జరిగే లాభనష్టాలను చర్చించే వ్యాసాలను కవర్‌స్టోరీగా ప్రచురిస్తున్నాం.




*లోపలి పేజీల్లో......*


| | | | |
|---|---|---|---|
| **అంతర్జాతీయం** | : 'ఈలం' ఆకాంక్ష బతికే ఉంటుంది | - డేవిడ్ | 3 |
| **జాతీయం** | : నరేంద్ర మోడీకి బహిరంగ లేఖ | - గోపాలకృష్ణ గాంధీ | 8 |
| **కవర్ స్టోరీ** | : పోలవరాన్ని పున:సమీక్షించాలి | - టి.శివాజీరావ్ | 11 |
| | : విధ్వంసానికి సజీవ సాక్ష్యం పోలవరం ప్రాజెక్ట్ | - జంజర్ల రమేష్ బాబు | 13 |
| **ప్రాంతీయం** | : ప్రజాస్వామ్య ప్రత్యేక తెలంగాణ | - వరవర రావు | 16 |
| | : ప్రత్యేక తెలంగాణ ఉద్యమం - విద్యార్థులు | - నలమాస కృష్ణ | 22 |
| **క్యాంపస్ కబుర్లు** | : బతుకుపోరులో ఓయూ స్వీపర్స్ | - జోగు లింగస్వామి, డేవిడ్ | 24 |
| **ఆకాశంలో సగం** | : మహిళలపై అత్యాచారాలు :చట్టం-పురుష్యాధిక్య భావజాలం | - వెన్నెల | 27 |
| **ఇంటర్వ్యూ** | : వీరప్పన్‌లాగే ప్రభాకరన్ కూడా | - నరేష్ నందం | 31 |
| **సామాజిక న్యాయం** | : 'కమ్మ' సామాజిక వర్గ ఆధిపత్యం - రాష్ట్రాల సరిహద్దులు | - దలేల్ బెన్ బబాలీ | 36 |
| **వర్ధంతి** | : నిత్య చైతన్య స్ఫూర్తి 'చే గువేరా' | - బి.ప్రసాద్ | 43 |


**క్యాంపస్ వాయిస్‌లో ప్రచురించిన రచనల్లో ఆయా రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలతో సంపాదక వర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు. అవి కేవలం రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.**

రచనలు, అభిప్రాయాలు,చందాలు పంపవలసిన చిరునామా
**ఎడిటర్**
క్యాంపస్ వాయిస్
రూ.నెంబర్ 34, నర్మద హాస్టల్ (NRSH)
ఓ.యూ., హైదరాబాద్ - 07
ఫోన్ : 8374070162, 9000022499
e-mail : oucampusvoice@gmail.com

# తెలంగాణ - పోలవరం



ఆరు దశాబ్దాల తెలంగాణ కల సాకారమైంది. అందుకు ఆనందించాలో లేక నాలుగు లక్షల మంది ఆదివాసీ భూమి పుత్రులు పోలవరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులుగా మారుతున్నందుకు బాధపడాలో తెలియని సందిగ్ధత. ఒకవైపు సంబురాలు మరోవైపు దు:ఖం. ఆంధ్రప్రదేశ్ పునర్వవస్థీకరణ చట్టం -2014 ద్వారా రెండు రాష్ట్రాలు ఏర్పడుతున్న సందర్భంలో ఇరువురు తమ స్వీయ రాజకీయ ప్రయోజనాలకే పట్టం కట్టారు. తెలంగాణ కావాలంటే పోలవరం ఇవ్వాల్సిందేనన్నట్లు వ్యవహరించారు. తాంబూలాలిచ్చాం- తన్నుకు చావండన్నట్లు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రాగం నడిపింది. అది చాలదన్నట్టు ఆర్డినెన్స్‌ద్వారా ముంపు గ్రామాలనే కాకుండా ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను సీమాంధ్రలో కలిపేందుకు ప్రయత్నించింది. పది జిల్లాల తెలంగాణ తప్ప ఇంకేమీ ఒప్పకోమన్న తెలంగాణ రాజకీయ నాయకత్వం తెలంగాణ వస్తే చాలూ ఎన్ని ఆంక్షలున్న, ఎవరు ఎమైపోయిన పర్వాలేదు అన్నట్లు కళ్లుచెవులు మూసుకున్నారు. నిజానికి ఆదివాసులు తెలంగాణ ప్రజాస్వామిక ఆకాంక్షలకు అండగా నిలబడ్డారు. తమది కాని యుద్ధాన్ని భూజాన వేసుకున్నారు. కేంద్రలో అధికారంలోకి వచ్చిన బీజేపీ పార్టీ ఆచరణలో కాంగ్రెస్ వారసురాలిగానే వ్యవహరిస్తుంది. దేశంలోని అనేక సమస్యలను పక్కకు పెట్టి సీమాంధ్ర పాలకవర్గాలను, పెట్టుబడిదారులను సంతోషపెట్టేందుకు నాయుడ్ల ధ్వయం (చంద్రబాబు, వెంకయ్య) మార్గదర్శకత్వంలో ముంపు మండలాల ఆర్డినెన్స్‌ద్వారా ఆమోదింపజేసింది. ఆదివాసీల హక్కులను పరిరక్షించాల్సిన రాష్ట్రపతి తన రాజ్యాంగ విధులను విస్మరించి కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయానికి ఆమోదముద్రవేశాడు. తన మొదటిదాడిని ఆదివాసీలపైకే ఎక్కుపెట్టిన మోడీ, అయోధ్య రాముడికోసం బాబ్రీ మసీదును కూల్చిన సంఘీపరివార్‌తో కలిసి, పోలవరం కోసం భద్రాది రామున్ని సహితం ముంచేందుకు సిద్ధపడ్డారు. అధికారం ముందు దేవుడితో సహా అన్నీ బలాదూరే అని నిరూపించారు. ఇక తేల్చుకోవాల్సింది ప్రజలే. చట్టసభలు, న్యాయస్థానాలు ప్రజల పక్షాన లేనప్పడు ప్రజలకు ఉద్యమాలే శరణ్యం. అర్డినెన్స్ రద్దు మాత్రమే కాదు-పోలవరమే రద్దు కావాలి. అందుకు అందరం సిద్ధపడాలి. పోరాడే ప్రజలకు అండగా నిలబడాలి.

-సంపాదకులు


**సలహా మండలి:**

ప్రొ॥పి. ఎల్ విశ్వేశ్వర్ రావు (జర్నలిజం)
ప్రొ॥అడప సత్యనారాయణ (హిస్టరీ)
ప్రొ॥టి. కిషన్‌రావు (తెలుగు)
డా॥దేవరాజు మహారాజు (జువాలజీ)
ప్రొ॥ఎస్. భూపతి రావ్ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్)
ప్రొ॥పి. ముత్తయ్య (పొలిటికల్ సైన్స్)
ప్రొ॥ఎం. కోదండరామ్ (పొలిటికల్ సైన్స్)
ప్రొ॥జి. కృష్ణారెడ్డి (పొలిటికల్ సైన్స్)
ప్రొ॥కె. లక్ష్మీ (పొలిటికల్ సైన్స్)
డా॥సి. గణేష్ (సోషియాలజీ)
డా॥జె. మురళీధర్ (పొలిటికల్ సైన్స్)
డా॥బి. బాలస్వామి (జర్నలిజం)
డా॥సి. కాశీం (తెలుగు)
డా॥ఎ. నాగేశ్వర్ రావు (జువాలజీ)

**ఎడిటర్:**

డేవిడ్ M.A.,(Ph.D)

**ఎడిటోరియల్ బోర్డ్**

కోట రాజేష్ M.A.,(Ph.D)
ఇంద్రకంటి వెంకటేష్ M.A.,(Ph.D)
స్టాలిన్ M.A., (Ph.D)
జోగు లింగస్వామి M.C.J., M.Sc

మేనేజర్స్ : కాంపల్లి శ్రీనివాస్
: వంశీ
: ప్రేమ్
: శ్రీకాంత్

# 'ఈలం' ఆకాంక్ష బతికే ఉంటుంది!

– డేవిడ్


"ప్రభాకరన్ చచ్చిపోవచ్చు
అతని కొడుకూ చచ్చిపోవచ్చు
ఎన్నికల ప్రజాస్వామ్యానికి కదా కుటుంబ పాలన అవసరం
ఈలం ఏర్పడడానికి జాతి బతికి ఉంటే చాలు
జాఫ్నా బతికి ఉంటే చాలు
అక్కడి గాలీ, నేలా, నీళ్లూ
బతికుంటే చాలూ
నెత్తురోడుతూ
గాయాలు తడుముకుంటూ
కన్నీళ్లు తుడుచుకుంటూ
కలల కంటూ
తమ దేశంలోనే నిర్వాసితులుగానైనా సరే
ప్రవాసంలోనైనా సరే
ప్రజలు బ్రతికుంటే చాలు"
'ఈలం' ఆకాంక్ష బతికుంటుంది "
**అని విప్లవ కవి వరవర రావు ప్రభాకరన్ మరణం తర్వాత రాశాడు.**

ఇవ్వాళ శ్రీలంకలో జరుగుతున్నది కూడా అదే. ప్రభాకరన్‌ను మట్టుబెట్టిన తర్వాత శ్రీలంకలోని తమిళుల హక్కులను, అస్తిత్వాన్ని నామరూపంలేకుండా చేశామని విర్రవీగుతున్న శ్రీలంక ప్రభుత్వానికి గత సంవత్సరం సెప్టెంబర్‌లో శ్రీలంక నార్త్ ప్రావిన్స్ ఎన్నికల్లో తమిళులు తమ ఆకాంక్షను నిర్భందాల మాటున నిరూపించి చూపారు.

మానవ హక్కులను తన ఉక్కుపాదంతో తొక్కివేసిన శ్రీలంక ప్రభుత్వం, సుదీర్ఘ యుద్ధం తర్వాత, అంతర్జాతీయ ఒత్తిడి మేరకు అనివార్య పరిస్థితిలో నిర్వహించిన ఎన్నికల్లో మైనారిటీ తమిళుల చేతిలో చావుదెబ్బ తినాల్సి వచ్చింది. సెప్టెంబర్‌లో జరిగిన ఉత్తర శ్రీలంక ఎన్నికలలో తమిళ జాతీయ కూటమి (తమిళ్ నేషనల్ అలయెన్స్ – టిఎన్ఎ) సాధించుకున్న అసాధారణ, అఖండ విజయం విస్తృత స్వయం పాలనాధికారాల కోసం అక్కడి తమిళులు పడుతున్న అరాటాన్ని చాటిచెప్పింది. 38 మంది సభ్యులు గల ఉత్తర శ్రీలంక రాష్ట్రీయ మండలి (ప్రావిన్స్)కి జరిగిన ఎన్నికల్లో టిఎన్ఎ 30 స్థానాలు గెలిచి, తమిళులలో రగులుతున్న ఆత్మగౌరవ స్పృహ, స్వయం పాలనాకాంక్ష దిక్కులు పిక్కటిల్లేలా ప్రతిధ్వనించే తీర్పునిచ్చాయి. ఇరవై ఆరు సంవత్సరాల చరిత్రాత్మక సాయుధ తిరుగుబాటులో జాతి ఆకాంక్ష కోసం ఎంతో ప్రాణ నష్టాన్ని, మరెంతో విధ్వంసాన్ని చవిచూసింది శ్రీలంక తమిళగడ్డ. బలప్రయోగంతో, మానవ హక్కులను ఉల్లంఘించి అణచివేతను అనుభవించిన తమిళ ప్రజలు అంతర్జాతీయ ఒత్తిడుల మూలంగా అందివచ్చిన నామమాత్రపు ప్రజాస్వామిక ఘట్టమైన ఎన్నికలను తమ స్వయం నిర్ణయాధికారపు హక్కు కోసం ఉపయోగించుకున్నారు. తమలో జాతి ఆకాంక్ష ఇంకా ఉందని ప్రస్ఫుటం చేయడానికి ఈ ఎన్నికలను ఉపయోగించుకుని అత్యధిక స్థానాలు సాధించడంద్వారా తమ నిర్ణయాన్ని వెల్లడించారు.

ఈ ఎన్నికలలో తమిళ నేషనల్ అలయెన్స్ సాధించుకున్న అఖండ విజయం 1983కి ముందు ప్రాంతీయ స్వయం పాలన అధికారాల కోసం తమిళులు చేస్తూ వచ్చిన డిమాండ్‌ను అత్యంత బలంగా పునరుద్ధరింప చేస్తున్నది. సుదీర్ఘ కాలం తర్వాత నిర్వహించిన ఈ ఎన్నికలలో గెలుపు కోసం శాయశక్తులా కృషి చేసిన శ్రీలంక అధ్యక్షుడు మహీంద్ర రాజపక్సేకు చెందిన పాలక కూటమి యునైటెడ్ ఫ్రీడమ్ అలయెన్స్ కేవలం ఏడు స్థానాలతోనే సరిపుచ్చుకోవడాన్ని చూస్తే శ్రీలంక ప్రభుత్వంపైన తమిళులు ఎంత వ్యతిరేకతతో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. అధ్యక్షుడి అధికారం గాని, డబ్బు గాని తమిళుల జాతి ఆకాంక్ష ముందు దిగదుడుపే అని ఈ ఎన్నికలు స్పష్టం చేశాయి. ఈలం కోసం ఎల్‌టిటిఇ సాగించిన హింసాయుత పోరాటాన్ని టెర్రరిస్ట్ సంస్థ పేరుతో అంతర్జాతీయంగా ఒంటరిని చేసి, ఎల్‌టిటిఇ నాయకత్వాన్ని నామరూపం లేకుండా చేయడంతో విజయం సాధించిన రాజపక్సే ప్రభుత్వాన్ని, తమ నామ మాత్రపు ప్రజాస్వామ్యంతో, తమ బ్యాలట్ ద్వారా తిప్పికొడుతూ స్వయం పాలన డిమాండ్‌ను మరోసారి పాలక వర్గం ముందు ఉంచింది.

శ్రీలంకలో సింహళ, తమిళ ప్రాంతాల మధ్య రాజకీయ సంధి, సమన్వయం కుదర్చడానికి ఈ ఎన్నికలు ఒక మంచి అవకాశమని ఐక్యరాజ్య సమితి ఎన్నికల సందర్భంలో వ్యాఖ్యానించింది. అధ్యక్షుడు రాజపక్సే ఈ ఎన్నికల ఫలితాలిచ్చిన సందేశాన్ని అర్థం చేసుకొని అందుకు తగు రీతిలో నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుందని కూడా పరోక్షంగా హెచ్చరించింది. అంతర్యుద్ధ కాలంలో ఎల్‌టిటిఇకి శ్రీలంక సేనలకు మధ్య జరిగిన కాల్పులలో చిక్కుకున్న జాఫ్నా ప్రాంతంలో క్షతగాత్రులై, నిర్వాసితులై, కొంప గూడు కోల్పోయి ఇప్పటికీ శరణార్థి శిబిరాలలో మగ్గుతున్న లక్షలాది మంది తమిళులకు గౌరవ ప్రదమైన, భద్రతాయుతమైన



**మహేంద్ర రాజపక్సేతో శ్రీలంక ఉత్తర ప్రావిన్స్ ముఖ్యమంత్రి సి.వి. విగ్నేశ్వరన్**

జీవనాన్ని, పునరావాసాన్ని కల్పించవలసి ఉన్నదని, ఏడు లక్షలకు పైగా తమిళ ఓటర్లు ఎనుకున్న ప్రావిన్షియల్ కౌన్సిల్‌కు ప్రభావవంతమైన అధికారాలకు తగినన్ని నిధులను ఇవ్వలిసిన బాధ్యత రాజపక్సే ప్రభుత్వంపై ఉన్నదని శ్రీలంక ప్రభుత్వాన్ని పరోక్షంగా హెచ్చరించింది. ప్రావిన్సియల్ కౌన్సిల్ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన టిఎన్ఎ నేత విఘ్నేశ్వరన్ కూడా శ్రీలంక కేంద్ర ప్రభుత్వంతో చర్చల ద్వారా తమ ప్రాంతానికి చెందవలసిన అధికారాలను నిధులను సాధించుకుంటామని, ఆమేరకు రాజపక్సే నుండి తగిన సహకారం లభించని పక్షంలో అంతర్జాతీయ సమాజం జోక్యాన్ని కోరుతామని సెలవిచ్చాడు.

అయితే ఈ ఎన్నికల్లో విజయం సాధించి ముఖ్యమంత్రిగా ఉన్న సి.వి.విఘ్నేశ్వరన్, ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎల్‌టిటిఇ దివంగత నేత ప్రభాకరన్‌ను "మహావీరుని"గా పొగిడి, తమిళుల స్వయం నిర్ణయాధికారం కోసం పాటుపడతానని హామీ ఇచ్చాడు. అయితే తమిళుల స్వయం నిర్ణయాధికార ఆకాంక్షలు రాజ్యాంగానికి లోబడి అయిన నెరవేర్చాలంటే శ్రీలంక ప్రభుత్వంతో అనివార్యంగా ఘర్షణ తప్పదు. ప్రస్తుత శ్రీలంక చట్టాల ప్రకారం కౌన్సిల్లచే ఎన్నుకోబడిన వ్యక్తి కన్నా దేశ అధ్యక్షుడు నియమించే గవర్నర్‌కే అధికారాలు ఎక్కువ ఉంటాయి. దీంతో ఫెడరల్ ప్రభుత్వంతో ఘర్షణ అనివార్యమని తెలుస్తుంది. ప్రజల ఆకాంక్షలు, హక్కులు తిరస్కరించబడితే గతం పునరావృతంకాకుండా మానదు. గత చరిత్ర చెబుతున్న పాఠం కూడా అదే.

**చరిత్రలో ఉల్లంఘనలు :**

1948లో బ్రిటిష్ వలస పాలన నుంచి స్వాతంత్ర్యం అనంతరం కూడా ఉత్తర తూర్పు ప్రాంతాలలోని తమిళులు తమకు ప్రాంతీయ స్వయం పాలనాధికారాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. అయితే 1948లో డిఎస్ సేనానాయకే నాయకత్వంలోని ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిలోన్ పౌరసత్వపు చట్టం భారతీయ సంతతి వారికి పౌరత్వాన్ని నిరాకరించే పేరుతో తమిళులందరి పౌరసత్వాన్ని రద్దుచేసింది. ఆ దుర్మార్గ చట్టాన్ని ఎత్తివేయించడానికి సుప్రీంకోర్టుకూ, చివరికి బ్రిటన్‌లోని ప్రైవీ కౌన్సిల్‌కూ మొరపెట్టుకుని ఓడిపోవడంతో తమిళుల ఆత్మగౌరవపోరాటం ప్రారంభమయింది. 1956లో దేశంలో సింహాళాన్ని ఏకైక అధికార భాషగా ప్రకటిస్తూ మరొక చట్టం తేవడంతో సింహళ పాలకవర్గాల ఉద్దేశ్యాలు మరింతగా స్పష్టమయ్యాయి. 1947లోనే తమిళులకు కల్పించిన రక్షణలను తొలగిస్తూ శ్రీలంక ప్రభుత్వం 1972లో రాజ్యాంగ సవరణను తీసుకొచ్చింది. మెజారిటీ సింహళీయుల ఆధీనంలోని శ్రీలంక ప్రభుత్వం తమిళులకు హక్కులను కాలరాసే



ఎల్.టి.టి.ఇ. అధినేత వేలుపిళ్లై ప్రభాకరన్

చట్టాలను తీసుకురావడంతో ఆ చట్టాలన్నిటిని వ్యతిరేకిస్తూ తమిళ ప్రజాప్రతినిధులు శాంతియుత సత్యాగ్రహాన్ని నిర్వహిస్తే, సింహళ సంస్థలు ఆ ఆందోళనలను హింసాత్మకంగా అడ్డుకుని, తమిళులను ఊచకోత కోశాయి.

1958, 1977, 1981, 1983 లలో శ్రీలంక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన జాతి పోరాటంలో వేలాది మంది బలి అయ్యారు. రెట్టింపు సంఖ్యలో నిరాశ్రయులుగా మారిపోయారు. తమిళుల సమస్య పరిష్కారం ఇక సమైక్య శ్రీలంకలో పరిష్కారం కాదనీ, తూర్పు, ఉత్తర ప్రాంతాలతో స్వతంత్ర ఈలం (చరిత్రలో తమిళ స్వతంత్ర రాజ్యంగా కొనసాగిన సామ్రాజ్యం) స్థాపించుకోవడం ఒక్కటే మార్గమని భావించారు. 1976లో వెడ్డుకొట్టైలో జరిగిన ఒక సదస్సులో ప్రత్యేక తమిళ ఈలం మాత్రమే పరిష్కారమని తీర్మానం చేశారు. ఇదే చారిత్రాత్మక వెడ్డుకొట్టై తీర్మానంగా ప్రసిద్ధి చెందింది. దీన్నే ఎన్నికల మేనిఫెస్టోగా ప్రకటిస్తూ తమిళ పార్టీలనన్నీ అప్పటి ప్రముఖ తమిళ నేత చల్లనాయగం నేతృత్వంలో 'తమిళ యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్' (టి.యు.ఎల్.ఎఫ్)గా ఏర్పడ్డారు. దీనికి తమిళ ప్రజల నుండి పూర్తిస్థాయిలో ఆమోదం లభించింది. ఐతే ఈ పరిణామాల అనంతరం తమిళ ఐక్యతను జీర్ణించుకోలేని సింహళ పాలక వర్గాలు 1977లో ఒక సామూహిక హత్యాకాండ సాగించారు. ప్రతిరోజు ఎక్కడో ఒక చోట తమిళులపై హత్యలు, అత్యాచారాలు కొనసాగాయి. ఈ క్రమంలో స్వతంత్ర్య ఈలం ఏర్పాటు ఇక ఎంత మాత్రం శాంతియుత పోరాటపద్ధతులతో సాధ్యం కాదని, గత అనుభవాల రీత్యా తమ పోరాట రూపాన్ని మార్చుకున్నారు. వేలుపిళ్లై ప్రభాకరన్ నేతృత్వంలో ఏర్పడిన తమిళ న్యూ టైగర్స్ (టి.ఎన్.టి), లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం (ఎల్.టి.టి.ఇ)గా పరిణామం చెంది. అదే సమయంలో అనేక సాయుధ పోరాట సంస్థలు పుట్టుకొచ్చాయి. అలాంటి దాదాపు డజను సంస్థలలో ఒక్కొక్కదాన్నీ పద్ధతి ప్రకారం నిర్మూలిస్తూ ఎల్‌టిటిఇ బలమైన సంస్థగా అభివృద్ధి చెందింది. దీని నాయకుడుగా ప్రభాకరన్ ఉండి ఎల్‌టిటిఇని శక్తివంతమైన సంస్థగా తీర్చిదిద్దాడు. కొన్ని సంస్థలు ఎల్‌టిటిఇ యొక్క స్వతంత్ర దేశ విధానాన్ని వ్యతిరేకించి ప్రధాన రాజకీయాల్లో చేరి చట్టబద్ధ పార్టీలుగా మారిపోయినప్పటికీ ఎల్‌టిటిఇ మాత్రం ఈలం ఏర్పాటు కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజల పోరాటకారుల మద్దతు కూడగట్టుకుంటూ ఆర్థిక శక్తినీ, సైనిక శక్తినీ సమకూర్చుకుంది. ఒక దశలో భారత సైనిక బలగాల నుంచి శిక్షణనూ, ఆయుధాలనూ పొందింది. తనకు అనువైన నైసర్గిక వాతావరణంలో శ్రీలంక సైనిక బలగాలను మాత్రమే కాదు, అంతకన్నా చాలా బలమైన భారత సైనిక బలగాను కూడా మట్టికరిపించి సమాంతర ప్రభుత్వాన్ని నడిపింది. బహుశా ప్రపంచ చరిత్రలోనే మొదటిసారిగా సొంత విమానాలను, ఓడలను, జలాంతర్గములను సంపాదించుకున్న పోరాట సంస్థగా ఘనతను సంపాదించింది. అంతర్జాతీయ స్థాయిలో పరపతిని కూడా పెంచుకుని తన తరపున అంతర్జాతీయ సంస్థల్లో, నెదర్లాండ్స్ వంటి ప్రభుత్వంలో వకాల్తా పుచ్చుకునే పరిస్థితి కల్పించింది. సుదీర్ఘకాలం లక్ష్య సాధన కోసం అహింసాయుత పద్ధతులతోనే సాగటంతో శ్రీలంక సైన్యానికి, తమిళ సాయుధ బృందాలకు మధ్య పోరు మొదలైంది. దాదాపు మూడు దశాబ్దాల తమిళ జాతి పోరాటంలో అనేక ఉత్థాన పతనాలను చవిచూసి పాలక సైన్యాల క్రూరత్వానికి బలైపోయింది. ఈ క్రమంలో అనేక అణిచివేతలు, హక్కుల ఉల్లంఘనలు, చిత్రహింసలు, ఊచకోతలను శ్రీలంక తమిళ సమాజం అనుభవించింది.

**భారత పాలకుల కపట ప్రేమ:**

లక్షలాది మంది తమిళులు చిత్రహింసలకు, ఊచకోతకు గురికాబడుతూ స్వదేశంలోనే నిరాశ్రయులుగా మారుతున్నా పట్టించుకోనిది ఈ దేశ పాలక వర్గాల విధానం. తమిళ ప్రత్యేక ఈలం కోసం పోరాడిన ఎల్‌టిటిఈ పై శ్రీలంక సైన్యం పాశవికంగా దాడులు చేసి, పసివారిపై, అమాయకులపై విచక్షణరహితంగా బాంబుల వర్షం కురిపించి,ప్రాణాలతో దొరికిన తమిళ పౌరులను నగ్నంగా నిలబెట్టి కాల్చిచంపి యుద్ధ నేరాలకు పాల్పడింది. లంక సైన్యం దుర్మార్గాలను స్వీడన్‌కు చెందిన చానల్-4 బయటపెట్టేవరకు మనదేశ పాలక వర్గాలు నిమ్మకునీరెత్తినట్లు ఉండిపోయారు.

తమిళజాతి నిర్మూలనకు శ్రీలంక సైన్యం చేస్తున్న దాడులపై ఐక్యరాజ్యసమితిలో వ్యతిరేకంగా ఓటువేయాలని కేంద్రంపై తమిళు లు, పార్టీలు ఒత్తిడిచేస్తే తప్ప దేశ పాలక వర్గాలు కదలలేని స్థితి. అంతర్జాతీయ చట్టాలను, మానవ హక్కులను యధేచ్ఛగా ఉల్లంఘిస్తూ నిరాశ్రయురాలుగా మారిన ఇసాన్ ప్రియా అనే ఒక మహిళ న్యూస్ రీడర్‌ను, ఎల్‌టిటిఇ అనుకూల ఛానల్‌లో పనిచేసిందనే కారణంగా మానవత్వాన్ని మరిచి శ్రీలంక సైనికులు రేప్ చేసి అత్యంత కిరాతకంగా హత్య గావించినా మన పాలకులు ఉలుకూ పలుకూ లేకుండా ఉండిపోయారు. శ్రీలంకలో మానవహక్కుల ఉల్లంఘన, యుద్ధనేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని కెనడా ప్రభుత్వం ఆరోపించి, తమ దేశంలో నివసిస్తున్న ప్రవాస తమిళుల ఆందోళన దృష్ట్యా గత సంవత్సరం నవంబర్ 15న కొలంబోలో జరిగిన కామన్‌వెల్త్ దేశాల ప్రభుత్వాధినేతల సమావేశాన్ని (చోగం) కెనడా బహిష్కరిస్తే, మన దేశం తరపున ప్రతినిధిగా సల్మాన్ ఖుర్షిద్‌ను పంపి తన భక్తిని చాటుకున్నారు. ఇది మన పాలక వర్గాలకు పొరుగుదేశంలో ఉన్న తమిళుల పట్ల ఉన్న ప్రేమ.

బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడీ, ఎన్నికల ప్రచారంలో భాగంగా అస్సాంలోని రాంనగర్ బహిరంగ సభలో మాట్లాడుతూ తాము అధికారంలోకి రావడం తథ్యమని, కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన తర్వాత బంగ్లాదేశ్ నుంచి ఎవరైతే హిందువులు ఇండియాకు శరనార్థులుగా వచ్చారో వారిని మాతోపాటు ఉండేందుకు అవకాశాన్ని ఇస్తామని హామీ ఇచ్చాడు. "హిందువులు ఎక్కడకు వెళ్లగలరు? భారత దేశం మాత్రమే వారిని హక్కున చేర్చుకుంటుందని" అన్నాడు. కానీ ఇదే హామీని మోడీ తమిళనాడు ఎన్నికల ప్రచారంలో శ్రీలంక తమిళులకు ఇవ్వలేక పోయాడు. బహుశా నరేంద్ర మోడీకి దృష్టిలో ఈ దేశ పౌరులంటే బంగ్లాదేశ్‌లోని హిందువులు మాత్రమే కనిపిస్తున్నట్లుంది!.

కామన్‌వెల్త్ సమావేశాలకు హాజరైన బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరాన్ ఉత్తర ప్రావిన్స్‌లోని తమిళ ప్రాబల్యప్రాంతమైన జాఫ్నాను సందర్శిస్తే తమిళ ప్రజలు ముఖ్యంగా మహిళలు ఆయన కాన్వాయ్‌ను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఎల్‌టిటిఇలో పనిచేసిన చాలా మంది ప్రతిరోజు కనిపించకుండా పోతున్నారని, అనుమానించదగిన వ్యక్తులు అనే కారణంతో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి శ్రీలంక తమిళులను తీసుకెళుతున్నారని దీనిపై విచారణ జరిపించాలని, అంతర్జాతీయ సమాజం శ్రీలంక ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి స్వతంత్ర విచారణ జరిపించాలని వాళ్లు డిమాండ్ చేశారు. అయితే డేవిడ్ కామెరాన్ శ్రీలంక ఉత్తర ప్రాంత సందర్శన సందర్భంగా ఆందోళనకు నాయకత్వం వహించిందనే కారణంతో జయకుమారి బాలేంద్రన్‌ను ఆమె 17 సంవత్సరాల కుమార్తెను పోలీసులు అక్రమంగా నిర్బంధించారు. జయకుమారి కొడుకు 2009లో జరిగిన శ్రీలంక అంతరుద్యంలో తర్వాత శ్రీలంక సైన్యం ముందు లొంగిపోయాడు కానీ ఆమె కుమారుడు అప్పటి నుంచి కనిపించకుండా పోయాడు. తన కుమారుడులాంటి ఎంతో మంది పిల్లలు యుద్ధం ముగిసిన తర్వాత కనిపించకుండా పోతున్నారని వారి ఆచుకి తెలపాలని అక్కడి మహిళలు ఆందోళ నిర్వహిస్తున్నారు. ఈ మహిళలు యుద్ధంపేరుతో తమపై జరిగిన అమానుష దాడులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆ ప్రాంత పర్యటన అనంతరం కామెరాన్ మాట్లాడుతూ 'స్వయంగా చూశాక గానీ మీ పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం కాలేద'ని విలేఖరులతో



**జాఫ్నా పర్యటనకు వచ్చిన బ్రిటీష్ ప్రధాని డేవిడ్ కామెరాన్‌కు నిరసన వ్యక్తం చేస్తున్న శ్రీలంక తమిళులు–తన కొడుకు ఆచూకి తెలపాలని ధర్నా నిర్వహిస్తున్న జయకుమారి బాలేంద్రన్**



ఇండియా పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోడీని అభినందిస్తున్న శ్రీలంక అధ్యక్షుడు మహేంద్ర రాజపక్సే

ప్రభుత్వంతో జరిగిన అంతర్యుద్ధంలో శ్రీలంక తమిళులు సర్వం కోల్పోయి, నిలువనీడలేక కన్న ఊరు కాదంటే , తలదాచుకోవడానికి పొరుగున ఉన్న తమిళనాడుకు శరణార్థిగా వస్తే జయలలిత ప్రభుత్వం బహిరంగ చెరసాల లాంటి ప్రదేశాల్లో వీళ్లను ఉంచి ఖైదీలకంటే క్రూరంగా చూస్తుంది. 2009 యుద్ధం తర్వాత దాదాపు లక్ష 20 వేల మంది శ్రీలంక తమిళులు దేశ సరిహద్దుదాటి తమిళనాడు చేరుకున్నారు. ఓట్ల కోసం తమిళ ఈలం జపం చేసే రాజకీయ పార్టీలు మాత్రం వీళ్లను మనుషులకంటే నీచంగాచూస్తూ అంతర్జాతీయ ఒప్పందాలను కూడా అమలు చేయడం లేదు. జయలలిత ప్రభుత్వం దాదాపు వందకు పైగా క్యాంపుల్లో (ఇందులో 3 స్పెషల్ క్యాంపులు) శ్రీలంక తమిళు లను ఉంచి.వీటిలో ఎక్కడా కూడా సరైన సదుపాయాలు కల్పించకుండా వీళ్లపట్ల యుద్ధఖైదీల కంటే ఘోరంగా వ్యవహరిస్తుంది. గత ముప్పై ఐదేళ్ల కాలంలో దాదాపు 3 లక్షలకుపైగా తమిళులను శ్రీలంక ప్రభుత్వం హత్యచేసింది. 2009లో జరిగిన పోరాటంలో చివరి ఐదు నెలల్లోనే దాదాపు లక్షమంది శ్రీలంక తమిళులను, ప్రభుత్వ బలగాలు పొట్టన పెట్టుకున్నాయి. లక్షలాదిమంది తమిళులను హతమార్చిన నరహంతక రాజపక్సేను మరో నరహంతకుడు ఆహ్వానించడం పెద్ద ఆశ్చర్యమేమి కాదు. కానీ వివిధ దేశాల్లో ఉన్న ఫాసిస్ట్ శక్తులు ఏకమైతే జాతి పోరాటాలకు, అంతిమంగా వర్గ పోరాటాలకు పెద్ద ప్రమాదం ఏర్పడుతుంది. అందుకే వివిధ దేశాల్లో ఉన్న ప్రజాస్వామికవాదులు, విప్లవకారులు, జాతీయవాదులు ఉమ్మడిగా ఆయా ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించవలసిన అవసరం ఉంది.

అన్నారు. స్వదేశంలోనే నిరాశ్రయులుగా, చీకటి కొటాల్లాంటి పునరావాస శిబిరాల్లో దుర్భర జీవితాన్ని అనుభవిస్తుంటే మన పాలకులు మాత్రం ఇదేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

### శరణార్థుల పట్ల కనికరం చూపం జయలలిత:

నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారం సందర్భంగా శ్రీలంక దేశ అధ్యక్షుడు మహేంద్ర రాజపక్సేను ఆహ్వానించడం పట్ల తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత, ప్రతిపక్షనేతలైన కరుణానిధి, వైగోలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రమాణ స్వీకారాన్ని కూడా బహిష్కరించడాన్ని మనం చూశాము. నిజానికి తమిళ రాజకీయ పార్టీలు ఏనాడు శ్రీలంక తమిళుల సమస్యల పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేయలేదు. ఇవ్వాళ నరేంద్రమోడీ తన ప్రమాణ స్వీకారానికి మహేంద్ర రాజపక్సేను ఆహ్వానించడాన్ని వ్యతిరేకించిన జయలలిత ఒకనాడు ఇదే రాజపక్సేకు బహాటంగానే మద్దతు తెలిపింది. ఒక పక్క శ్రీలంక సైన్యం తమిళుల పట్ల క్రూరంగా వ్యవహరిస్తూ, మారణహోమానికి పాల్పడుతుంటే ప్రపంచ దేశాలు, మానవ హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తే ఫాసిస్టు జయలలిత మాత్రం బహిరంగంగానే ఈ హత్యాకాండను సమర్థించింది. 'ఉగ్రవాదంపై యుద్ధంలో ఇది తప్పనిసరి, ఇందులో కొంత మంది అమాయక ప్రజలు కూడా చనిపోతారు' అని అత్యంత దుర్మార్గంగా, నిసిగ్గుగా ప్రకటించింది. ఎ.ఐ.ఎమ్.డి.ఎమ్.కె., పి.ఎం.కె వంటి పార్టీలు ప్రజలలో పాలక పార్టీల పట్ల ఉన్న వ్యతిరేకతను ఉపయోగించుకోవడానికి ప్రయత్నించాయి తప్ప శ్రీలంక తమిళుల సమస్యలను పరిష్కరించేందుకు ఏనాడు ప్రయత్నించలేదు.

# 'నరేంద్ర మోడీ' కి బహిరంగ లేఖ

**– గోపాలకృష్ణ గాంధీ**

**మహాత్మా గాంధీ మనుమడైన గోపాల కృష్ణ గాంధీ మాజీ ఐ.ఏ.ఎస్ అధికారి మరియు రాయబారి. 2004–2009 మధ్య పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గానూ, 2005–2006 మధ్య బీహార్ అఫీషియేటింగ్ గవర్నర్ గానూ పనిచేశారు. ఆంగ్ల పత్రికైన 'ది హిందూ' కు ఆయన రాసిన వ్యాసానికి ఇది తెలుగు అనువాదం. అనువాదకులు : విశేఖర్**

**ప్రియమైన ప్రైమ్ మినిస్టర్ – డిసిగ్నేట్,**


నా హృదయ పూర్వక అభినందనలతో ఈ లేఖ రాస్తున్నాను. నిజాయితీగానే నేనిలా భావిస్తూ మీకు చెబుతున్నాను. ఇలా (అభినందనలు) చెప్పడం నాకు అంత తేలికయిన విషయం కాదు. ఎందుకంటే మీరు చేరుకున్న అత్యున్నత అధికార స్థానాన్ని మీరు చేరుకోగా చూడాలని కోరుకున్న వారిలో నేను ఒకరిని కాను. మీరు ప్రధాన మంత్రి అవుతున్నారని అనేక మిలియన్ల మంది ఆనంద పరవశులై ఎదురు చూస్తుంటే ఇంకా అనేక మిలియన్ల మంది నిజానికి వికలమై ఉన్నారన్న సంగతి మరే ఇతరుల కన్నా కూడా మీకు ఎక్కువగా తెలుసు.

మీరు అక్కడికి చేరుతారని చెప్పినవారిని నేను ఇటీవలి వరకూ నమ్మలేదు. కానీ, మీరు అక్కడికి చేరుకున్నారు! జవహర్ లాల్ నెహ్రూ కూర్చున్న డస్క్ దగ్గర కూర్చున్ని ఉన్నారు, లాల్ బహుదూర్ శాస్త్రి కూర్చున్న దగ్గర, ఇంకా, ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ పాలనకు వ్యతిరేకంగా చరిత్రాత్మకమైన పోరాటం చేసిన తర్వాత మరో గుజరాతీ అయిన మోరార్జీ దేశాయి కూర్చున దగ్గర, అనంతర కాలంలో మీ రాజకీయ శ్రేయోభిలాషి అటల్ బిహారీ వాజ్‌పేయ్ కూర్చున్న దగ్గర మీరు కూర్చుని ఉన్నారు. మీరు అక్కడికి వెళ్లడం ఇష్టం లేనివారు సైతం, మీరు అక్కడికే చేరుకున్న నిజాన్ని అంగీకరించక తప్పదు. ఆ అరుదైన అవకాశం మీకు దక్కడం సముచితమేనా అన్న విషయంలో నాకు భారీ సంకోచాలు ఎన్ని ఉన్నప్పటికీ, తీవ్రమైన అననుకూల సామాజిక సమూహానికి చెందిన మీ లాంటి కుటుంబానికి చెందిన వ్యక్తి భారత దేశ ప్రధాన మంత్రి కాగలిగినందుకు నేను మిమ్ముల్ని గౌరవిస్తాను. మన సర్వసమానత్వ రాజ్యాంగ దర్శనాన్ని ఆ అంశం అత్యంత సర్వోత్కృష్టమైన రీతిలో సుసంపూర్ణం కావించింది.

**దేశం అనే భావాన్ని పునర్దర్శించడం గురించి:**

మీరు ఒకప్పుడు 'చాయ్ వాలా' అయిన సంగతి గురించి దూకుడుగా, అవమానకరంగా కొందరు మాట్లాడినప్పుడు నాకు కడుపులో దేవేసినట్లుగా అయింది. 'జీవిక కోసం చాయ్ తయారు చేసి వడ్డించిన వ్యక్తి భారత ప్రభుత్వానికి నాయకత్వం వహించగలగడం ఎంతటి అద్భుతమైన విషయం!. అని నాకు నేను చెప్పుకున్నాను. ఒకరికి చెంచాగా బతకడం కంటే అనేకమందికి కప్పులు (చాయ్ ని )మోసే వాలాగా బతకడం ఎంతో మెరుగు!.

కానీ మిస్టర్ మోడీ, ఆ సంగతి చెప్పిన తర్వాత, భారత దేశ అత్యున్నత అధికార పీఠంపై కూర్చోబోతున్నందుకు మిలియన్ల మంది ఎందుకు వికలం చెందుతున్నారో మీకు చెప్పాలి. 2014 ఎన్నికల్లో ఓట్లు వేసిన ఓటర్లు ప్రధానంగా మోడీకి అనుకూలంగానా లేక వ్యతిరేకంగానా అని అలోచించి వేశారని మరే ఇతరుల కన్నా మీకు ఎక్కువ స్పష్టంగా తెలుసు. "నరేంద్ర మోడీ దేశానికి అత్యంత గొప్ప సంరక్షకుడు. కాగలరా, లేదా?" అని వారు తమను తాము ప్రశ్నించుకున్నారు. మన జనాభాలో 31 శాతం (మీకు పడిన ఓట్ల నిష్పత్తి అదే) మంది మీరు దేశానికి అత్యంత మెరుగైన సంరక్షకుడు కాగలరని. నిజానికి మిమ్మల్ని తమ రక్షకుడని వారు ఊహించుకున్నారు. ఆ ఊహలను మీరు పట్టుకోగలిగినందుకే బీజేపీ తాను గెలుచుకున్నన్ని సీట్లను గెలుచుకోగలిగింది.




ఛాయ్‌పే చర్చ ప్రకటన

సంరక్షకునిగా భావించలేదన్నది కూడా గమనించాల్సిన విషయమే. దేశం అంటే నిజంగా ఏమిటి అన్న విషయమై కూడా వారు మీతో ఏకీభవించలేదు. మోడీ గారూ, సరిగ్గా ఇక్కడే, ఈ విషయంపైనే దేశం అన్న ఈ భావన పైనే, మీరు ఎవరు సమకూర్చిన అధికారంతోనైతే ప్రధాన మంత్రి కార్యాలయంలోకి అడుగుపెడుతున్నారో, ఆ భారత రాజ్యాంగం యొక్క సారం అధారపడి ఉంది. దేశం అన్న భావనను మీరు పునర్దర్శనం చేయాలని నేను మిమ్మల్ని అర్థిస్తున్నాను.

## మైనారిటీలకు ధైర్యం ఇవ్వడం గురించి:

ఏకత్వం, స్థిరత్వం అంశాలను లేవనెత్తుతూ మీరు క్రమం తప్పకుండా సర్థార్ వల్లభ్ భాయ్ పటేల్ పేరునూ, ఔనత్యాన్నీ ఉల్లేఖించారు. సర్థార్ గారు రాజ్యాంగ సభకి చెందిన మైనారిటీల కమిటీకీ అధ్యక్షత వహించిన సంగతి మీకు తెలిసిన విషయమై. భారత దేశ రాజ్యాంగం భారతీయ మైనారిటీలకు విద్యా, సాంస్కృతిక, మతపరమైన కీలక హక్కులకు గ్యారంటీ ఇచ్చిందంటే అందుకు సర్థార్ పటేల్ గారికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఆయనతో పాటు కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిన ఇతర కమిటీ సభ్యులు, మరీ ముఖ్యంగా సిక్కు కపూర్తలా యొక్క క్రైస్తవ కూతురు రాజ్‌కుమారి అమృత్ కౌర్, కూడా ఉన్నారు.

మిస్టర్ మోడీ, మైనారిటీల అంశానికి సంబంధించిన రాజ్యాంగ దృక్పథాన్ని (విజన్) మొత్తంగా స్వీకరించి అనుసరించండి గానీ మీకు అనుకూలంగా మార్చి చెప్పడం గానీ లేదా సవరించడం గానీ, నీరు గార్చడం గానీ లేదా మాట్లు వేయడం గానీ చేయవద్దు. అత్యంత మొండివారయిన సర్థార్ ఆ కమిటిలో ఏమి చెప్పారో చదవడం మీకు ఆసక్తికరం కావచ్చు. అనేక మందిలో తీవ్రమైన భయాలు ఉన్నప్పటికీ, ఆ భయాలకు గొంతు ఇవ్వడానికి వారు ఎందుకు ధైర్యం చేయలేకపోతున్నారు? ఎందుకంటే మీరు సభల్లో ప్రసంగిస్తున్నప్పుడు భారత దేశ జనతను తనతో పాటు తీసుకెళ్లగల ఒక ప్రజాస్వామికవాదిని వినాలని వారు కోరుకుంటున్నారు తప్ప ఆజ్ఞలు (డిక్రీలు) జారీ చేసే సార్వభౌమ చక్రవర్తిని కాదు. మైనారిటీలకు పునర్ ధైర్యాన్ని ఇవ్వండి మిస్టర్ మోడీ. కానీ ఆశ్రితులను చేయవద్దు. అభివృద్ధి అన్నది భద్రతకు ఎంత మాత్రం ప్రతిక్షేపం కాజాలదు. 'ఒక చేతిలో ఖురాన్, మరో చేతిలో ల్యాప్‌టాప్' అంటూ మీరు మాట్లాడారు. లేదా అలాంటి అర్థం వచ్చే మాటలు ఏవో చెప్పారు. అటువంటి దృశ్యం వారికి ధైర్యం ఇవ్వలేదు, ఎందుకంటే వారిని భయపెట్టే తద్విరుద్ధ దృశ్యం వారిని భయ విహ్వలురిని చేస్తుంది. హిందువులుగా ముసుగు వేసుకుని, హిందూ పురాణేతిహాసం యొక్క డి.వి.డిని ఒక చేతిలోనూ, బెదిరించే త్రిశూలం మరో చేతిలోనూ ప్రదర్శించే హంతక బందిపోటు వారి ముందు నిలుస్తాడు.

పాత రోజుల్లో ఉప్పు పొడి పూసిన బెత్తాన్ని హెడ్ మాస్టర్లు తరగతి గదిలో ఒక మూల ఉంచి ప్రదర్శించేవారు. అందరికీ కనపడుతూ భయపెడుతూ ఉండే బెత్తం తాను ఎంచుకున్న చర్మాన్ని



ముజఫర్ నగర్‌లో రాళ్లురువ్వుతున్న ఆందోళనకారులు

ఒలిచివేయగల సామార్థ్యం తనకు ఉన్నదని గుర్తు చేస్తూ ఉండేది. 42 మంది ముస్లింలు, 20 మంది హిందువులు మరణించడంతో పాటు 50 వేలమందికి పైగా నిరాశ్రయులను కావించిన కొద్ది నెలల క్రితం ముజఫర్‌నగర్ అల్లర్ల జ్ఞాపకాలు ఆ ఉప్పు బెత్తమై హెచ్చరిస్తున్నాయి. "జాగ్రత్త, మీకు జరిగేది కూడా ఇదే" ఒక ప్రజాస్వామ్యంలో ఎవ్వరైనా సరే ఎదుర్కోకూడని భయం ఇదే. కానీ అనేక మిలియన్ల మంది పగటి భయాలలోకి, రాత్రి పీడనలలోకి ప్రవేశించిన సందేశం ఇదే. ఆ భయాలను పారద్రోలడం, మిస్టర్ మోడీ ఇప్పుడు మీ చేతుల్లో పని. అది చేయగల అధికారం, శక్తి మీకున్నాయి. అది మీ హక్కు మరియు మీ బాధ్యత కూడా. అందుకు విరుద్ధంగా మీ చెంతకు వచ్చే కొద్ది బుద్ధుల సలహాలను అధిగమించినట్లయితే, మీరా భయాన్ని ప్రారద్రోలగలరని నేను నమ్ముతున్నాను.

పశ్చిమ పంజాబ్ నుండి తరిమివేయబడ్డ సిక్కులు, హిందువులకు మల్లే, కాశ్మీరీ పండిట్లకు మల్లే భారత దేశంలోని మైనారిటీలు అందరూ, ఒక ముస్లింలు మాత్రమే కాదు సుమా, తమ మనో ఫలకాలపై గాయపడ్డ చారికలు కలిగి ఉన్నారు. నిజంగానే జరుగుతాయో లేక ఉద్దేశ్యపూర్వకంగా రెచ్చగొట్టినందువల్ల జరుగుతాయో...అకస్మాత్తుగా అల్లర్లు జరగొచ్చన్న భయం, అవి మళ్ళీ మరిన్ని రెట్లు పగ సాధింపు పేరుతో తిరిగి తలుపు తడతాయన్న భయం, వారిని పట్టి పీడిస్తోంది. అవి మహిళలను అత్యంత ప్రత్యేకంగా లక్ష్యం చేసుకుంటున్నాయి.

దళితులు, ఆదివాసీలు, ముఖ్యంగా మహిళలు, తమ జీవితాల్లోని ప్రతి ఒక్క నిమిషమూ అవమానపడుతూ, దోపిడీకి గురవుతూ బతుకులీడుస్తున్నారు. తిరస్కారం, వివక్ష, కక్ష సాధింపుల కారణంగా నిరంతరం అసౌకర్య భారం వారిని పౌరవిహీనం చేస్తోంది.

క్రుంగదీస్తోంది. ఆ భారాన్ని, మిస్టర్ మోడీ, మౌఖికంగానూ, స్పష్టంగానూ పట్టించుకోండి. వారి ప్రయోజనాలకు మొట్టమొదటి ప్రతినిధి మీరే అవుతారన్న హామీ ఇవ్వడం ద్వారా అది మీరు సాధించగలరు.

బహుళత్వ రిపబ్లిక్‌కు బదులుగా చక్రవర్తి తరహా ఏకత్వ భాషను, అనేకత్వాల దార్శనికతకు బదులు ఏకీకృత శబ్దజాలాన్ని , వైవిధ్యాల లోపలా, పైనా వర్థిల్లే సున్నితత్వానికి బదులు ఏకీకరించాలన్న వ్యాకరణాన్ని ప్రయోగించే అవివేకాన్ని, దుడుకుతనాన్ని ఏ ఒక్కరూ కలిగి ఉండకూడదు. భారత దేశం వైవిధ్యభరితమైన అడవి. అత్యంత గొప్పదైన తన వైవిధ్యతను నిరంతరాయంగా స్థిరపరిచే పచ్చి ఎరువును వేసి తనను పోషించాలని అది మిమ్మల్ని కోరుతోంది. అంతే తప్ప ఒక రాజకీయ ఏకేశ్వరవాదం యొక్క ఏక వర్ణక ఏక సంస్కృతీ వాదాన్ని తన ముందు ఉంచాలని కోరుకోవడం లేదు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 పట్ల మీరు తీసుకున్న వైఖరి, అరిగిపోయి అర్థరహితంగా మారిన ఉమ్మడి పౌరస్మృతి, ఆయోధ్యలో రామమందిరం మున్నగు అంశాలతో పాటు మన ఉత్తర మరియు వాయువ్య ప్రాంతంలోని హిందూ శరణాగతుల పట్లా, మన తూర్పు ఈశాన్య ప్రాంతాల్లోని ముస్లిం శరణాగతుల పట్లా మీరు జారీ చేసినవిగా మీడియా నివేదిస్తున్న ప్రకటనలు నమ్మకానికి బదులు భయాన్ని కలిగిస్తున్నాయి. మూకుమ్మడి భయం, మిస్టర్ మోడీ, భారత రిపబ్లిక్ లక్షణం కాజాలదు. ఇంకా చెప్పాలంటే భారత దేశ ప్రధానిగా మీరు రిపబ్లిక్ యొక్క కనపడని అహం (ఆల్టర్ ఈగో).

భారతీయ మైనారిటీలు కేవలం భారత దేశంలోని ఒక భాగం మాత్రమే కాదు, వారు దేశం ప్రధానంలోనే కలగలిసి పోయినవారు. తాడును ఎవ్వరైనా కాల్చి నుసిచేయవచ్చు. కానీ ఎవ్వరూ దాని నుండి పురిని వేరు చేయలేదు. భారత్ మాతాకి జై, నిస్సందేహంగా మిస్టర్ మోడీ, కానీ నేతాజీ సుభాష్ చంద్రబోస్ కొమ్ము బూర నుండి వెలువడ్డ బలీయమైన 'జై హింద్" నినాదాన్ని అదెంత మాత్రం కొట్టివేయజాలదు.

ఇది మీకు చారిత్రాత్మక విజయం, మిస్టర్ మోడీ, అందుకు మిమ్మల్ని మరోసారి అభినందిస్తున్నాను. చరిత్రాత్మక ఇన్నింగ్స్ తదనంతరం సంభవించనివ్వండి. ఆశ్చర్యకారకాలతో ప్రపంచాన్ని నివ్వెరపరచండి. మీ మద్దతుదారులు మీ నుండి దానిని ఆశించకపోవచ్చు. కానీ మీరావిధంగా ఆవిష్కృతం కావాలని మరింతమంది వేచి చూస్తున్నారు. మీ తెలివితేటలు అపారమైనవి, మీ ముందరి తరం నుండి ఆవాంఛనీయ మరియు అనాసక్తమైన సలహా వచ్చినట్లయితే స్వీకరించడానికి మీరు సిద్ధపడవచ్చు. మీ మౌలిక మద్దతుదారుల కరతాళ ధ్వనులకు బహుమతులివ్వండి, కానీ అదే విధంగా మీకు మద్దతు ఇవ్వనివారి నుండి నమ్మకాన్ని సంపాదించుకోండి.

మైనారిటీస్ కమీషన్‌లో మీరు పునర్నియామకాలు చేసేటప్పుడు అన్ని పేర్లను ఇవ్వాల్సిందిగా ప్రతిపక్షాలను కోరండి. మార్పులు లేకుండా వాటిని ఆమోదించండి. షెడ్యూల్ కులాలు మరియు తెగలు, భాషీయ మైనారిటీల విషయంలోనూ అదే పద్ధతిని పాటించండి. తదుపరి ప్రధాన సమాచార కమీషనర్ (సి.ఐ.సి)ను ఎన్నుకునేప్పుడు గానీ, తదుపరి సి.ఏ.జి, సి.వీసీలను నియమించేప్పుడు సెలక్షన్ కమిటీలలోని ప్రభుత్వేతర సభ్యుల సిఫారసులను, అవి పాక్షికం కానంతవరకూ, అనుసరించి వెళ్ళండి. మీరు బలవంతులు కనుక మీకు అటువంటి విపత్ శ్రమ తీసుకోగలరు.

**దక్షిణాది లోటును సవరించుకోవడం గురించి:**

మిస్టర్ మోడీ, మీ భారతీయ లెక్కలో దక్షిణాది లోటు ఒకటుంది. మీ విజయోల్లాసానికి తాపడం అయి ఉన్న హిందీ – బెల్టు సాదృశ్యం తనను తాను ఇరుకు చేసుకుని ఉత్తర – దక్షిణ విభజనను సృష్టించకూడదు. మీరు దక్షిణాదికి చెందిన వ్యక్తిని ఉప ప్రధానిగా నియమించండి. ఆయన రాజకీయ నాయకుడు ఎంతమాత్రం కాకూడదు. నిపుణుడయిన సామాజిక శాస్త్రవేత్త లేదా పర్యావరణవేత్త, ఆర్థిక వేత్త లేదా జనాభా శాస్త్రవేత్త ఇలాంటి వారయితే మేలు. నెహ్రూ కేబినెట్‌లో షణ్ముఖ చెట్టి, జాన్ మత్తయి, సి.డి.దేశ్‌ముఖ్, కె.ఎల్.రావులు ఉండేవారు. వాళ్లు కాంగ్రెస్ నాయకులు కాదు. కనీసం రాజకీయ నాయకులు కూడా కాదు. ఇందిరా గాంధీ కొలువులో ఎస్.చంద్ర శేఖర్, వి.ఆర్.కె.వి రావులు ఉండేవారు.

రాజ్యసభకు నామినేట్ చేయబడిన ప్రొఫెసర్ ఎం.ఎస్. స్వామినాధన్, శ్యామ్ బెనెగల్ లాంటి వారిని యు.పి.ఏ ప్రభుత్వం ఎందుకని మంత్రులుగా నియమించలేదో నా జీవితకాలంలోనైనా అర్థం కాకపోవచ్చు. ఒక సంప్రదాయం ఉంది. కొంతమంది దానిని ఆరోగ్యకరమైన సంప్రదాయం అని కూడా అంటుంటారు. నామినేటెడ్ సభ్యులను మంత్రులుగా నియమించకూడదన్నది ఆ సంప్రదాయం. కానీ అవసరాలు అవసరాలే. నామినేటెడ్ సభ్యులే అయిన ప్రొఫెసర్ నూరల్ హసన్, మనకు పనిచేసిన విద్యావంతుల్లో అత్యంత శ్రేష్టులు!

సార్వభౌమ మరియు సైద్ధాంతిక ఉదాహరణలు మిమ్మల్ని అమితంగా ఆకర్షిస్తాయి. కనుక వాటిని సాధించేందుకు మీరు చేసే పోరాటంలో ఒక మహారాణా ప్రతాప్ అవండి కానీ విశ్రాంతిలో ఉన్నప్పుడు ఒక అక్బర్ అవండి. తప్పదనుకుంటే హృదయంలో సావర్కార్‌గా ఉండండి. కానీ ఆలోచనల్లో అంబేద్కర్‌లా ఉండండి. మీ డి.ఎన్.ఏలో సుశిక్షిత ఆర్.ఎస్.ఎస్ విశ్వాసిగానే ఉండండి. కానీ అవసరం వచ్చినపుడు మీకు ఓటు వేయని 69 శాతం మంది కోసం వారు కోరుకునే విధంగా హిందుస్థాన్ యొక్క వజీర్ – ఏ – ఆజమ్ కావాలి.

మన దేశం యొక్క అత్యున్నత పీఠాన్ని అధిష్టించిన సందర్భంగా మీకు అన్నీ విధాలుగా మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నాను.

నేను మీ సహచర పౌరుడిని,

**గోపాల కృష్ణగాంధీ**

# పోలవరాన్ని పున: సమీక్షించాలి

– టి. శివాజీరావ్

రాష్ట్రాభివృద్ధిలో భాగంగా భారీ వ్యయంతో నిర్మించ తలపెట్టిన పోలవరం ప్రాజెక్టు ప్రారంభం నుండీ వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. వ్యవసాయం, విద్యుదుత్పత్తి, త్రాగునీరు, పారిశ్రామికాభివృద్ధే పోలవరం ప్రాజెక్టు ముఖ్యోద్దేశమని గత అరవై ఏళ్ళుగా ప్రభుత్వాలు చెబుతూనే ఉన్నాయి. ఈ ప్రాజెక్టును బ్యారేజిగా నిర్మించి దాదాపు 100 శతకోటి ఘనపుటడుగుల గోదావరి నీటిని కృష్ణానదిలోకి విజయవాడ వద్ద కలిసేటట్లు చేయవచ్చని ప్రఖ్యాత ఇంజనీర్లు ఎ.ఎన్.ఖోస్లా 1953లోను, గుల్హటి 1963లోను కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. అలాగే పోలవరం బ్యారేజికి తగినంత నీరు సంవత్సరం పొడవునా సరఫరా చేసేందుకు గోదావరి ఎగువ ప్రాంతంలో దాని ఉప నదులైన ఇంద్రావతి, ప్రాణహితలపై భారీ జలశాలయాలు, జలవిద్యుత్ కేంద్రాలు నిర్మించాలని చెప్పారు.

నిపుణుల సిఫారసులను పెడచెవిన పెట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నివేదికను 1970లో తయారుచేసి, మళ్ళీ దాని స్వరూపాన్ని 1978లో మార్చింది. ఒరిస్సాలోని మోటు, ఛత్తీస్‌ఘడ్‌లోని కోంటా తాలూకాలోని గిరిజన గ్రామాలు విపరీతమైన ముంపుకు గురయ్యే ప్రమాదమున్నందున వరదనీటి మట్టం 150 అడుగులకు మించరాదని బచావత్ ట్రిబ్యునల్ ఎదుట ఆ రాష్ట్రాలు షరతులు పెట్టాయి. ఆ మేరకు కేంద్ర జలవనరుల సంఘం 1979లో ఆయా రాష్ట్రాలకు తగు సూచనలతో లేఖ రాయడం జరిగింది. ఆ తీర్పు ప్రకారం పోలవరం వరద తూముల సామార్థ్యం 36 లక్షల క్యూసెక్యుల గరిష్ట వరద ప్రవాహానికి మాత్రమే పరిమితమై నిర్మించాలని,



**2006లో వచ్చిన వరదలో నీట మునిగిన గోదావరి పరివాహక ప్రాంతం**

ప్రాజెక్టు ఎత్తు సముద్ర మట్టానికి 150 అడుగుల స్థాయి వరకు ఉండాలన్న షరతులతో కూడుకున్నది. దురదృష్టవశాత్తు 1986 ఆగస్టునెలలో దాదాపు 36 లక్షల క్యూసెక్కుల స్థాయిలో వరద వచ్చింది. ఈ వరదను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 500 సంవత్సరాలకొక్క సారి వచ్చే వరదగా పరిగణించి 2005లో ఈ అంచనాలననుసరించి ముంపుకు గురయ్యే స్థలాలను, గ్రామాలను, అడవులను గుర్తించడమే కాకుండా దానికి తగ్గట్టు నిర్వాసితుల పునరావాస పథకాలను రూపొందించి కేంద్ర ప్రభుత్వ అనుమతిని, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతిని పొందింది. అంతే కాకుండా పొరుగు రాష్ట్రాల్లో ముంపుకు గురవుతున్న ప్రాంతాల విషయమై ఆయా రాష్ట్రాలతో సంప్రదించి, అనుమతులు పొందకుండానే ప్రాజెక్టు కాలువ నిర్మాణాన్ని బచావత్ ట్రిబ్యునల్ తీర్పుకు వ్యతిరేకంగా చేపట్టి వేగవంతం చేస్తోంది.

బచావత్ ఒడంబడికలో ఉన్న గరిష్ట వరదస్థాయిని 36 లక్షల నుండి 2006లో ఎగువ రాష్ట్రాల అనుమతి లేకుండానే దాదాపు 50 లక్షల స్థాయికి పెంచుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి తదనుగుణమైన మార్పుల్ని చేయమని కేంద్ర జలసంఘాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరింది. దీంతో ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు ముంపు విషయంలోనూ, గరిష్ట వరద స్థాయిని పెంచడంతోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒంటెద్దు పోకడలు పోతోందని సుప్రీం కోర్టులో దావావేశాయి. దీనికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వరద పెరగడం వల్ల ముంపు ప్రాంతాలు పెరిగినప్పటికీ నష్టపరిహారాన్ని పెంచడానికి సిద్ధంగా ఉన్నామనీ, వరద నష్టాన్ని నివారించడానికి గోదావరి దాని ఉపనదుల గట్టులను ఇరువైపులా పటిష్టమైన కరకట్ట గోడలను ఎంత ఖర్చయినా నిర్మిస్తామనీ వాదిస్తోంది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పు తరువాత 1985 నుండి ప్రాజెక్టుల రూపకల్పనలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక మార్పులు వచ్చాయి.

అంతర్జాతీయ భారీ జలాశయాల సంఘ అధ్యక్షులుగా ఉన్న ఫ్రాన్సు, స్పెయిన్ దేశాల నిపుణులైన లెంపరరీ మరియు బెర్గ్‌ల ప్రకారం గరిష్ట వరదను బేరిజు వేసేటప్పుడు చారిత్రకంగా సంభవించే వరదలకంటే రెండు లేక మూడు రెట్లు ఎక్కువ స్థాయిలో అంచనాలుండాలన్నారు. దాని ప్రకారం పోలవరం ప్రాజెక్టు రూపకల్పనలో గరిష్ట వరద ప్రవాహం 2005 నాటికి

రాష్ట్ర ప్రభుత్వం ఊహించిన 36 లక్షల క్యూసెక్కుల కంటే కనీసం రెట్టింపయినా ఉండాలి. కానీ ఆగస్టు 2006లో సంభవించిన భారీ వరద 28 లక్షల కూసెక్కులకే 100 గ్రామాలు, అదనంగా భద్రాచలం ప్రాంతం మునిగిపోవడంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలవరం ప్రాజెక్టు రూపకల్పనకై దాదాపు 50 లక్షల క్యూసెక్కులకు గరిష్ట వరద పరిమాణాన్ని ఎగువ రాష్ట్రాల అనుమతులు లేకుండానే పెంచారు. అంతర్జాతీయ నిపుణుల సూచనలకు ఇవన్నీ విరుద్ధంగానే ఉన్నాయన్నది తేటతెల్లం.

ప్రకృతి వైపరీత్యాల మూలంగా సంభవించే ప్రమాదాలు జరిగినపుడు ఇలాంటి భారీ ప్రాజెక్టులకు సంభవించే నష్టాలు భయంకరంగా ఉంటాయన్న వాస్తవాన్ని ప్రభుత్వం విస్మరించడానికి వీలులేదు. కోట్లలో ఆస్తినష్టం, లక్షల్లో ప్రాణ నష్టం ఉంటుందన్నది గమనార్హం. ఇటువంటి ఘోర విపత్తుల్ని నిరోధించి గోదావరి డెల్టా సుస్థిరాభివృద్ధి సాధించాలంటే పోలవరం ప్రాజెక్టు బదులు బ్యారేజి నిర్మించడం చౌకయిన, భద్రమైన చర్య అవుతుంది. ప్రఖ్యాత ఇంజనీరు డాక్టర్ కె.ఎల్. రావు పోలవరం ప్రాజెక్టు ప్రమాదభరితమైందని 1983లోనే హెచ్చరించారన్న విషయాన్ని మరవకూడదు. దానిస్థానే కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో రెండు పెద్ద జలాశయాలు ఆపైన పెద్ద బళ్ళాల, ఎల్లంపల్లి, ఎదిర, దుమ్ముగూడెం, పోలవరం దగ్గర అదనంగా బ్యారేజీలు నిర్మించినట్లయితే గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవచ్చు. ఇటీవలి కాలంలో రష్యన్ నిపుణులు వ్లాదిమిర్ స్మఖ్తిన్ పోలవరం దగ్గర ఆశించినంత నీరు లభ్యంకాదని, అందువల్ల పోలవరం నుండి కృష్ణానదిలోకి నీరు మళ్ళించడం సాధ్యం కాదని నిరూపించారు. ఇదే అంశాన్ని కొన్ని స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వాలు లేవనెత్తుతూ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యాల దాఖలు చేశాయి.

75 శాతం నీటి లభ్యతవద్ద నదిలో ప్రవహించే నీటిని అనేక సంవత్సరాల గణాంకాలను పరిశీలించి రోజువారీ,నెలవారీ, సంవత్సరిక ప్రవాహాలను లెక్కగట్టినట్లయితే రోజువారీ, నెలవారీ ప్రవాహాల మధ్య అంతగా తేడా ఉండదు. అదే సంవత్సరిక ప్రవాహంతో సరిపోల్చినట్లయితే నెలవారీ ప్రవాహం దాదాపు 10వ వంతు మాత్రమే ఉంటోంది. గోదావరిలో పోలవరం వద్ద లభ్యమయ్యే 530 టిఎంసి నీరు అదనంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వ జాతీయ జలవనరుల సంస్థ (ఎన్‌డబ్యుడిఎ) వాదిస్తుంటే రష్యన్ నిపుణులు తయారు చేసిన అంతర్జాతీయ నీటి వనరుల నిర్వహణ సంస్థ (ఐడబ్ల్యుఎంఐ)కు నివేదించిన రిపోర్టులో పోలవరం వద్ద భారీ స్థాయి నీటి కొరత 1300 టిఎంసిలుగా ఉందని తెలియజేసింది. దీని ప్రకారం గోదావరి నుండి కృష్ణలో ప్రజలు, ప్రభుత్వం ఆశించినట్లుగా నీరు కలవడం అసాధ్యమని రష్యన్ నిపుణులు నొక్కి వక్కాణిస్తున్నారు. అదే విషయాన్ని ప్రఖ్యాత ఇంజనీరు డాక్టర్ కె.ఎల్. రావు కూడా 1983లోనే చెప్పారు. అంతేకాక భూమండలంపై కాలుష్యం, ఉష్ణోగ్రత, వాతావరణ స్థితిగతులలో వస్తున్న దుష్పరిణామాలవల్ల గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో రాబోయే కాలంలో వచ్చే తుపానుల ఉధృతి పెరగడం, తత్ఫలితంగా సంభవించే కుంభవృష్టి తీవ్రత, వ్యవధి పెరగనుందని, ఫలితంగా వరదల ప్రమాణం కూడా విపరీతంగా 20 నుండి 30 శాతం పెరుగుతుందని నిపుణుల అంచనా, ఇన్ని కష్టాలకోర్చి పోలవరం ప్రాజెక్టును అనుకున్నట్లే పూర్తిచేస్తే సాగు రీత్యా గణనీయమైన అభివృద్ధి సాధ్యమా అంటే అదికూడా అవాస్తవమని లెక్కలు చెప్తున్నాయి.

క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్లయితే ఈ ప్రాజెక్టు వల్ల కుడి కాలవ కింద 3.2 లక్షల ఎకరాలకు, ఎడమకాల కింద 4 లక్షల ఎకరాలకు నీరు సరఫరా అవుతుందని ప్రతిపాదనలు చెప్తున్నప్పటికీ, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తాడిపూడి పుష్కరం ఎత్తిపోతల పథకాలు, చాగల్నాడు పథకం తదితర నీటి వనరుల పథకాలు పెంచడంతో సాగులోకి వచ్చే దాదాపు 4.5 లక్షల ఎకరాలు పోలవరం ఆయకట్టులో భాగమైపోతుంది. దాంతో పోలవరం ప్రాజెక్టు వల్ల అదనంగా సాగులోకి వచ్చే భూమి 2 నుండి 3 లక్షల ఎకరాల వరకు మాత్రమే ఉంటుందని అంచనా. ఇక ఈ ప్రాజెక్టు నుండి 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేద్దామనుకొన్న ప్రభుత్వ ఆశయం నెరవేరడానికి వర్షాకాలం తప్ప మిగతా కాలంలో సాధ్యం కాదు.

ఏవైపు నుండి చూసినా పోలవరం ప్రాజెక్టును ఇంత భారీ స్థాయిలో నిర్మించడం లాభంకంటే నష్టాలే అధికం అన్నది నిపుణుల అంచనా. ఇప్పటికైనా రాయలసీమ, తెలంగాణ, కృష్ణా డెల్టా ప్రాంతాలలో వ్యవసాయాభివృద్ధికి పోలవరం ప్రాజెక్టును ఎలా రూపకల్పన చేస్తే బాగుంటుందో తెలుసుకోవడానికి స్వాతంత్ర్య సమరయోధులను, విద్యావేత్తలను, పర్యావరణవేత్తలను ఆహ్వానించి వారి సలహాలు, సూచనలను కూడా ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవడం మంచిది. భవిష్యత్ తరాల బాగోగులను కూడా దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు, న్యాయస్థానాలు ఆలోచనాత్మకంగా వ్యవహరించి, భారత ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయడానికి రాజ్యాంగంలోని 51ఎ(జి) నియమావళి ప్రకారం పర్యావరణ, ప్రకృతి వనరులను సంరక్షించాల్సిన సమయం ఆసన్నమైనది.

**– వ్యాసకర్త గీతం యూనివర్సిటీ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.**

# విధ్వంసానికి సజీవ సాక్షం
# పోలవరం ప్రాజెక్ట్

– జంజర్ల రమేష్ బాబు


ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం – 2014 ద్వారా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించింది. దానితో పాటు పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించింది. 90 శాతం కేంద్ర నిధులతో దానిని పూర్తి చేసే బాధ్యతను కూడా తన భుజాన వేసుకుంది. తద్వారా నాలుగు లక్షల మంది ప్రజలను జలసమాధి చేసే కుట్రలకు ఆమోదం తెలిపింది. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల్లో 2 లక్షలకు పైగా ఆదివాసులే ఉన్నారు. వీరిలో అంతరించి పోతున్న జాతికి చెందిన కొండరెడ్లు ఉన్నారు. వీరి ప్రస్తుత జనాభా కేవలం 7 వేలు మాత్రమే.

పోలవరం ప్రాజెక్టు ఆలోచనకు 150 యేండ్ల చరిత్ర ఉన్నది. 1870లోనే నిర్మించేందుకు బ్రిటీష్ ప్రభుత్వం ప్రయత్నాలు చేసినా అక్కడి నేల అనువుగాలేకపోవడంతో విరమించుకున్నారు. మళ్ళీ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మద్రాసు ప్రభుత్వం 1940వ దశకంలో ఆలోచనలు చేసినా, ఆ ప్రాంతంలో డ్యాం నిర్మాణం సాధ్యం కాదని నివేదికలు స్పష్టం చేసాయి. తదనంతరం తెలుగు దేశంలో హాయంలో 1986లో సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధమైనా కేంద్ర జలసంఘం అభ్యంతరం వల్ల అది అటకెక్కింది. అలా ఒక్కటిన్నర శతాబ్దకాలంగా పక్కకు పెట్టబడిన పోలవరం ప్రాజెక్టు, 2004లో డా॥ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్య మంత్రి కాగానే ఆగమేఘాల మీద కదిలింది. ఆయన ఆడింది ఆటగా, పాడింది పాటగా నడిచింది. రైతు వేషమేసి పాదయాత్రలు చేసి తమను అధికార పీఠమెక్కించిన వైఎస్ఆర్‌ను ఏమీ అనలేని బలహీనత నాటి కాంగ్రెసు ప్రభుత్వానిది. అందుకే స్థల అనుమతికి ధరఖాస్తు చేసిన ఆరునెలల్లోనే 3 మంత్రిత్వ శాఖలు తమ ఆమోదం తెలిపాయి. అందుకు రాజ్యాంగం ఆదివాసులకు కల్పించిన 5వ షెడ్యూల్ రక్షణలు, వివిధ చట్టాలనన్నింటినీ తుంగలో తొక్కి పక్క రాష్ట్రాల అభ్యంతరాలను సైతం పట్టించుకోలేదు.

పోలవరం ప్రాజెక్టు ప్రకిటిత లక్ష్యాల ప్రకారం ఆంధ్ర ప్రాంతంలోని సుమారు 7 లక్షల 20 వేల ఎకరాలకు సాగునీరు, గోదావరి, కృష్ణా నదులు అనుసంధానం ద్వారా 80 టిఎంసీల నీటిమళ్ళింపు ద్వారా ఆయకట్టు స్థిరీకరణ, 960 మెగావాట్ల జలవిద్యుత్, విశాఖ పట్టణం పారిశ్రామిక వాడకు, 600 గ్రామాలకు



2006లో వచ్చిన వరదలో నీట మునిగిన భద్రాచలం పట్టణం




1986 వరదల్లో నీట మునిగిన భద్రాదిని చూపుతున్న ఆలయ అర్చకులు



ఖమ్మం జిల్లాలో నివసిస్తున్న ఆదివాసీ కొండరెడ్ల కుటుంబం

సాగు, త్రాగునీరుతోపాటు నౌకాయానం టూరిజంల కొరకు ఉద్దేశింపబడింది. కానీ వీటి వెనకాల కోస్తా తీర ప్రాంతంలో నెలకొల్పబడుతున్న పెట్రోకెమికల్ కారిడార్‌కు, కాకినాడ సెజ్‌లకు నీటి సరఫరా, ఈ దేశ సంపదను బహుళజాతి కంపనీలకు, కాంట్రాక్టర్ల ఖజానాకు తరలించడమే అసలు ఉద్దేశ్యం. ఈ ప్రాజెక్టు కారణంగా 4 రాష్ట్రాల్లోని 400కు పైగా షెడ్యూలు గ్రామాలు, 4లక్షల మంది ప్రజానీకం, 637 చ.కి.మీ భూభాగం, 8 వేల ఎకరాలకు పైగా రిజర్వ్ ఫారెస్టు, అరుదైన జంతుజీవ జాతులు అంతే కాకుండా పాపికొండలు లాంటి సహజ పర్యాటక కేంద్రాలు, పేరంటాలపల్లి, శ్రీరామగిరి, భద్రాచల రామాలయం లాంటి ఆధ్మాత్మిక స్థలాలను సైతం ఈ ప్రాజెక్టు మింగేయనుంది.

Bhadrachalam, Bergampahad, Chintur,
village wise details
134
205 vill

Those working as owner cultivators get the direct and indirect benefits of agriculture as a reliable source of livelihood.

Table- 1

| Sl. No. | Name of the Mandal | POPULATION-2011 | | | | | | Geo. Area | Forest Area |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | Scheduled Tribes | | | Total (ST+SC+Others) | | | | |
| | | Male | Female | Total | Male | Female | Total | | |
| 1 | Bhadrachalam | 12417 | 12875 | 25292 | 44029 | 45019 | 89048 | 37269 | 25514 |
| 2 | Bergampahad | 7789 | 7113 | 14902 | 32673 | 31907 | 64580 | 37058 | 18673 |
| 3 | Chintur | 15088 | 16151 | 31239 | 19899 | 20826 | 40725 | 95529 | 84380 |
| 4 | Kukunoor | 4556 | 4615 | 9171 | 14104 | 14288 | 28392 | 27134 | 17989 |
| 5 | Kunavaram | 7362 | 8524 | 15886 | 12351 | 13894 | 26245 | 20382 | 5435 |
| 6 | VR Puram | 7528 | 8584 | 16112 | 12171 | 13426 | 25597 | 47473 | 35695 |
| 7 | Velairpad | 6736 | 7504 | 14240 | 11007 | 11875 | 22882 | 41544 | 29471 |
| | Total | 61476 | 65366 | 126842 | 146234 | 151235 | 297469 | 306389 | 217157 |

Source: Bhadrachalam ITDA Report —2011

**2011 జనాభా లెక్కల ప్రకారం పోలవరం ముంపు ప్రాంతాలైన ఏడు మండలాల్లోని నిర్వాసితులు**

గత దశాబ్దం కాలంగా అభివృద్ధి పేరిట జరుగుతున్న విధ్వంసానికి వ్యతిరేకంగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, ఆదివాసీ సంఘాలు ఉద్యమిస్తున్నారు. మెమోరాండంలు, నిరసనలు, ధర్నాలతోపాటు గ్రామసభల తీర్మాణాల ద్వారా తమ వ్యతిరేకతను తెలియపర్చారు. అంతేకాకుండా ప్రభుత్వ కార్యాలయాలను దిగ్భంధించడం, సర్వే అధికారులను బంధించడంలాంటి వాటి ద్వారా తమ ఆగ్రహాన్ని వెల్లడించారు. కానీ ప్రభుత్వం వారి ఆవేదనను అర్థం చేసుకోకుండా కుట్ర పూరితంగా ఉద్యమాన్ని దెబ్బతీసింది. ఆదివాసీ, అదివాసేతర ప్రజల మధ్యన, ఆదివాసీ నాయకత్వాల మధ్యన విభజన తీసుకురాగలిగింది. పరిహారాలు, ప్రలోభాలు, బెదిరింపులతో ఉద్యమాన్ని చల్లార్చేందుకు ప్రయత్నించింది. న్యాయస్థానాలను సైతం తప్పుడు సమాచారంతో పక్కదోవ పట్టించింది.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సందర్భగా కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించడం, ముంపు ప్రాంతాలను ఆంధ్రప్రాంతంలో కలపడం ద్వారా మళ్ళీ ఆదివాసీ గూడాల్లో కలవరం రేపుతోంది. కేవలం సీమాంధ్ర రాజకీయ నాయకులను, పెట్టుబడిదారులను సంతృప్తి పరిచేందుకు చేస్తున్న కుట్రే ఇది. పోలవరం ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ఇప్పటికే 8.75 లక్షల ఎకరాలకు పుష్కరం, తాడిపూడి, ఏలేరు, కృష్ణవేణి, తాండవలాంటి పలు ప్రత్యామ్నాయ పథకాలు సాగునీరు అందిస్తుండగా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఎవరికొరకు? ప్రాజెక్టు నిర్మాణ ప్రాంత భౌగోళిక స్థితిగతులు, సాంకేతికాంశాల సాధ్యాసాధ్యాలపై ఇంజనీరింగ్, జల నిపుణులు, పర్యావరణ సామాజిక వేత్తలు, హక్కుల, ప్రజాసంఘాలు అభ్యంతరాలను ఎందుకు పట్టించుకోవడం లేదు? డ్యాం ప్రమాదవశాత్తు బద్దలైతే, క్రింది భాగంలోని సుమారు 40 లక్షల ప్రజల ప్రాణాల రక్షణ ఎవరిది? పర్యావరణ, అడవుల మంత్రిత్వ శాఖ 2011లో చాలా స్పష్టంగా " ఈ అంశంపై వివాదం తేలేవరకు నేలమీద ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టరాదని" పేర్కొనప్పటికీ టెండర్లు పిలవడంలో ఆంతర్యమేమిటి? ముంపు గ్రామాల్లో ప్రజాభిప్రాయసేకరణ చేయని కారణంగా అనుమతిని రద్దుచేస్తామని నోటిసులు జారీ చేయలేదా? ఇన్ని రాజ్యాంగ వ్యతిరేక చర్యలు ఎవరి ప్రయోజనాలకొరకు?

ఆదివాసులను జలసమాధి చేసే పోలవరం ప్రాజెక్టుపై అన్ని రాజకీయ పార్టీల వైఖరి కాస్త భిన్నంగా ఉన్నప్పటికీ అంతిమంగా ఇది ఆదివాసులను బలిపెట్టేదే. ప్రాజెక్టు ఎత్తు తగ్గించమని కొన్ని పార్టీలు, డిజైన్ మార్చితే అభ్యంతరం లేదని కొన్ని పార్టీలు, మెరుగైన నష్టపరిహారం, పునరావాసం, ఆయకట్టు పరిధిలో భూములివ్వాలని ఇంకొన్ని పార్టీలు సన్నాయినొక్కులు నొక్కుతున్నాయి.

ఆదివాసులు అభివృద్ధి ఫలాలు అనుభవించేందుకు పోలవరం ప్రాజెక్టు అత్యవసరం అంటున్నాయి. దేశవ్యాపితంగా ఈనాటి వరకు అభివృద్ధి ప్రాజెక్టుల కారణంగా నిర్వాసితులైన ప్రజలలో 40 శాతం ఆదివాసులు, 16 శాతం దళితులేనన్నది నిర్వివాదాంశం,పునరావాసం పొందింది కేవలం 9 శాతం అంటే అభివృద్ధి ఫలాలు పొందుతున్నదెవరో తేటతెల్లం. 60




**పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జలదీక్ష చేస్తున్న పీపుల్స్ అగనెస్ట్ కమిటీ సభ్యులు (ఆంధ్ర, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్)**

సంవత్సరాలుగా ఆదివాసి ప్రాంతాల్లో రాని అభివృద్ధి వాదన ఇంత హఠాత్తుగా ఎందుకు చర్చకొస్తున్నది? ఇది వారి కాళ్ళ కింది సంపదను మల్టినేషనల్ కంపనీల ఖజానాకు తరలించేందుకు ప్రభుత్వం పన్నుతున్న కుట్రలు కావా?

తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పరచేందుకు అనేక అఖిల పక్ష సమావేశాలు నిర్వహించిన కేంద్ర ప్రభుత్వం, ఆదివాసీ ప్రాంతంలో నిర్మిస్తున్న ప్రాజెక్టుపై అక్కడున్న లక్షలాది మంది ఆదివాసుల అభిప్రాయాలను తెలుసుకుందామనే కనీస ప్రయత్నం కూడా ఎందుకు చేయలేదు? పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఆటంకాలు రాకుండా ముంపు ప్రాంతాలను సీమాంధ్రులో కలపాలనే వారికి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు ఆదివాసులను బలిపెట్టడం తెలంగాణ వారికి అభ్యంతకరంగా కనిపించడం లేదు. అందుకే శ్రీకృష్ణ కమిటికి ఆదివాసులు తమకు “దండకారణ్య రాష్ట్రం” ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఓట్లు సీట్ల వేటలో పోలవరం ప్రాజెక్టును తమ పార్టీ మ్యానిఫెస్టోల్లో చేర్చుకున్నారు. మొట్టమొదటి నుండి ఆదివాసుల పక్షాన నిలిచింది తామేననీ, సుప్రీం కోర్టులో, కేసులు వేసి ఆపింది తామేనని, ఎవరికి వారు ప్రగల్భాలు పలుకుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజిస్తున్నప్పుడు, పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించేటపుడు ఎందుకు అడ్డుకోలేకపోయారు? “యూటి అంటే యుద్ధమే, రాయల అంటే రణమే” అన్నవారు “పోలవరం అంటే పోరాటమే” అని ఎందుకు అనలేదు? కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ముంపు ప్రాంతాల ప్రజలు, ఆదివాసీ సంఘాలు గత రెండు నెలలుగా ఉద్యమించకపోతే ఏ ఒక్కరాజకీయ పార్టీ అయినా స్పందించేదా?

అందుకే ఇటువంటి అవకాశవాద రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పేందుకే కుకునూరు, వేలేరుపాడు ప్రాంతాల ప్రజలు, ఆదివాసీ, ప్రజాసంఘాలు సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. తమ బాధల్ని, భావాల్ని పట్టించుకోని ప్రభుత్వాలు నిర్వహించే జిల్లా, మండల ప్రాదేశిక ఎన్నికలను బహిష్కరించడం ద్వారా ఒక హెచ్చరిక చేసారు. ఇదే స్ఫూర్తిని, రాబోయే రోజుల్లో ప్రతి పార్టీనీ, రాజకీయ నాయకులను నిలదీయడం, గ్రామాల్లోకి రాకుండా అడ్డుకోవడం ద్వారా పోలవరం నిర్వాసిత ప్రజలు, సంఘాలు ఉద్యమాన్ని తీవ్రతరం చేయవలసి ఉంటుంది. ఆదివాసుల నాయకత్వంలో జరిగే ఉద్యమానికి హక్కుల, ప్రజాసంఘాలు, పార్టీలు మద్దతును తెలపాలి. ఆదివాసీ పోరాటాలకు సంఘీభావంగా మైదాన ప్రాంతాల్లోని విద్యార్థులు, మేధావులు, ప్రజా సంఘాలు ఉద్యమించాలి. అభివృద్ధి పేరిట విధ్వంసం సృష్టించే పోలవరం ప్రాజెక్టును నిలిపేంతవరకు పోరాడాలి.

**– వ్యాసకర్త ఓయూలో సోషియాలజీ పరిశోధకులు**

# ప్రజాస్వామ్య తెలంగాణ

- వరవర రావు

(ఓయూ పరిశోధక విద్యార్థులు "తెలంగాణ - ప్రజాస్వామిక ఆకాంక్షలు" అనే అంశంపై ఆగస్టు 31,సెప్టెంబర్ 1వ తేదీలలో ఓయూలోని ఐసిఎస్ఎస్ఆర్ హాల్‌లో నిర్వహించిన రెండు రోజుల సదస్సులో "ప్రజాస్వామ్య తెలంగాణ" అనే అంశంపై విప్లవ రచయితల సంఘం నాయకులు వరవర రావు గారు ఇచ్చిన ఉపన్యాసం "తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం - పోలవరం" చర్చ జరుగుతున్న నేపథ్యంలో పాఠకులకు ఉపయోగపడుతుందనే ఉద్దేశ్యంతో వ్యాసం రూపంలో ఇస్తున్నాం - ఎడిటర్ )

ఓయూలో విద్యార్థులు 5 లక్షల మందితో బహిరంగ సభ నిర్వహించినప్పుడు పోలీసు కమీషనర్ నన్ను లోపలికి రానివ్వలేదు. నేను ఈ కాలేజీలో మాజీ స్టూడెంట్‌ను, ఇదే యూనివర్సిటీ అఫ్లియేటెడ్ కాలేజీలో టీచర్‌గా పనిచేశాను నన్ను రానివ్వకపోవడమేమిటని ప్రశ్నిస్తే, పి.వి నరసింహరావు కూడా నేను ఇదే కాలేజీలో చదివినట్లు క్లయిమ్ చేస్తాడు లేండి అని అన్నాడు. మరయితే పి.వి నరసింహరావు వస్తే రానివ్వరా? అని నేను అడిగితే దానికేం జవాబు లేదు. విద్యార్థులే నన్ను వేరే మార్గంలో లోపలికి తీసుకుపోయారు, ఆ మీటింగ్‌లో నేను 'మిలిటెంట్' అన్న ఒక పదం ఉపయోగించినందుకు తెలంగాణ ఉద్యమ మేయిన్ స్ట్రీంలో వున్నవాళ్ళకు చాలా అభ్యంతరంగా అనిపించింది. మీరు మిలిటెంట్ అన్న మాట మాట్లాడడం వల్లనే ఇంటలిజెన్స్ రిపోర్ట్స్‌లో ఇందులో మావోయిస్టులు ఉన్నారని అంటున్నారండీ, మీరు ఆ మాట ఉపయోగించాల్సింది కాదని అన్నారు. అలాగే నన్ను అభిమానించే ఓ మిత్రుడు 'ఈ తెలంగాణ రాష్ట్రం ఏర్పడేంతవరకు మావోయిస్టు పార్టీ ప్రకటనలు ఇవ్వకుంటే బాగుంటుంది సార్, ఎందుకంటే ఇప్పటికే ఇంటలిజెన్స్ వాళ్ళందరు ఇందులో మావోయిస్టులు ఉన్నారని చెబుతున్నారు అని అన్నాడు, ఇదేం ప్రజాస్వామికం?!

తెలంగాణ ప్రకటన తడి అరకముందే ఒక రచన చేసి పత్రికలకు పంపాను. మన పత్రికలు అనుకునేవాటితో సహా ఏ పత్రికలు ఇవ్వాళ్టికి కూడా ఆ వ్యాసాన్ని వెయ్యలేదు. బహుశా ఎవ్వరూ వెయ్యకపోవచ్చు. మరీ అందులో అంత దుర్మార్గంగా ఏమైనా రాశానా అంటే అది లేదు. ఒక చిన్న పిట్టకథ చెప్పాను. సులభంగా ప్రజాస్వామ్యం అంటే ఏమిటో అర్థం చేసుకోవడానికి ఒక కథద్వారా చెప్పాను. ప్రస్తుతం మనది ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం. అంటే నెంబర్



**2010 జనవరి 3న ఓయూలో జరిగిన విద్యార్థి గర్జన దృశ్యం**

మీద అధారపడిన ప్రజాస్వామ్యం ఇది. కాని ప్రజల ప్రజాస్వామ్యం ఎట్లా ఉంటుంది? మామూలుగా ప్రజా అనే మాటకు మార్క్సిస్టు పరిభాషలో ఉత్పత్తిలో పాల్గొనేవారు అని అర్థం. ఉత్పత్తిలో పాల్గొనే వాళ్ళు ప్రజలు. ఉత్పత్తిలో పాల్గొనని వాళ్ళు పిల్లలు, ఆనారోగ్యంతో ఉన్నవాళ్లు, శారీరక వికలాంగులు, వృద్ధులు, వాళ్ళు ఉత్పత్తిలో పాల్గొనరు కాబట్టి వాళ్ళను మినహాయించొచ్చు. కానీ ఉత్పత్తిలో పాల్గొనకుండా, కాళ్ళు చేతులు బాగుండి పనిచేయని ఏవరైనా కూడా పరాన్నబుక్కులే అవుతారు తప్ప ప్రజలు కారు. మరి ఈ ప్రజలు నిర్ణయించేది ఏంటనేది భారతంలోనే ఒక కథ ఉన్నది. ప్రజాస్వామ్యమంటే, న్యాయమంటే అది.

పాండవులు జుదంలో ఓడిపోతారు, పాండవులు అరణ్యానికి పోతుంటే ద్రౌపది కూడా వారితోపాటు పోవడానికి సిద్ధపడుతుంది. కుంతి ఆ ఐదుగురిని ద్రౌపదిచేతిలో పెట్టి అమ్మా నువ్వు, నీ ఐదుగురు భర్తలు అరణ్యానికి పోతున్నారు. తల్లిగా నేను మీతోపాటు వుండను. తల్లిగా పిల్లల సంగతి చెప్పాలి కాబట్టి చెబుతాను అంటూ ***"ధర్మరాజు లోకమంత గౌరవించే మనిషి. అజాత శత్రువు. విదూషనుడు. రేపు రాజు అవుతాడు కాబట్టి అయనను నువ్వు ఎట్లా చూసుకోవాలో చెప్పాల్సిన అవసరం లేదు. ఇక భీముడు అకలైతే కుండల్లో చేతులు పెట్టుకొని తీసుకొని తింటాడు కాబట్టి ఆయన గురించి నేను చెప్పాల్సిన అవసరం లేదు. అర్జునుడు నీ ప్రియుడు. పైగా మత్స్య యంత్రాన్ని చేధించి నిన్ను గెలుచుకున్నవాడు కనుక నీ ప్రియున్ని ఎట్లా చూసుకోవాలో నీకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ నకుల - సహదేవులున్నారే? వీళ్లిద్దరికి ఆకలైతే చెప్పడానికి ఇబ్బంది పడతారు. వాళ్ళకు ఆకలి,దప్పిక తెలియదు కనుక నువ్వు కనిపెట్టుకొని వాళ్ళ మంచి చెడ్డలు, వాళ్ళ ఆకలిదప్పులు తెలుసుకోవాలమ్మ"*** అని చెప్పింది. ఇది ప్రజాస్వామ్యం అంటే. రేపు తెలంగాణలో మనం చేయాల్సిందేమిటంటే ఆదివాసుల ఆకలి. ముస్లీంల ఆకలి ఏమిటో



హైదరాబాద్ నిర్మాణంలో భాగం పంచుకుంటున్న శ్రామికులు

తెలుసుకోవాలి. ముఖ్యంగా తెలంగాణలో అధికారంలో ఉన్నవాళ్లు దళితులు, ఆదివాసి, ముస్లీంలకు న్యాయం జరిగేలా చూడాలి. మావోయిస్ట్ పరిభాషలో చెప్పాలంటే అట్టడుగు వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలి. పోని రాజ్యాంగంలో చెప్పబడిన హక్కులనైనా కనీసం అమలు చేయాలి.

ప్రజాస్వామ్య ప్రతేక తెలంగాణ మీటింగ్‌ను 1997లో వరంగల్ పెట్టినప్పుడు నా విద్యార్థి ఒకాయన పిడియస్‌యూలో పనిచేశాడు. ఇప్పుడు ఆయన తెలంగాణ ఉద్యమంలో ఉన్నాడు. ఇప్పటికీ ఆయనను తెలంగాణ పేరుతోనే పిలుస్తాం. ఆయన వేదిక మీదకు వచ్చి సార్ మీరు ఇవ్వన్ని మాట్లాడకండి సార్ మొదలయితే తెలంగాణ రానివ్వండి అని అన్నాడు! ఏమిటీ తెలంగాణ అమూర్తమా?. తెలంగాణకు ఒక రూపం లేదా? మ్యాప్‌లో చూపించినట్లు ఈ ఆంధ్ర నుంచి వేరే చేసిన భాగమేనా? నిజానికి అట్లా వేరు కూడా కాదు. తెలంగాణ అంటే రక్తమాంసాలతో కూడిన, ప్రజలతో కూడిన, కష్టజీవులతో కూడిన ఒక భౌగోళిక,చరిత్ర, సంస్కృతి. తెలంగాణ ప్రకటనలో ఏమి చెప్పారు. 1.హైదరాబాద్‌తో కూడిన పది జిల్లాల తెలంగాణ. 2.హైదరాబాద్ పది సంవత్సరాల పాటు ఉమ్మడి రాష్ట్రానికి రాజధాని. 3.పోలవరం ప్రాజెక్టును జాతీయ స్థాయిలో కేంద్ర చేపడుతుంది. ఈ మూడు ప్రకటనలు చేశారు.

హైదరాబాద్ గురించి చర్చ వస్తుంది కాబట్టి అభివృద్ధి గురించి కొంత చెప్పాలి. ముఖ్యంగా ప్రజాస్వామికంగా అభివృద్ధిని ఎట్లా నిర్ణయిస్తారు. అభివృద్ధికి రెండు ఫ్యాక్టర్స్. ఒకటి శ్రమ. రెండు పెట్టుబడి. శ్రమ దృష్టితో మీరు అభివృద్ధిని చూస్తే ఇప్పటి వరకు చెప్పిందంతా కొట్టిపారేయ్యవచ్చు. ఎందుకంటే ఇప్పటికీ శ్రమ జీవులు పాల్గొనేది అభివృద్ధి కాదని చెబుతారు. కథల్లో కూడా చెపుతారు. నేను రూపాయి పెడతాను. రేపటికి రూపాయి రెండు రూపాయలు అవుతుందా? కాదు. ఈ రూపాయి ఇస్తే ఇంకోయాన కష్టం చేస్తారు. ఈ కష్టంతోటి దున్నుతడు. నాలుగు విత్తనాలు వేస్తాడు. రేపు పుట్టెడు ఒడ్లు పండుతయి. రూపాయితోటి నాలుగు గింజలు, పుట్టెడొడ్లు పండవు. నెత్తురు చమటైతే నాలుగు గింజలు పుట్టెడొడ్లుగా మారాయి. అంటే పెట్టుబడి కంటే శ్రమ పాత్ర ఎక్కువున్నది. కనుక ఏ నగర నిర్మాణమైనా, ఏ అభివృద్ధైనా మౌళికంగా అది శ్రమతో కూడుకున్నది. అందుకే పెట్టుబడి ఎంత తెలివిగా హ్యూమన్ రిసోర్స్ అంటున్నది. మనిషిని ఒక వనరుగా చూస్తున్నారు. మనిషిని మనిషిగా చూడాల్సిన పెట్టుబడి మనిషిని వనరుగా చూస్తున్నదంటే, అట్ల చూసినప్పుడు అభివృద్ధికి శ్రమజీవులు తప్పా ఇంకెవ్వరూ బాధ్యులు కాదు. రూపాయి పెట్టుబడి దానికదిగా శ్రమ లేకుండా ఇంకో రూపాయిని తేలేదు. అట్ల చూసినా హైదరాబాద్‌కు ఒక

400 సంవత్సరాల చరిత్ర ఉన్నది. బాంబే అభివృద్ధిని వాళ్ల భాషలో చెప్పాలంటే గుజరాతీస్, మార్వాడీస్, పార్సీస్, సినిమా ఇండ్రస్టీస్ వాళ్ళు చేసిన అభివృద్ధి. కానీ మన భాషలో చెప్పాలంటే బాంబే అభివృద్ధి సోలాపూర్ నుంచి తెలంగాణ వంటి అనేక ఇతర ప్రాంతాల నుంచి పోయిన పద్మశాలీలు ఇతర కులాలు చేసిన అభివృద్ధి. ఎందుకంటే ఆరోజు బాంబే డెవలప్ మెంట్ అంతా టెక్స్‌లైట్స్ డెవలప్‌మెంటే. ఈ టెక్స్‌టైల్స్ డెవలప్‌మెంట్ అంతా ఇక్కడి నుంచి వెళ్ళిన పద్మశాలీలు ఇతరులు చేసిన డెవలప్‌మెంటే. ఇవ్వాళ్టికి కెబుల్ వర్కర్స్ తెలంగాణ నుంచి పోయిన వాళ్ళే ఉంటారు. మరి దీనిని బట్టి బాంబేను ఎవరు చేసినట్లు డెవలప్‌మెంట్. ఈ కాంటెస్ట్‌లో చూసినప్పుడు హైదరాబాద్‌ను ఎవరు అభివృద్ధి చేసినట్లు. ఇవన్ని రాస్తూ నేను భారతం నుంచి ఉదహరిస్తూ ఒక కథ రాశాను.

నేను సాహిత్యం నుంచి వచ్చిన వాన్ని కాబట్టి భారతం నుంచి ఒక ఉదహారణలు ఇచ్చి రాశాను. వాస్తవానికి భారతంలో ఉన్నది మొత్తం పాలిటిక్సే. పాండవులు, కౌరవుల పోరుపడలేక ఒక బ్రాహ్మణుని ఇంట్లో ఉంటారు. పాండవులు బ్రాహ్మణుని ఇంట్లో ఉన్నవిషయం తెలుసుకొని దుర్యోధనుడు ఆ ఇళ్ళు తగలపెడతాడు. ఈ ఇళ్ళు తగులబెట్టబోతున్నారనే విషయం ముందే తెలిసి వాళ్ళను వేరే చోట పెడతారు. ఆ ఇంటాయన చనిపోతాడు. ఇది ధ్రుతరాష్ట్రునికి తెలిసి కౌరవులని కోపపడి, పాండవులను పిలిచి. హస్తినాపురాన్ని కౌరవులకి, ఇంధ్రప్రస్తాన్ని పాండువులకు ఇస్తాడు. ఎవరి భాగాన్ని వారు పరిపాలించుకోండని చెపుతాడు. ఇంధ్రప్రస్థ రాజధానిగా పాండవులు పరిపాలిస్తుంటారు. ఇది జరుగుతున్న కాలంలోనే మూడు లోకాలు తిరిగే నారధుడు తిరుగుతూ తిరుగుతూ ధర్మరాజు దగ్గరకు వస్తాడు. ఎక్కడినుంచి వస్తున్నారని నారధున్ని ప్రశ్నిస్తే మూడు లోకాలు తిరిగి వస్తున్నాను అంటూ, అయ్యో చెప్పడం మరిచిపోయా నరకంలో మీ నాయన కనిపించాడు అంటాడు. అదేమిటండీ మా నాయన నరకంలో ఉండటం ఏంటీ? పురుషార్ధులం, సమర్ధవంతులమైన ఐదుగురు కొడుకులం ఉన్నవాళ్ళం ఆయన నరకంలో ఉండటమేంటి? అని అడిగితే అదేనయ్యా, నేను అది చెప్పడానికే వచ్చాను మాటల్లో పడి మర్చిపోయాను. మీరు ఎంత పురుషార్థం ఉంటే ఏం లాభం? మీరు యజ్ఞం చేస్తే తప్పా మీ నాన్న స్వర్గానికి పోడు, ఆయన స్వర్గానికి పోవాలంటే, మీరు రాజులు యజ్ఞం చేస్తే తప్పా పరిష్కారం కాదని చెబుతాడు. అందుకాయన అదేమంత పెద్ద పని యజ్ఞం చేస్తాం అని చెబుతాడు. కాని నారదుడు చెప్పడానికి సందేహిస్తూ, మీరు యజ్ఞం చేస్తే మీ నాయన స్వర్గానికి పోతడు కాని భూలోకం



పార్లమెంట్‌లో తెలంగాణ ప్రకటన చేస్తున్న చిదంబరం

మీద కనీవిని ఎరగని రక్తపాతం జరుగుతుంది. నువ్వు ధర్మరాజువు కదా, ఇంత రక్తపాతం నీకు ఇష్టముంటదో ఉండదో అని నేను చెప్పడానికి సందేహిస్తున్న అని సెలవిస్తాడు. అందుకు ధర్మరాజు అదేమంత పెద్దపని మా నాన్న స్వర్గానికి పోవడం నాకు ముఖ్యం కాని అని నిర్ణయించుకొని రాజసుగా యాగం చేస్తడు. జాగం చేయడం.. కురుక్షేత్ర యుద్ధం జరగడం ఎంత రక్తపాతం జరిగిందో భారతంలో చూడవచ్చు. అంటే నాటి పాలకులు తమ తండ్రి స్వర్గానికి పోవడం కోసం ఈ భూలోకంలో కనివిని ఎరుగని రక్తపాతం జరగడానికి కూడా సిద్ధపడ్డారు. నేడు తెలంగాణ రాష్ట్రం కోసం పోలవరం ప్రాజెక్టు కూడా మనం సిద్ధపడ్డాం. లక్షలాది మంది అదివాసీలు మునిగిపోని, 350 గ్రామాలు మునిగిపోని, శబరి నది అదృష్యం కాని, పశుపక్ష్యాదులు పోని, వనమూలికలు పోని , ఖమ్మం అడివి అంతా నాశనమైపోని మనకు తెలంగాణ రాష్ట్రం వస్తది కదా అన్నారు!. రేపు తెలంగాణ వచ్చాక పోలవరాన్ని అడ్డుకుందాం అని అంటున్నారు. నిజమే, తెలంగాణ ప్రజల విశ్వాసం మీద గ్యారంటీ తప్పా ఇంకేం లేదు. అంటే మళ్ళీ తెలంగాణ వచ్చాక కూడా మనం పోరాటం చేయాలి. ఇప్పటికీ ఎన్ని పోరాటాలు చేశాం మనం?

వాస్తవానికి తెలంగాణ పోరాటం ఎట్లా మొదలైంది. 1969 పోరాటం, ఆ తర్వాత జరిగిన పోరాటం, ఒక్కొక్కటి ఒక్కొక్క చరిత్ర. 1994లో మొదలైన ప్రజాస్వామ్య ఉద్యమం. ఇది ఎందుకు ప్రజాస్వామ్యమైనది అంటున్నమంటే, వనరులు కోసం వచ్చిన పోరాటమిది. ఆ వనరుల్లో భూమి ఉంది. నీరు ఉంది, ఖనిజాలు ఉన్నాయి. వాటితోపాటు ఉద్యోగాలు ఉన్నాయి. ఉపాధి ఉన్నది. చదువు ఉన్నది. స్వాభిమానం ఉన్నది. 1994 నుంచి వచ్చిన ఉద్యమానికి ఉన్న ముఖ్యమైన మార్పు ఏమిటంటే, 69 ఉద్యమంలో ఉద్యోగస్తులు, విద్యార్థులు, న్యాయవాదులు, డాక్టర్స్, జనరల్‌గా అర్బన్ ప్రజలు ఉంటే, 1994 ఉద్యమానికి విప్లవోద్యమం నాయకత్వం వహించిన చోట భూమి సమస్య ఉన్నది.

9 డిసెంబర్ ప్రకటన నాడే తెలంగాణ వచ్చి ఉంటే ఎట్లా ఉండేదీ ఇప్పుడెట్లున్నదో చూడండి. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 10 వరకు ప్రపంచాన్ని కదిలించిన పోరాటం అది. నేను స్వయంగా వచ్చి దాన్ని చూశాను. ఉస్మానియా విద్యార్థులు చేసిన ఆ పది రోజుల చరిత్రను రక్తాక్షరాలతో రాయాల్సిన చరిత్ర. 10 తారీకు హ్యూమన్ రైట్స్ డే నాడు లక్షలాది మంది విద్యార్థులు చలో అసెంబ్లీలో భాగంగా అసెంబ్లీని ముట్టడించివుంటే ఏం జరిగివుండేది? ఏమి జరుతుందని ప్రభుత్వం భయపడి ఆర్ధరాత్రి తెలంగాణ ప్రకటనను చేసింది? ఆనాడు దేశీయ వ్యవహారాల మంత్రి ప్రకటన చేశాడు. కేవలం హోం మంత్రి అంటే రాష్ట్రాలకు ఉంటడు కాని, కేంద్రంలో వుండే హోం మంత్రి దేశీయ వ్యవహారాల మంత్రి. విదేశీ వ్యవహారాలను చూసేవాడు ఫారెన్ ఆఫైర్స్ మినిస్టర్. దేశంలోని అన్ని రాష్ట్రాల వ్యవహారాలను చూసేది హోం మినిస్టర్. అంత ఇంఫార్టెంట్ ఫోర్ట్‌ఫోలీయోను చూసేవాడు, వాళ్ళ భాషలో ఆ క్లాస్‌కు వల్లభాయ్ పటేల్ వంటివాడు. అంతటి దుర్మార్గుడు ప్రపంచంలోనే ఉండకపోవచ్చు. ఆ దళారి చిదంబరం తెలంగాణ ఇస్తున్నామని ప్రకటించాడు. రాత్రి ప్రకటించి పొద్దున పార్లమెంట్ ఉభయ సభల్లోకూడా చెప్పాడు. ఆ తర్వాత జరిగిందంతా మీకు తెలిసిందే.

ఇవ్వాల్టికి ఇంతచేసి మనం మాట్లాడుకొని సంబురాలు చేసుకుంటున్నం కదా కానీ ఇచ్చిన తెలంగాణకు, మనం తెచ్చుకున్న తెలంగాణకు చాలా తేడా ఉంటుంది. మీకు ఒక ఉదహారణ చెబుతాను. 1991లో నూతన ఆర్థిక విధానం పేరుతోటి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ మొదలయ్యింది. 96 వరకు అది చాలా వేగానందుకుంది. అది ఎంత వేగాన్ని అందుకున్నదంటే చాలా విచిత్రంగా 94 ఎన్నికల్లో ఎన్టీరామారావు సబ్సిడీలు ఇస్తాను. రెండు రూపాయలకు కిలో బియ్యం ఇస్తాను. సారాను నిషేధిస్తాను. పీపుల్స్ వార్ మీద నిషేదం ఎత్తివేస్తాను అనే నాలుగు హామీలతోటి ఎన్నికయ్యాడు. చంద్రబాబు నాయుడిని ఆర్థిక మంత్రిని చేశాడు. సెక్రటీయేరియట్‌లో వరల్డ్‌బ్యాంక్ టీం ఒకటి కూర్చొని వున్నది. మీకు జ్ఞాపకం వుండి వుంటే, నల్లగొండ జిల్లాకు, చిత్తూరు జిల్లాకు ఆ వరల్డ్ బ్యాంకు టీం పోయి తన రిపోర్టును ఇచ్చింది. ఫైనాన్స్ మినిస్టర్ చంద్రబాబు నాయుడు, వరల్డ్ బ్యాంక్ సబ్సిడీలకు వ్యతిరేకం. వరల్డ్ బ్యాంక్ సారా మీద నిషేదం ఎత్తివేయడానికి వ్యతిరేకం. వరల్డ్ బ్యాంక్ పీపుల్స్ వార్ మీద నిషేదం ఎత్తివేయడానికి వ్యతిరేకం. ఈ పనులన్ని ఎన్టీ రామరావు పాపులిస్ట్ చర్యగా చేశాడు. ఎన్టీయార్‌ను ఎన్నుకున్నటువంటి సామాజిక వర్గానికి, ఎన్టీయార్‌ను అధికారంలోకి రావడానికి ఇబ్బంది కలిగిస్తున్న ప్రపంచ బ్యాంక్ ఇద్దరికి సమస్యైపోయింది. అందుకే తొమ్మిది నెలల్లో ఆగస్టులో వైస్రాయ్ హోటల్లో కుట్రచేసి ఎన్టీయార్‌ను దించేసి ఫైనాన్స్ మినిస్టర్‌నే చీఫ్ మినిస్టర్‌ను చేశారు. మీరు వరల్డ్ బ్యాంక్ యొక్క లేదా 91 నుంచి ప్రకటించినటువంటి నూతన ఆర్థిక విధానాల హిస్టరీ చూస్తే చక్కగా వరల్డ్ బ్యాంక్ గవర్నర్‌గా ఉన్న మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా వచ్చాడు. ఆర్థిక మంత్రిగా వచ్చిన మన్మోహన్ సింగ్ రెండు టర్మ్ వచ్చేసరికి ప్రధాన మంత్రి అయ్యాడు. ఇదంతా డ్రామా, ఎన్నికల్లో ఓట్లేయడం, ఎన్నుకోవడం అంతా డ్రామా. వానికి కావాల్సిన ఫైనాన్స్ మినిస్టర్, వానికి కావాల్సిన ప్రైం మినిస్టర్‌ను వరల్డ్ బ్యాంక్ చూజ్ చేస్తది, ట్రైంకి పంపిస్తది. అట్లాంటిది అప్పటి వరకు ఫైనాన్స్ మినిస్టర్‌గా వున్న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాడు. ముఖ్యమంత్రి అయ్యి సబ్సిడీలను రద్దు చేశాడు. పీపుల్స్‌వార్ మీద నిషేదం ఎత్తివేశాడు. సారామీద నిషేదం ఎత్తివేశాడు. అంతే కాదు తెలంగాణను నూతన ఆర్థిక విధానాలకు లేదా ప్రపంచీకరణకు ఒక ప్రయోగశాలగా మార్చాడు. ఎన్నో వందల, వేల సార్లు మనం ఈ మాట చెప్పాం. నెత్తుటేర్లు పారించాడు. ఒక్కొక్కటి, ఒక్కొక్కటిగా హైదరాబాద్‌లో వున్న పరిశ్రమలను మూసివేశాడు.

2000 సంవత్సరం వరల్డ్ బ్యాంక్ రిపోర్టు చదవండి మీరు. ఆ రిపోర్ట్‌లో మూడు డిపార్ట్ మెంట్లను ప్రైవేటు చేయాలి. ఆర్టిసీని ప్రైవేటైజ్ చేయాలి. సింగరేణిని ప్రైవేటైజ్ చేయాలి.



మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌తో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు


ఎలక్ట్రీసిటీ ప్రైవేటైజ్ చేయాలి. అయితే సింగరేణి కాలరీస్‌లో చాలా బలమైనటువంటి విప్లవోద్యమం ఉంది కాబట్టి దాన్ని ఇప్పుడే ముట్టుకోకండి, ఆర్టీసీలో కూడా ఎంతో కొంత విప్లవోద్యమం ఉన్నది కాబట్టి దాన్ని అప్పుడు ముట్టుకోలేదు, కానీ విద్యుత్‌ను చేశాడు. మీకు జ్ఞాపకం చేయడానికి చెపుతున్నాను. మూడే రోజులు ఆనాడు అసెంబ్లీ నడిచింది. ఫస్ట్‌డే ప్రతిపాదన చేశారు. చాలా మిలిటెంట్‌గా ఎలక్ట్రిక్ ఎంప్లాయిస్ దాన్ని వ్యతిరేకించారు. కనిపిస్తే కాల్చివేసే అర్డర్స్ ఇచ్చారు. రెండో రోజు ప్రతిపక్షాలు బైకాట్ చేశారు. మూడోరోజు బిల్ పాసైపోయింది. ట్రాన్స్‌కో, జెన్‌కో ఏర్పడింది. ఎందుకంటే కండీషన్ పెట్టింది వరల్డ్ బ్యాంక్. దానికోసం మూడురోజులు అసెంబ్లీ జరిగింది. మిగిలినవి పోరాటావల వల్ల ఆగిపోయాయి. మొత్తం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వుండే మొత్తం పరిశ్రమల్ని మూసివేశారు. పబ్లిక్ సెక్టర్‌లో వుంటే అన్నింటిని క్లోజ్‌డౌన్ చేశారు. ఇస్తే ప్రైవేట్ వారికి ఇచ్చారు లేకపోతే మూసివేశారు. ఆ హిస్టరీ నేను మీకు చెప్పనక్కర్లేదు, పబ్లిక్ సెక్టర్‌లో వుంటే అన్ని పరిశ్రమల్ని మూసేశారు. వరల్డ్ బ్యాంక్ ఏం మాట చెప్పితే ఏం చేశాడు. చివరకు చాలా విచిత్రంగా అసెంబ్లీలో తెలంగాణ గురించి మాట్లాడొద్దన్నాడు. అట్ల చేస్తే వరల్డ్‌బ్యాంక్ ఒప్పుకోదండీ అన్నాడు నిస్సిగ్గుగా. ఆయనేమో ప్రజలు ఎన్నికల్లో ఓట్లువేస్తే అధికారంలోకి వచ్చాడు. ప్రపంచ బ్యాంక్ ఒప్పుకోదండీ అంటాడు. ఎన్నికైన మరుసటి రోజే ప్రపంచబ్యాంక్ జవాబుదారీగా మారిపోయి తెలంగాణను ప్రయోగశాలగా మార్చివేశాడు.

అదే సమయంలో ఇంకోవైపు 95లో పీపుల్స్‌వార్ స్పెషల్ కాన్ఫరెన్స్ జరిగింది. ఆ స్పెషల్ కాన్ఫరెన్స్‌లో శ్యాం, మహేష్ ఒక ప్రతిపాదన చేశారు. ఇంతకాలం ఈ సామాజిక వ్యవస్థకు మనం ఒక నిర్వచనం చెపుతున్నాము. ఈ ఇద్దరిపేరే చెపుతున్నాం కానీ అది మొత్తం కేంద్ర కమిటీ నిర్ణయం. కాకపోతే వాళ్ళు తెలంగాణ అనుభవంతో చొరవతీసుకున్నారు. దీన్ని క్యారెక్టరైజ్ చేస్తున్నాం ఈ సిస్టంను. ఇది సెమి ఫ్యూడల్, సెమి కలోనీయల్ అని చెబుతున్నాం. సామ్రాజ్యవాదాన్ని, పెట్టుబడిదారి విధానాన్ని, భూస్వామ్యాన్ని వ్యతిరేకించాలని చెపుతున్నాం. ఈ వ్యతిరేకించాలని ఒక డెఫినేషన్ తీరి చెపుతున్నాం కాని మనం ఏం చేస్తాం అని చెపుదాం. మనం ఇవి చేస్తామని ప్రజలకు హామీ ఇవ్వాలి. చేయాలి అని. ఏం చేస్తాం అంటే, మౌళిక రంగాలన్నింటి ప్రాథమిక స్థాయిలో అభివృద్ధి చేస్తాం. భూమిని స్వాధీనం చేసుకుంటాం. సాగు నీరు, తాగు నీరు కల్పిస్తాం. రైతులకు విత్తనాలు, ఎరువులు ఇస్తాం. ప్రాథమిక విద్యను ఏర్పాటు చేస్తాం. ప్రాథమిక ఆరోగ్యాన్ని ఏర్పాటు చేస్తాం. వీటికోసం గ్రామ స్థాయిలో అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేస్తాం. గ్రామ రాజ్య అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వీటిని మేం అమలు చేస్తాం. ఇవి అమలు చేయడానికి మాత్రం మా నాయకత్వం ఉండేచోట రెండు షరతులు ఒకటి పన్నులు కట్టం, రెండు ఎన్నికల్లో ఓటు వెయ్యం. అంటే ఈ గ్రామంలో ఉండే గ్రామ రాజ్యాన్ని గుర్తించి ఈ అల్టర్‌నేట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అమలు చేస్తాం. ఈ కిందినుంచి వచ్చే ప్రజా అభివృద్ధి క్రమాన్ని మేము అమలుచేస్తాము. ఆ అమలు చేయడాన్ని ఇవ్వాళ మనం జనతన సర్కార్ స్థాయికి, కాంత్రికారీ జనతన సర్కార్ స్థాయిలో అప్పటి నుంచి ఇప్పడి వరకు కొనసాగుతున్నది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వందల గ్రామాల్లో అమలైన విషయం మీకు గుర్తిండి వుండవచ్చు. ఇప్పుడు చౌటుప్పల్ దగ్గర వుండే వాటర్ ట్యాంక్ గ్రామ అభివృద్ధి కమిటీ నాయకత్వలో ఏర్పాటు చేసినది. ఈ అభివృద్ధి క్రమాన్ని గ్రామాల్లో అమలుచేసినందుకు, వెంకటాద్రీ పేట అనే గ్రామంలో ఒక యువకుని ఎన్‌కౌంటర్ చేస్తే బాలగోపాల్ ఒక వ్యాసం రాశాడు. ఎందుకంటే వెంకటాద్రీపేట అనే గ్రామంలో ఈ అల్టర్‌నేటివ్ ప్రోగ్రాంను ఆయన ఆ ఊళ్లో వుండి అమలుచేస్తున్నాడు. నిజామాబాదు, వరంగల్ జిల్లాలో వందలాది గ్రామాల్లో ఇది జరిగింది. నిజామాబాద్ జిల్లాలో గండిపూడ్చుడాన్ని నేను వెళ్ళి చూసి వచ్చి అరుణతారలో రాశాను. నైజాం కాలం గండిపడ్డ చెరువును నైజాం కాలం నుంచి 94,96 వరకు ఎవరూ పూడ్చకపోతే గ్రామస్తులు, గ్రామ అభివృద్ధి పేరుతో ఆరునెల్లు తమ శ్రమ దానంతోటి ఆ గండి పూడ్చి ఇంకా ఒక వెయ్యి ఎకరాలను సాగులోకి తీసుకొచ్చారు. ఆ చెరువునీళ్ళను వదిలిపెట్టిన నాడు నన్ను పిలిచితే నేను వెళ్ళి పాల్గొన్నాను. ఇటువంటి అభివృద్ధి ఉత్తర తెలంగాణ నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నలగొండ జిల్లాలో చాలా వాటిలో వీటిని చూశాం. తీవ్ర నిర్బంధం వల్లా ఒక అల్టర్‌నేటివ్ ప్రోగ్రాం ప్రజలముందుకు వచ్చి రక్తపాతం ప్రవహించడం మూలంగా అవన్నీ, మనం చేసుకున్న అభివృద్ధి అంతాకూడా ఎగిసిపోయింది లేక విధ్వంస అయ్యింది.



**ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయిన నక్సలైట్ నాయకుడు**

ఆ బ్యాక్‌గ్రౌండ్‌లో సరిగ్గా వరంగల్‌లో ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ మీటింగ్ అయిన నాడు, పత్తి రైతులు విపరీతంగా ఆత్మహత్యలు చేసుకున్నారు. విచిత్రంగా వరంగల్‌లో, చిట్యాలలో విపరీతంగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. 90 శాతం భూమిలో పత్తే పండించారు. వరి పండించలేదు, జొన్న పండియ్యలేదు, పత్తి అయితే మార్కెట్‌లో చాలా డిమాండ్ వుంటుంది కనుక భూమి లేని వాళ్ళు సహితం జమ్మికుంట ప్రాంతంలో కౌలుకు తీసుకొని పండించారు. ఇది చాలా తప్పు ఇది. తెలంగాణ మెట్టపంటలు పండించే ప్రాంతం. ఇది తప్పు, దీని వలన రైతుల ఆత్మహత్యలు ఇంకా పెరుగుతాయని చెబుతూ. ఈ పత్తి పండించి ఆత్మహత్య చేసుకున్న రైతులకు జోహర్లు చెబుతూ, పత్తి రైతులకు సహాయం చేస్తూ, ఇదిగో ఇది అల్టర్‌నేటివ్ డెవలప్‌మెంట్ ప్రజలకు ఏం చెయ్యాలి. ఏ వనరులను కాపాడుకోవాలో అని చెప్పే క్రమంలోనే ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ వచ్చింది. వరంగల్ డిక్లరేషన్‌లో మనం ఏఏ రంగాల్లో ప్రజాస్వామిక అంశాలను అమలుచేస్తాము. భూమి, నీళ్ళు, విత్తనాలు, ఎరువులు, చదువు, చదువంటే శ్రీచైతన్య, నారాయణ సీట్లని కాదు. అందరికి చదువని అర్థం. యాన్ మిర్డాల్ అనే ఆయన భారత్‌పై అరుణతార అనే పుస్తకం రాశాడు. 86లో ఒకసారి ఇండియా వచ్చాడు. వచ్చినప్పుడు మేము రామప్ప గుడి మొదలైన అన్ని ప్రాంతాలను చూపెట్టాం.




**యాన్ మిర్డాల్ పుస్తకం "భారత్‌పై అరుణతార"**

ఆయన అప్పుడు ఒక మాటన్నాడు. మీరు ఎప్పుడూ మీ డెవలప్‌మెంట్‌ను పాశ్చాత్య దేశాలతో పోల్చకండి. ఆసియా దేశాలలో అభివృద్ధి అంటే "రోటీ, కప్‌డా, మకాన్". ఆసియా దేశాల్లో అభివృద్ధి అంటే ప్రతి ఒక్కరికి తినడానికి రొట్టె, తలదాచుకోవడానికి ఇళ్లు. కట్టుకోవడానికి ఇంత బట్ట. ఈ మూడు నూట ఇరవై కోట్ల మంది భారతీయులకు దొరుకుతున్నయా? దొరుకుతే అది అభివృద్ధి. ఇంక అంతకంటే అభివృద్ధికి ఇంకో గీటురాయి లేదు. ఇప్పుడు ఏం చెపుతున్నారు అమెరికా వెళ్ళి వచ్చిన వారు. అక్కడ పనిమనిషి కూడా కారులో వచ్చి పనిచేసి వెళ్తారు అనే కదా. ఇప్పుడు మనకు డెవలప్‌మెంట్‌కు అది ప్రమాణం. ఈ డెవలప్‌మెంట్ కాన్‌సెప్ట్‌లో ఒక అసమసమాజం ఉంది. ఆ అసమసమాజంలో పనిచేస్తున్నవారి జీవితం కొంత బాగుండడాన్ని మనం డెవలప్‌మెంట్ అనుకుంటున్నాం. అసలు అసమసమాజం ఎందుకు ఉన్నది. ఆ అసమసమాజమే ఒక హింస. ఈ అసమసమాజం అనేది అభివృద్ధి అని విద్యావంతులలోనే ఎక్కువగా వున్నది .

నేను మా ఊరికి పోవాలంటే ఏడు గంటలయ్యేది, నాలుగు గేట్లు పడేవి. ఇప్పుడు సర్రున జారినట్లు రెండు గంటలు వెళుతున్నాం. ఇంకా ఎవరైన వెహికిల్ ఇచ్చి, ఆ వెహికిల్‌ల పోతే ఇంకా సుఖం, ఆ వెహికిల్‌లో కుర్చున్నంతసేపు అంతా డెవలప్‌మెంటే, కాని వెళుతున్న క్రమంలో ఎన్ని చిన్న చిన్న ఊళ్ళు పోయినవి, ఎన్ని డబ్బాలు పోయినవి. నిన్నగాక మొన్న జరిగిన ఓ సంఘటన నన్ను ఇప్పటికి కలిచివేస్తున్నది. మినిస్టర్స్‌రోడ్‌లో ఒక హోమియో డాక్టర్‌ను కలిచి వస్తున్నాను. అది ట్యాంక్‌బండ్‌కు వచ్చే రోడ్‌కు కలుస్తది. అక్కడ ఆగింది. అక్కడ ఆగితే రెండు నిమిషాల్లో పది మంది ముస్లిం స్త్రీలు బిచ్చమెత్తుకోవడానికి వచ్చారు. అందులో అందరికి అందరు ముస్లింలు, స్త్రీలు. ఈ అభివృద్ధి గురించి మాట్లాడే అందరికి అది చూపెట్టాలనుకున్నాను. వాళ్ళది హైదరాబాద్. అది పదిమంది స్త్రీలు ఎట్లా మార్జినలైజ్ అయిపోతే ఆ సిగ్నల్ దగ్గర బిచ్చమెత్తుకొనే స్థితికొచ్చారు చెప్పండీ. ఇది దుర్మార్గం కాదా?. ఇప్పుడు సమస్య ఎక్కడొచ్చిందంటే, అసంఘటిత రంగంలోనే పీపుల్ ఎక్కువగా వుండటం వల్ల ఈ మార్జినలైజ్ అయ్యే వారిలో ఎవరున్నారో మనకు తెలుస్తలేదు. మార్జినలైజ్ అయ్యే అదివాసులు ఏమవుతారు. ఓల్డ్ సిటీలో మార్జినలైజ్ అయిపోతున్న ముస్లింలు ఏమైపోతున్నారు. వీరి గురించి మనం మాట్లాడాలి. పెట్టుబడి ఎక్కడ అగ్వగా శ్రమ దొరుకుతదో, ఎక్కడ అగ్వగా వనరులు దొరుకుతయో అక్కడికి పోతది. అట్లా తెలంగాణలోకి పెట్టుబడి వచ్చి విధ్వంసం చేసింది. దీంట్లో ఎక్కువగా నష్టపోయింది ఆదివాసులు, మైనారిటీలు, దళితులు కనుక మనం మన వనరులను ఎట్లా కాపాడుకోవాలి అనేది ఆలోచించాలి. అందుకే మనం తెలంగాణ ఎక్కడా విడిగా చూడకూడదు.

# ప్రత్యేక తెలంగాణ ఉద్యమం- విద్యార్థులు

– నలమాస కృష్ణ



చలో అసెంబ్లీ కార్యక్రమంలో పోలీసులపై రాళ్లు రువ్వుతున్న విద్యార్థులు

తెలంగాణ రాష్ట్ర సాధనలో విద్యార్థుల పాత్ర, వారి త్యాగాలు ఎంత చెప్పినా తక్కువే. భారత దేశ విద్యార్థి ఉద్యమంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమం ప్రముఖ స్థానం సంపాదించుకుంది. ఈ ఉద్యమానికి ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు ప్రధాన నాయకత్వంగా ముందుకొచ్చారు. 2009 నవంబర్ 30 నాటి నుండి తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమం విద్యార్థుల నాయకత్వంలో మలుపుతిరిగింది. కోస్తాంధ్ర పాలక వర్గాలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన, వారి పోలీసు బలగాలకు ముచ్చెమటలు పట్టించిన విద్యార్థి నాయకత్వం ఇటీవల ఎంతో అదమ స్థాయికి దిగజారడం చూసి ప్రజలు బాధపడుతున్నారు. ప్రాంతీయ దళారీ రాజకీయ నాయకత్వం చేసిన, చేస్తున్న విద్రోహాలను ఎండగట్టి, "మేమే అమరవీరుల వారసులం" అంటూ నినదించిన ఉస్మానియా జేఏసీ నాయకులు అదే రాజకీయ నాయకుల ఇండ్ల ముందు పడిగాపులు కాస్తూ కూర్చుండడం విద్యార్థి ఉద్యమానికి తీవ్రమైన అవమానం, అసహ్యకరమైనది.

ఎర్రబుగ్గకారు కనిపిస్తే చాలు సాష్టాంగ నమస్కారం చేస్తూ మాకు టికెట్స్ ఇవ్వండని ఇంతకాలం "ద్రోహులను, తెలంగాణ వ్యతిరేకులని, దొరలని, భూస్వాములని, అగ్రకుల పెత్తందార్లని" నిందించిన వారు తిరిగి ఆద్రోహులనే సీట్లు అర్థించడం పతనమైన ఉద్యమ నిబద్ధతకు సూచిక. అయితే ఎర్రబుగ్గ కార్ల ముందు టికెట్స్ కోసం వెంపర్లాడిన విద్యార్థి నాయకులే మొత్తం విద్యార్థి ఉద్యమానికి ప్రతీకలు కాదనేది వాస్తవం. వీరంత విద్యార్థుల పోరాటంలో ఒక భాగం, మరికొందరు ఉద్యమంతో రాజకీయ పార్టీల నాయకత్వాన్ని అనుసరిస్తూ మీడియా మేనేజమెంట్ ద్వారా ఉనికిలోకిచ్చినవారు. మరొక సెక్షన్ విద్యార్థి నాయకత్వం ఓట్ల, సీట్ల రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఈ సెక్షన్ జరుగుతున్న పరిణామాలపై వారి వైఖరిని సమర్ధవంతంగా ఉద్యమ నాయకత్వం వరకైనా తీసుకెళ్ళకపోవడం పెద్దలోపం.

ప్రపంచ దృష్టిని ఆకర్షింపగలిగిన పార్టీలను నిజంగా శాసించింది. నాగం జనార్ధన్ రెడ్డిని ఉస్మానియా విద్యార్థులు కొట్టిన తర్వాత ఏ ఒక్క రాజకీయ నాయకునికి కంటి మీద కునుకలేదు. వారి రాజకీయ భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. విద్యార్థుల, జేఏసీల అంగీకారం, అనుమతి లేకుండా ప్రజాక్షేత్రంలోకి రాజకీయ నాయకులు అడుగు పెట్టలేని స్థితి నిజమైన ప్రజల ప్రజాస్వామ్యాన్ని ఉద్యమ శక్తిని నిరూపించింది. ఈ శక్తికి మూలం, స్ఫూర్తి ఓయూ జేఏసీ. ఆ స్థితి నుండి విద్యార్థి జేఏసీ రెండుగా చీలడం రెండు నాలుగు కావడం, నాలుగు ఎనిమిది కావడం యాధృచ్ఛికం, సహజ పరిణామం కాదు.

బ్యూరోక్రాట్స్, రాజకీయ పార్టీలు ఇంకొన్ని అదృశ్య శక్తుల హస్తం విద్యార్థి ఉద్యమం బలహీనపడడానికి కారణం. విద్యార్థి ఉద్యమానికుండే స్వభావం రీత్యా, పరిమితి రీత్యా ఉచ్ఛ స్థాయిలో సుదీర్ఘకాలం మనలేకపోవును. కాని ఆ ఉద్యమం నుండి కొత్త

తరం నాయకత్వ శ్రేణి పుట్టుకొని రావల్సివుండె. ఉద్యమ నాయకత్వం 2009 డిసెంబర్ నుండి 2010 మార్చి రెండవ వారం వరకు క్రమంగా తన స్వతంత్రతను కోల్పోయే పరిస్థితిని రాజ్యం సృష్టించింది. రాజ్యం యొక్క పాత్రను విస్మరించి విద్యార్థి ఉద్యమ ఉత్థాన , పతనాలను నేటి స్థితిని అంచనా వేయడం చాలా కష్టం.

1. నిబద్ధత గల ఉద్యమ సంస్థలతో ఐక్య పోరాటాలు చేయకుండ మావోయిస్టు ముద్ర వేయడం. 2.రాజకీయ పార్టీలు డబ్బు ఇస్తూ ఉద్యమాన్ని తమ చేతుల్లో ఉంచుకోవాలని ప్రయత్నించడం. 3. అరెస్టులు, జైళ్ళు, నిర్బంధం మొదలైన అణిచివేత పద్ధతులతోని పోలీసులకు లోబడని జేఏసీ లీడర్స్‌ను సీరియస్‌గా టార్గెట్ చేయడం. 4. కులాన్ని, కులాల మధ్య వైరుధ్యాన్ని ఉపయోగించడం, ఆయా కులాల్లోని ఉన్నత పోలీసు, సివిల్ అధికారులను, కుల సంఘాల, పౌర సంస్థల నాయకులను రాజ్యం ఉపయోగించుకుంది. 5. హింస, హింస అని విస్తృత ప్రచారం మీడియా చేయడం వల్ల ఎదుటి పక్షం దాడిచేస్తూ తిరిగి దాడి చేయాలని ప్రతిఘటన స్వభావాన్ని కలిగించడంలో నాయకత్వం సఫలం కాలేకపోయింది.

అన్నింటికి మించి జరిగిన పెద్ద కుట్ర రాజకీయ జేఏసీ ఆవిర్భావం. వాస్తవానికి రాజకీయ జేఏసీ పార్టీలతో నిర్మితం కావాలి. కాని అందుకు భిన్నంగా జేఏసీలోకి ప్రజా సంఘాలను, ఉద్యమ జేఏసీలను భాగం చేయడమంటే తెలంగాణ ఆధిపత్య రాజకీయ శక్తుల క్రింద జేఏసీ ముసుగులో ఏకీకృతం కావడం తప్ప వేరే కాదు. ఆనాడు దీని ప్రధాన లక్ష్యం "తెలంగాణ శక్తుల ఏకీకరణ" అని చెప్పినప్పటికీ ప్రజల, విద్యార్థుల, వివిధ వర్గాల నాయకత్వంలో రూపుదిద్దుకున్న స్వతంత్ర జేఏసీల అస్థిత్వాన్ని దెబ్బతీయడమే రాజకీయ జేఏసీ రహస్య ఎజెండా! ముఖ్యంగా విద్యార్థి జేఏసీ అస్థిత్వాన్ని దెబ్బతీసి, దానికున్న ప్రతిష్టను, బలహీనపరిచి నాయకత్వ కేంద్రాన్ని ఉస్మానియా నుండి తెలంగాణ భవన్‌కు మార్చడమే ఎజెండా. ఉద్యమాన్ని విచ్చినం చేయడంలో తన ఏజెన్సీల ద్వారా రాజ్యం సాగించిన కృషిలో విజయవంతం అయ్యింది. శ్రీకృష్ణ కమిటీ ఏర్పాటు నేపథ్యం, దాని రిపోర్ట్‌ను బట్టి ఏం జరిగిందో చాలా సులభంగా అర్థం అయ్యింది.

పోరాడి, పోరాడి తెలంగాణను విజయ తీరాలకు చేర్చిన విద్యార్థులు అసంపూర్ణ తెలంగాణను కూడా గట్టిగా ప్రశ్నించి ఉద్యమం చేయలేని స్థితికి వచ్చారు. ఉద్యమం ఇచ్చిన చైతన్యం, దాని ప్రతిఫలాలు వ్యక్తికరణలు చాలా ఉన్నాయి. కాని సంఘటిత శక్తిని కోల్పోయిన విద్యార్థి నాయకులు నేడు రొడ్డుపైన పడ్డారు.

అస్సాం గణ పరిషత్ ఉద్యమం సృష్టించిన వెల్లువ నుండి ఒక తరం శ్రేణి పాలక వర్గంగా రాగలిగింది. కనీసం దోపిడి పార్లమెంటరీ వ్యవస్థను విశ్వసించే వారు ఆ తీరంలో కూడా సఫలీకృతం కాకుండా పాతుకుపోయిన అగ్రకుల ఆధిపత్య వర్గాలు జాగ్రత్త వహించాయి.

సంఘటిత శక్తిగా ఉన్నప్పుడు ఓయూజేఏసీ బలం, ప్రతిష్టతోని నేటి గర్వపడే విద్యార్థి నాయకత్వంకు చట్టసభల్లో అడుగుపెట్టాలనే కోరిక తప్ప వారు ఏ వ్యవస్థలోకి అడుగుపెట్టాలనుకుంటున్నారో దాని గురించి ప్రాథమిక విషయాలు కూడా తెలియదని ఎన్నికల అనుభవం ద్వారా అర్థం అవుతుంది. తెలంగాణ ఉద్యమం పేరుతో స్వామిగౌడ్, కేసీఆర్, ఇంకా ఎందరో నాయకులైనారు ఎంపి, ఎమ్మెల్యే, ఎంఎల్‌సిలు అయినారు. మేమెందుకు కాకుడదనే ప్రశ్నే అనేక మంది విద్యార్థి నాయకులను ఎన్నికలవైపు నడిపించింది. కాని వారెందుకు నాయకులు కావాలని అనుకుంటున్నారో, వారికి రాజకీయ నాయకుల, ప్రధాన పార్టీలకు తేడా ఎక్కడుందో చెప్పగలిగితే సరిగ్గా ఆలోచించగలిగితే పరిస్థితి ఇలా ఉండేదికాదు. ప్రజల పట్ల నిబద్ధత, ఒక స్పష్టమైన సైద్ధాంతిక అవగాహన, నిజాయితీగల కార్యాచరణ లేకుండా కనీసం బూర్జువా చట్టంలో కూడా ఒక రాజకీయ శక్తిగా ఇమడడం అసాధ్యమనే అనుభవాన్ని విద్యార్థి నాయకత్వం సంపాదించింది. అగ్రకుల దోపిడి శక్తుల ఇండ్లముందు, పార్టీల కార్యాలయాల ముందు పడిగాపులు కాసి చివరకి టిక్కెట్ రాక నిరాశచెందిన వారిపట్ల కొంత సానుభూతి కనిపిస్తున్నప్పటికీ ఇది ఇచ్చిన అనుభవం చెంపపెట్టులాంటిది.

విద్యార్థి నాయకత్వంలోని కొందరు సంపాదించిన ఆస్తులు మొత్తం కలిసినా ఒక రాజకీయ నాయకుని భూకబ్జాలో పది శాతం ఉండకపోవచ్చు. కాని అవినీతి పరంగా, పదవి వ్యామోహపరంగా, దళారులుగా, ఇంకా ఎన్నో తీర్లు ముద్రపడ్డ విద్యార్థి నాయకుల పట్ల ఎందుకు ఆధిపత్య వర్గాలు విష ప్రచారం చేశాయో బుద్ధిజీవులు గుర్తించగలరు. ఆమేరకు వారిపట్ల సానుభూతి ఉంటుంది. వారు ఎదుర్కొన్న కేసులు, జైళ్ళు, నిర్బంధాలు, ఉద్యమంలో పడ్డ కష్టాలపై గౌరవం ఉంటుంది. ఆంతమాత్రంచేత సిద్ధాంతం, విలువలు, ఏ మాత్రం లేకుండా వ్యక్తిగత స్వార్థమే పరమావదిగా దిగజారి దాన్ని సమర్థించుకోవడానికి చేసే తప్పుడు సిద్ధాంతికరణలు వక్రీకరణలు రోతపుట్టిస్తాయి.

విద్యార్థులకు వచ్చిన ఈ అనుభవం వివిధ జేఏసీలలో పనిచేసిన చాలా మందికి రావడం దళారీ రాజకీయ వ్యవస్థ స్వభావాన్ని అర్థం చేసుకోడానికి చక్కగా ఉపయోగపడుతుంది. ఈ అనుభవం నుండి తెలంగాణ భవిష్యత్‌ను అర్థం చేసుకోగలిగితే ప్రజల ప్రత్యామ్నాయ అవసరం ఎందుకవసరమో మరింతగా అర్థం కాగలదు. ఆ రాజకీయ వ్యవస్థ స్వభావ, స్వరూపాలపై విద్యార్థుల్లో ఇంకా లోతుగా చర్చ జరిగితే ప్రజాస్వామిక తెలంగాణకు ఉపయోగకరం.

– వ్యాసకర్త ప్రజాఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి

# బతుకుపోరులో ... ఓయూ "స్వీపర్స్"

– జోగు లింగస్వామి, డేవిడ్



రోడ్లను శుభ్రపరుస్తున్న స్వీపర్స్ (ఫోటో గూగుల్ నుంచి)

ఇళ్లు అందంగా ఉందంటే ఆ గొప్పతనం ఆ ఇంటి ఇల్లాలికే చెందుతుంది. అలాగే యూనివర్సిటీ అందంగా ఉందంటే కూడా ఆ క్రెడిట్ అంతా యూనివర్సిటీలో పనిచేసే మహిళలకే చెందుతుంది. దేశంలోనే అతి పెద్ద యూనివర్సిటైన ఓయూను తమ సొంత ఇంటిలా భావించి అద్దంలా తీర్చిదిద్దుతున్న వర్కర్స్‌ల జీవితాల గురించి చాలామందికి తెలియదు. ఒక్కరోజు మన ఇళ్లు శుభ్రంగా లేకుంటే ఎంత చిరాగ్గా ఉంటుందో వేరే చెప్పక్కర్లేదు. ఒక పదిరోజులు మన స్వీపర్స్ డ్యూటీ చేయకుంటే ఎలా గుంటుందో ఊహించుకోండి? ఊహే భయంగా ఉంది కదూ? విద్యార్థులు నానా గొడవచేసి పత్రికలకెక్కుతారు.? అలాంటి యూనివర్సిటీ మురికి కూపంగా, డంప్ యార్డ్‌గా మారకుండా నిరంతరం తమ శ్రమశక్తిని దారపోస్తున్నారు వీళ్లు. యూనివర్సిటీ పరిధిలో పనిచేసే ఈ ఆడపడుచుల కష్టాలు, సంతోషాల జీవన శైలిని బయటి ప్రపంచానికి చెప్పాలనే చిరు ప్రయత్నమే ఇది.

రోజంతా దుమ్మూ ధూళితో నిండే యూనివర్సిటీ పరిసరాలు వీళ్ల చేతులు పడందే పవనం కాదు. అందరి ఆడవాళ్లు తమ ఇంటి గురించి మాత్రమే ఆలోచిస్తారు. కానీ ఈ చిరుద్యోగులు యూనివర్సిటీ గురించి ఆలోచించే పెద్ద మనసున్న మనుషులు. ఒక రకంగా చెప్పాలంటే యూనివర్సిటీని తమ సొంత ఇంటిగా భావిస్తారని చెప్పవచ్చు. చీపురు కట్టను తమ శరీరంలో ఒక భాగంగా చేసుకున్న ఈ స్వీపర్లు పనిలోకి దిగారంటే ప్రపంచాన్నే మరిచిపోతారు. యూనివర్సిటీ పరిసరాలను ఊడ్చి ఊడ్చి వీళ్ల నడుములు ఒంగిపోతున్నా పని పూర్తికానిదే విశ్రమించరు. చేతుల్లో ఉన్న చీపురుతో రోడ్లను చీల్చి చెండాడే ఈ మహిళలు దుమ్మూ ధూళిని కూడా కడుపులోనే దాచుకుంటారు. ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి బయలుదేరిన వీళ్లు 8 గంటలకు పనిని ప్రారంభిస్తారు. సాయంత్రం 4 గంటలకల్లా యూనివర్సిటీ పరిసరాలను అద్దంలా మార్చి 5 గంటలకు ఇళ్లకు చేరుకుంటారు. క్లుప్తంగా ఇది వీరి దినచర్య. ఒకరకంగా కుటుంబ సభ్యులతో కంటే వీళ్లతోనే ఎక్కువ సమయాన్ని గడుపుతుంటారు. బాధైనా, సంతోషమైనా వాళ్ల గ్రూపుల సహచరులతోనే పంచుకుంటారు. స్వీపర్‌గా పనిచేసేవాళ్లలో కొద్దిమంది పురుషులు ఉన్నా సగానికి పైగా మహిళలే ఉన్నారు. వాళ్ల కష్టాలు, సంతోషాలు, ఫ్యామిలీ మ్యాటర్స్ అన్నీ డ్యూటీలోనే షేర్ చేసుకుంటారు. పాటలు పాడతారు. జోకులు వేసుకుంటారు. నవ్వుతారు. నవ్విస్తారు.

సాధారణ సర్కార్ లెక్కల్లో చెప్పే జీవితాలకు, వీళ్ల జీవితాలకు అసలు పోలికే ఉండదు. యూనివర్సిటీలో ఉద్యోగం అన్న సంతోషం తప్ప వీళ్ల జీవితం మొత్తం చీకట్లోనే గడుస్తుంది. ప్రతిరోజు సూపర్‌వైజర్ వీళ్లకు అప్పగించిన పనులను పూర్తిచేయడం వీళ్ల బాధ్యత. ప్రతి పదిహేను మందిని ఒక టీమ్‌గా ఏర్పాటు చేసి వాళ్లకు ఊడ్చే బాధ్యతను అప్పగిస్తారు. ఒక్కొక్క గుంపు ఒక ఏరియాను ఎంచుకొని విధులు నిర్వహిస్తారు. ప్రతి రోజు కనీసం 5 నుండి 6 ప్రాంతాలు వీళ్లు శుభ్రపరచాల్సి ఉంటుంది. ఏముందిలే పని తూతూ మంత్రంగా చేద్దాంలే అనుకుంటే కుదరదు. పని పక్కాగా ఉండాలి. వీళ్ల సూపర్‌వైజర్ అన్నింటిని అబ్జర్వ్ చేస్తుంటాడు. చలికాలంలోనైనా, వర్షాకాలంలోనైనా వీళ్లకు మినహాయింపులు ఉండవనే చెప్పాలి. వర్షాకాలంలో అయితే తీరిక ఉండక నడుం పడిపోయే పరిస్థితి వస్తుందంటున్నారు స్వీపర్లు. ఇంత చేస్తున్నా డ్యూటీలో ఏమైనా జరిగినా వాళ్లకు న్యాయం జరిగే దిక్కులేదు. ఎందుకంటే వీళ్లు పర్మినెంట్ ఉద్యోగులు కారు కాబట్టి. కాంట్రాక్ట్‌ల కింద పనిచేసే వీళ్లకు మొదట్లో చాలా తక్కువ జీతం ఉంటే దాన్ని ఈ మధ్యనే ఉద్యమాల ఫలితంగా కొంత పెంచారు. ఇంత చేస్తున్నా వీళ్ల జీతాలు మాత్రం వీళ్ల కడుపు నింపలేవు. ఏ శాఖలోనైనా ఐదు సంవత్సరాలకే పర్మినెంట్ చేసే సర్కార్ మాత్రం దుమ్ములోనే బతుకుతున్న వీళ్లను మాత్రం తమ ఉద్యోగులుగా గుర్తించడం లేదు. అంటే పర్మినెంట్ చేయడం లేదు. అలాగే వీళ్ల జీతాలైన పనికి తగ్గ ఉన్నాయా అంటే అదీ లేదు. 2 వేల నుంచి 4 వేలకు చేరడానికి 15ఏండ్లు పట్టిందంటా!.

పనిచేసే వాళ్లలో యువతులే కాదు. తల్లులు, వృద్ధులు కూడా ఉన్నారు. మాటలైన రాని పిల్లలను కుటుంబ సభ్యులకు అప్పజెప్పి విధులను నిర్వహిస్తున్నవారు కొందరైతే, వయసు మీరిన తల్లిదండ్రులను ఒంటరిగా ఇంట్లో వదిలేసి వచ్చినవారు ఇంకొందరు. ఎప్పటికైనా తమ ఉద్యోగం సర్కార్ రికార్డుల్లో చేరకపోతుందా అన్న చిన్న ఆశ వీళ్ల చూపుల్లో కనిపిస్తుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సందర్భంగా యూనివర్సిటీ మొత్తం ఆనందంలో మునిగితేలుతుంటే... స్వీపర్ల జీవితాల్లో మాత్రం ఆ వెలుగు కనిపించడం లేదు. స్వీపర్ల సుఖదు:ఖాలను తెలుసుకు నేందుకు క్యాంపస్ వాయిస్ ప్రయత్నించగా, వారు తమ కష్టాల్ని తమ కుటుంబ సభ్యులతో బాధలను పంచుకున్నట్లుగా పంచుకున్నారు. స్వీపర్ల సుఖ, దు:ఖాన్ని వారి మాటల్లోనే తెలుసుకోండి.

నా పేరు హబీబున్నిసా. మాణికేశ్వర్ నగర్‌లో ఉంటున్నాను. నలుగురు అమ్మాయిలు ఉన్నారు. అందరికి పెళ్లి అయ్యింది. మా ఆయన ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో పనిచేసేవాడు. 12 ఏండ్ల క్రితం వర్క్‌లోనే ఏమైందో ఏమో తెలియదు. పనిచేస్తూ కిందపడిపోయాడు. ఆసుపత్రికి తీసుకెళ్లే వరకు చనిపోయిండని తెలిసింది. ఆయన చనిపోయిన తర్వాత ఆయన జాబు నాకు ఇచ్చారు. మొదట మూడు సంవత్సరాలు డేలీ వైజ్ వర్కర్‌గా ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో పనిచేశాను. సులేమాన్ సిద్దిఖీ సాబ్ వీసీగా ఉన్న కాలంలో నా ఉద్యోగం పర్మినెంట్ అయ్యింది. మొదట్లో నాకు నెలకు మూడు వేల రూపాయలు ఇస్తుండ్రీ, కానీ తర్వాత పర్మినెంట్ అయ్యాక జీతం పెరిగింది. మొదట్లో చాలా మంది పర్మినెంట్ వర్కర్స్ ఉండేవాళ్లు. కానీ అంతా రిటైర్మెంట్ కావడంతో డైలీ వైజ్ వర్కర్స్‌తో పనిచేయిస్తున్నారు. ఇప్పుడు నేను ఇంకో ఇద్దరు మాత్రమే పర్మినెంట్ వర్కర్స్‌ము ఉన్నాం. నేను కూడా వచ్చే సంవత్సరం మే నెలలో దిగిపోతున్నా. చాలా మంది వయసు అయిపోతున్నా ఇంకా పర్మినెంట్ కాకుండానే దిగిపోతున్నారు. అందరిలో పెద్దదైన హబీబున్నిసా తను పనిచేస్తున్న గుంపులో తను మాత్రమే పర్మినెంట్ స్వీపర్ అయినప్పటికీ తనలో ఏమాత్రం గర్వం తొనికిసలాడకుండా చిన్నవాళ్లతో కూడా కలిసిపోయి, తోటి వాళ్ల సుఖ, దు:ఖాల్లో పాలు పంచుకుంటుందంటుంది. కనీసం తెలంగాణ సర్కారులోనైనా వాళ్లకు పర్మినెంట్ అవుతే బాగుండని తోటి వాళ్ల జీవితాల గురించి ఆలోచిస్తుందీ పెద్దావిడ హబీబున్నిసా.

ఇక గుంపులోనే పెద్దవాడైన రామస్వామీ గారి జీవితం నిత్యం కష్టాలమయమే అని చెప్పవచ్చు. తన కొడుకుల, కూతుళ్ల వయసులో ఉన్న వాళ్లతో కలిసి పనిచేస్తూ ఏటికి ఎదురీదుతున్నాడు. తన కంటే చిన్నవాళ్లైన యువకులు పనిలో తనను ఆటపట్టిస్తూ బనాయిస్తున్నా కూడా వాళ్లు నా పిల్లలాంట్లోళ్లు కదా అని ఎంజాయ్ చేస్తానంటున్నాడు. వెనకా ముందు ఎవరూ లేరు నాకు. అందరూ వీళ్లే. ఇదే ప్రపంచం. వాటిని సరదాగా తీసుకుంటేనే బతుకు బండి సాఫీగా సాగుతుందని అనుభవం నేర్పిన పాఠాన్ని బోధిస్తున్నాడు. 53 ఏండ్ల రామస్వామిది నిత్యం బతుకు పోరాటమే. 40 ఏండ్ల క్రితం ఉన్నఊర్లో సొంత మనుషులే మోసం చేసి, ఉన్న ఏడెకరాల భూమిని, ఇంటినీ కాజేస్తే బతుకుదెరువుకోసం పట్నం బాట పట్టాడు. ముగ్గురు పిల్లలున్న రామస్వామి తన పిల్లలను పోషించడానికి మొదట్లో ఒక బ్యాంకుల్లో పనిచేశాడు. అది దివాళ తీయడంతో ఉన్న ఉద్యోగం పోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో తెలిసిన బందువుల ద్వారా యూనివర్సిటీలో కాంట్రాక్ట్ వర్కర్‌గా జాయిన్ అయ్యాడు. మొదట్లో 2 వేల రూపాయల జీతంతో ప్రారంభమైన రామస్వామి బతుకు పోరాటం తొమ్మిది సంవత్సరాలకు 4 వేలకు



**రామస్వామి**

చేరుకుంది. ఇప్పటికే రెండు సార్లు హార్ట్ ఆపరేషన్ చేయించుకున్నాడు. రామస్వామిని ఈ దుమ్ములో పనిచేస్తే ఆరోగ్యం ఇంకా దెబ్బతింటుంది కదా? ఇబ్బంది అనిపించదా అంటే?.... ***"ఇబ్బంది అవుతుంది అని కూర్చుంటే పొట్ట నిండదు కదా?...ఆస్తులు ఎలాగు లేవు. ఏ పని దొరికితే అది చేయాలి. ఇక దుమ్మంటావా? అది ఎలాగూ ఉండనే ఉంది. దాంట్లోనే పనిచేయాలి. లేకపోతే లేదు. బతుకే దుమ్ముకొట్టుకుపోయాక ఇక పోయేదేమోంది"*** అంటూ జీవిత సత్యాన్ని ఒడపోస్తున్నాడు.

ఇక ఇదే గుంపులో పనిచేసే లక్ష్మి (పేరు మార్చాము) పరిస్థితి కూడా ఇంచు మించు ఇంతే అని చెప్పాలి. గవర్నమెంట్ ఉద్యోగం చేసే వ్యక్తికి బిడ్డనిస్తే తన కూతురుని కాలు భయటపెట్ట నీయకుండా చూసుకుంటాడన్న తల్లిదండ్రుల అంచనాలు తప్పని తెలుసుకోవడానికి ఎక్కువ రోజులు పట్టలేదు. కట్టుకున్న భర్త ఉద్యోగానికి సరిగ్గా పోకుండా ఇంట్లోనే కూర్చుంటే, ఇల్లు గడవని స్థితిలో పిల్లల భవిష్యత్తు కోసం గడపదాటాల్సి వచ్చింది. తన జీవితంలో ఎలాగు సుఖపడింది లేదు, కనీసం పిల్లల జీవితాలైన బాగుపడాలనే ఉద్దేశంతో జీతం తక్కువైన తమ పిల్లలను పోషించుకోవడానికి యూనివర్సిటీలో జాయిన్ అయ్యి గత ఐదు సంవత్సరాల నుంచి స్వీపర్‌గా పనిచేస్తుంది. ***"మా ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయనే నమ్మకం ఎలాగు లేదు, కనీసం జీతాలన్నా పెరిగితే బాగుంటుందంటూ"*** తెలంగాణ సర్కార్ మీద ఆశలు పెంచుకుంటుంది లక్ష్మీ గారు.

వాళ్ల పరిస్థితి ఇలా ఉంటే ఉన్న ఊరును, కన్న వారిని వదులకొని బతుకుదెరువు కోసం వలస పక్షిలా నగరం బాట పట్టిన స్థితి రహేమున్నిసాది (పేరు మార్చాము) గుంటూరు జిల్లాకు చెందిన రహేమున్నిసా భర్త వికలాంగుడు. అక్కడే ఫ్రూట్ బిజినెస్ చేసేవాడు. బిజినెస్ కాస్త దెబ్బతినడంతో బతుకుదెరువుకోసం పట్నం బాట పట్టారు. వచ్చిన కొత్తలో ఏ పని దొరకక ఇబ్బంది పడుతుంటే ఇంటికి దగ్గర్లో ఉండే ఒకామె యూనివర్సిటీలో పనిచూపించి ఆదుకుంది. ఒకవైపు భర్త ఆలనాపాలన చూసుకుంటునే గత ఐదు సంవత్సరాల నుంచి స్వీపర్‌గా పనిచేస్తూ బతుకుబండిని లాగుతుంది. మీరు ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారు కదా? తెలంగాణ ఉద్యమం జరుగుతున్న కాలంలో నిన్ను ఎవరూ ఏమీ అనలేదా అని ప్రశ్నిస్తే ***"ఎవ్వరూ ఏమీ అనలేదు సార్, అప్పుడప్పుడు మాత్రం కామెంట్ చేస్తూ, ఎక్కువ చేస్తే ఆంధ్రకు పంపిస్తామని ఆటపట్టిస్తరు. కానీ తర్వాత అంతా మరిచిపోయి సొంత మనుషుల్లాగా చూసుకుంటున్నారు. సొంతోళ్లను వదులుకొని వచ్చిన నాకు ఇక్కడ ఉన్న వాళ్లు తోడ బుట్టిన వాళ్లకంటే ఎక్కువగా చూసుకుంటున్నారంటూ కనీళ్లు తెచ్చుకుంటుంది. అయినా బతకడానికి వచ్చినోళ్లకు ఈ ప్రాంతాల గొడవేముంటుంది సార్"*** అంటుంది.

స్వీపర్లుగా పనిచేస్తున్న వీళ్లందరు ఇంచుమించుగా ఒకేసారి పనిలో చేరినప్పటికీ దాదాపు అందరి పరిస్థితి ఒకేటే నని చెప్పవచ్చు. తమ కుటుంబం నడవాలన్నా, పిల్లల భవిష్యత్ బాగుండాలన్నా, పనిచేసుకుంటే తప్ప బతుకుబండీ నడవదని చెబుతున్నారు వీళ్లు. గత ఐదు నుంచి 10 సంవత్సరాలుగా ఇదే పనిచేస్తున్నప్పటికీ యూనివర్సిటీ అధికారులు జీతాలు మాత్రం పెంచడం లేదని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. రోజు రోజుకు ఇంటి అద్దెలు, స్కూల్ ఫీజులు, కూరగాయల ధరలు పెరుగుతున్న తమ జీతాలు పెరగకపోవడం వలన కుటుంబంలో భార్య భర్తలు ఇద్దరు పనిచేసినప్పటికీ ప్రతినెల ఎంతో కొంత అప్పుచేయాల్సి వస్తుందంటున్నారు ఈ స్వీపర్లు. వీళ్లు చేసేది కాంట్రాక్ట్ ఉద్యోగం కావడంతో ప్రతి మూడు నెలలకు ఒక సారి రెన్యూవల్ చేయాలనే పేరుతో జీతాలు కూడా సరైన సమయానికి అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయట చెప్పుకోవడానికి యూనివర్సిటీలో పనిచేస్తుందనట్లు ఉంది కానీ జీతం మాత్రం నామమాత్రమే అంటున్నారు. హైదాబాద్ వంటి నగరంలో చాలీ చాలని జీతంతో బతకడం మూలంగా అనేక సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుందని, కనీసం వచ్చే తెలంగాణ సర్కార్‌లోనైన తమ బతుకులు బాగుపతాయోమో అని గంపెడాశతో ఎదురుచూస్తున్నారు.

పనిచేస్తున్న సందర్భంలో పైన ఉన్న అధికారులు వేధింపులకు గురిచేస్తరు కదా అట్లాంటివి మీరేమైనా ఎదుర్కొన్నారా? అని ప్రశ్నిస్తే ...కాసేపు ఒకరి మోకాలు ఒకరు చూసుకొని... ***"అట్లాంటిది మాకేమి ఎదురు కాలేదు సార్ అంటూనే, ఇంకో ఆమె లేదు సార్ ఆమె ఉంటే ఏమీ దాచుకోకుండా అన్నీ చెబుతుందే"*** అంటూ మౌనంగా ఉండిపోయారు. నిజానికి బతుకు దెరువుకోసం ఇంకొకరిపై అధారపడి ఉన్న స్థితిలో ఇలాంటి నిత్యం మనకు కనిపిస్తుంటాయి. ఆడదాని చీరకొంగు కనిపిస్తే చాలు పిచ్చికుక్కల్లా రెచ్చిపోయే ఈ పురుష్యాధిక్య సమాజంలో అనునిత్యం ఆడది బతుకుబండి లాగేందుకు అనేక అవమానాలను, అణిచివేతలను భరిస్తుందనే చెప్పాలి. దీనికి ఓయూ కూడా మినహాయింపేమీ కాదు. నిత్యం ఏదో ఒక మూల వర్కర్స్‌పై ఇలాంటి సంఘటనలు జరుగూతూనే ఉన్నాయి. కానీ నోరు విప్పి నిజం చెబితే ఏక్కడ పని కోల్పోవాల్సి వస్తుందో అనే భయంతో అవమానాన్ని పంటికిందే బిగబట్టేస్తుంది. బతుకుబండీ లాగే క్రమంలో అనునిత్యం జీవన పోరాటం సాగించే ఈ స్వీపర్ల జీవితం కత్తిమీద సామే అని చెప్పవచ్చు. తెలంగాణ రాష్ట్రం సాకారమైన క్రమంలో కనీసం ఇప్పుడైన వీళ్ల జీవితంలో వెలుగు నిండుతుందో చూడాలి.

# మహిళలపై అత్యాచారాలు:

## చట్టం – పురుష్యాధిక్య భావజాలం


– వెన్నెల

దేశంలో మహిళలపై, బాలికలపై అత్యాచారం జరగని రోజు లేదు. ఈ మధ్య కాలంలో ఈ ఘటనలో ఆందోళన కలిగించే స్థాయిలో జరుగుతున్నాయి. అయితే ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు బాధ్యులను కఠినంగా శిక్షించాల్సిన ప్రభుత్వాలు, ప్రభుత్వంలో ఉన్న పెద్దలు అత్యాచారాలు జరగడానికి మహిళలే కారకులంటూ నెపాన్ని వారిపైనే నెట్టేయ్యడానికి ప్రయత్నిసున్నారు. దాంట్లో భాగమే సమాజ్‌వాదీ నేత ములాయం సింగ్ యాదవ్ **"అబ్బాయిలు అబ్బాయిలే, వారు తప్పు చేస్తారు"** దానికి కారణం అమ్మాయిలే అని ముంబై శక్తి మిల్స్ అత్యాచార నిందితులను వెనకేసుకొస్తూ మాట్లాడాడు.


ఢిల్లీ మెడికో విద్యార్థిని(నిర్భయ అనబడే జ్యోతిసింగ్ పాండే)పై జరిగిన క్రూరమైన అత్యాచారం తర్వాత దేశ వ్యాప్తంగా మహిళల భద్రతపై పెద్ద ఎత్తున ఆందోళన మొదలైంది. అంతే స్థాయిలో తీవ్ర చర్చను కూడా లేవనెత్తింది. మెడికో విద్యార్థినిపై జరిగిన అత్యాచారమే, ఈ దేశంలోని మహిళలపై జరిగిన మొదటి అత్యాచారం కానప్పటికీ, అత్యాచారబాధితురాలికి అండగా మధ్యతరగతి ప్రజలు, విద్యార్థులు, సెలిబ్రెటిస్, మీడియా పెద్ద ఎత్తున అండగా నిలిచారు. ఢిల్లీ అత్యాచార ఘటన కంటే ముందు ఈ దేశం మొత్తాన్ని కలవరపాటుకు గురిచేసిన సంఘటనలు అనేకం జరిగినప్పటికీ (ఉదా: కాశ్మీర్‌లోని కునర్ పుష్పోరా గ్రామంలో ఒకే రోజు 64 మంది మహిళలు పోలీసుల చేతిలో అత్యాచారానికి గురికావడం, అలాగే వాకపల్లి ఆదివాసీ మహిళలపై గ్రేహౌండ్ పోలీసుల అత్యాచారం మొదలైనవి) కార్పోరేటు మీడియా, మధ్యతరగతి జీవులనుండి, విద్యార్థులనుండి తగినంత వ్యతిరేకత, స్పందన రాలేదు. దీనికి అనేక కారణాలు ఉన్నాయనుకోండి. (ఆ కోణాన్ని ఇంకో వ్యాసంలో చర్చించ వచ్చు) కాని నిర్భయ అత్యాచారం,మరణం తర్వాత దేశ వ్యాప్తంగా జరిగిన ఆందోళన ఫలితంగా కేంద్రప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన కమీషన్‌ను ఏర్పాటుచేసి చేతులు దులుపుకుంది. అయితే కేంద్రం అనుకున్న సమయంకంటే ముందుగానే జస్టిస్ వర్మ తన రిపోర్టును ప్రభుత్వం ముందు ఉంచి అనేక విలువైన అంశాలను రిపోర్టులో పొందపరిచాడు. జస్టిస్ వర్మ ఈ రిపోర్టులో పొందపరిచిన అంశాలను ప్రభుత్వం అనేకం ఆమోదించనప్పటికీ అత్యాచార నేరాలు అరికట్టేందుకు "నిర్భయ" పేరుతో ఒక చట్టాన్ని తీసుకొచ్చింది. చాలా మంది ఈ చట్టం రావడం మూలంగా ఇక దేశంలో మహిళలపై నేరాలు తగ్గుముఖం పడతాయి అని భావించినప్పటికీ అదేమీ జరగకపోగా నేరాల సంఖ్య రోజురోజుకు పెరుగుతూ చట్టాలను అపహాస్యం చేస్తున్నాయి. నిర్భయ చట్టం అమలులోకి వచ్చిన మరుసటి రోజు మన రాష్ట్రంతో సహా దేశ వ్యాప్తంగా 50 మంది మహిళలు అత్యాచారానికి గురైనట్లు అనేక స్వచ్ఛంద సంస్థల రిపోర్టులు చెబుతున్నాయి. స్త్రీల పట్ల పురుషాధిక్య సమాజంలో, భావజాలంలో మార్పు రాకుండా ఎన్ని చట్టాలు మహిళలపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలను అరికట్టలేమని వర్తమాన చరిత్ర రుజువుచేస్తుంది.

**ఆగని అత్యాచారాల పర్వం:**

ఢిల్లీ ఘటన తర్వాత దేశంలోని అత్యధిక మంది మహిళలు, విద్యార్థులు టీవీల ముందు ఊగిపోతూ నడిరోడ్డుమీద నిందితుల్ని ఉరితీస్తే తప్ప ఇట్లాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కావంటూ అభిప్రాయాన్ని వెళిబుచ్చారు. దాదాపు చాలా మంది



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ వర్మ



బొంబాయి శక్తిమిల్ అత్యాచార స్థలం దగ్గర ఉన్న మహారాష్ట్ర పోలీసులు

అమ్మాయిలు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని చెప్పవచ్చు. అయితే కఠినమైన శిక్షలు విధించినంత మాత్రాన ఇటువంటి ఘటనలు ఆగిపోవు అనడానికి మన రాష్ట్ర అనుభవం ఒకటి ఇంకా మన కళ్లముందే ఉంది. 2009లో వరంగల్ విద్యార్థినిలైన స్వప్నిక, ప్రణితలపై యాసిడ్ దాడికి పాల్పడిన నిందితుల్ని పోలీసులు కాల్చిచంపినా, అటువంటి ఘటనలు మాత్రం ఆగకపోగా ఇంకా అనేకం ప్రతి నిత్యం జరుగుతున్నాయి. చాలా మంది అభిప్రాయం ప్రకారం చట్టాలు పరిష్టంగా ఉంటేనో లేదా శిక్షలు కఠినంగా అమలు చేస్తే నేరాలు తగ్గుతాయని భావిస్తారు. కాని బాహ్య పరిస్థితులు మారనంతవరకు అవి కొనసాగుతాయని ప్రతి నిత్యం ఏదో మూలన మహిళలపై జరుగుతున్న ఘటనలే సజీవ సాక్షం.

**అదే ఘోరం! అదే క్రూరత్వం:**

నిర్భయ ఘటన తర్వాత చట్టాన్ని పరిష్టం చేశామని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా శిక్షలు త్వరగా అమలుచేస్తామని పాలకులు చెప్పుకొచ్చారు. ఈ దేశంలోని ఫాస్ట్ ట్రాక్ కోర్టులు వేగంగా పనిచేస్తున్నాయో లేదో కాని అత్యాచారాల పర్వం మాత్రం రాకెట్ వేగంతో దూసుకెళుతుంది. దీనిని ఉదహరణగా ముంబై నగరంలో జరిగిన అత్యాచార ఘటనను చూడవచ్చు. దాదాపు ఢిల్లీ అత్యాచారం తరహాలోనే ముంబైలోని శక్తిమిల్‌లో, విధి నిర్వహణలో ఉన్న ఒక ఫోటో జర్నలిస్టు యువతిపై ఐదుగురు మృగాళ్ళు పైశాచిక రీతిలో అత్యాచారానికి ఒడిగట్టారు. ముంబై నగరంలో ఇటీవల కాలంలో పాత భవనాలు వరుసగా కూలిపోతు అనేక మంది కూలీలు మృత్యువాత పడుతున్నారు. 20వ శతాబ్దం ప్రారంభంలో ముంబైలోని బట్టల మిల్లుల్లో పనిచేసేందుకు గ్రామాల నుంచి వలస వచ్చిన ప్రజల కోసం ఈ భవనాలను నిర్మించారు. ఇలాంటి భవనాల్లో 10 నుండి 20 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఈ భవనాలు ఒక్కొక్కటిగా కూలీపోతు మృత్యు ద్వారాలుగా మారుతున్నాయి. ఈ భవనాల గురించి ఒక కథనాన్ని తయారుచేసేందుకు, ఒక ఆంగ్ల మ్యాగజైన్ కోసం ఫోటో జర్నలిస్టుగా పనిచేస్తున్న యువతి, స్నేహితునితో కలిసి వెళితే ఘోరమైన అనుభవం ఎదుర్కొవాల్సి వచ్చింది. నిర్భయ విషయంలో జరిగినట్లే అక్కడ ఉన్న వ్యక్తులు యువతిపై అసభ్య వ్యాఖ్యలు చేయడంతో తోడుగా వెళ్లిన స్నేహితుడు వారించడంతో ఆ స్నేహితున్ని దుండగులు తీవ్రంగా చావబాదారు. ఇద్దరు వ్యక్తులు అతన్ని కట్టేసి కొడుతూ ఉంటే, మిగిలిన ముగ్గురు ఆమెను శక్తిమిల్స్ కాంపౌండ్‌లోనికి ఈడ్చుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టారు. బాధితురాలి శరీరంలో అంతర్గతంగా తీవ్ర గాయాలు అయినట్లు డాక్టర్లు పత్రికలకు తెలిపారు. బాధితురాలు ధైర్యంగా మీడియా ముందుకు వచ్చి ఘటనను వివరించడంతో రాష్ట్రంలో పెద్దఎత్తున నిరసనలు మొదలయ్యాయి. ఢిల్లీ ఘటన సందర్భంగా జరిగిన

ఆందోళనల అనుభవం దృష్ట్యా, ముంబై పోలీసులు కాస్త వేగంగా స్పందిచడంతో ఐదుగురు నిందితుల్లో ఇద్దరిని వెంటనే అరెస్టు చేయగలిగారు. అయితే తన పట్ల జరిగిన మృగాల దాడికి తట్టుకొని నిలబడటమే కాకుండా నిందితులకి శిక్షపడేంత వరకు ఆమె పోరాటం నిర్వహించడంతో కోర్టు నిందితుల్లో ముగ్గురికి మరణశిక్షను విధించడం జరిగింది.

అయితే నిందితులకు విధించిన మరణశిక్షపట్ల విభిన్న అభిప్రాయలు ఉన్నప్పటికీ ఈ తీర్పు సందర్భంగా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జ్ శాలిని ఫల్సాలర్స్ చేసిన వ్యాఖ్యానాలు తీవ్ర చర్చకు దారితీశాయి. తన తీర్పులో ***"ముంబైలోని శక్తిమిల్స్ అత్యాచారం ఘటన ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటనకు ఏ మాత్రం తీసిపోనిదని"*** వ్యాఖ్యానిస్తూనే చట్టాల పరిమితిని వివరించింది. ***"నిర్భయ ఘటనకు సంబంధించిన ఆందోళన, పరితాపం ఇంకా చల్లబడకముందే ఈ ఘటన జరిగింది. కఠిన చట్టాలు రూపొందించినప్పటికీ, యువకులు ఇటువంటి క్రూరమైన, అమానవీయ ఘటనలకు పదే పదే పాల్పడుతున్నారని"*** జడ్జి ఫల్సాలర్స్ అన్న మాటలు చట్టం యొక్క పరిమితిని ఎత్తిచూపడమే కాకుండా చట్టాల మూలంగా నేరాలు తగ్గుముఖం పడతాయన్న వాదన తప్పని రుజువుచేస్తున్నాయి. పౌరసమాజం ఏర్పడినప్పటి నుండి చట్టాలున్నాయి. రోజు రోజుకు పరిష్టమతున్నాయి కాని నేరాలు మాత్రం అదుపులోకి రావడం లేదని చెప్పడానికి పై తీర్పు సందర్భంగా జడ్జి చేసిన వ్యాఖ్యానం సరిపోతుందేమో! చట్టాలు అనేవి మనిషి నేర ప్రవృత్తిని అదుపుచేయడానికి కొంత తోడ్పడతాయేమో కాని నేరాలు జరగకుండా నిరోధించలేకపోయాయని అనేక దేశాల అనుభవాలు మనకున్నాయి. జంతు దశ నుండి ఇంకా పూర్తిగా బయటపడని మనిషిని చట్టాల మూలంగా సంస్కరించలేమని తేలిపోయింది. ముందు మనిషి సంస్కరింపబడాలి. అంటే సంస్కారం నేర్పే సమాజం రావాలి. అంతవరకు ఈ నేరాలకు ఇప్పుడున్న సమాజమే బాధ్యత వహించాల్సి ఉంటుందనేది గుర్తించాలి.

**పురుషాధిక్య భావజాలం:**

"అబ్బాయిలు అబ్బాయిలే, వారు తప్పు చేస్తారు" ఇవి సమాజ్ వాదీ పార్టీ నాయకుడు ములాయం సింగ్ యాదవ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట్లాడిన మాటలు పెను దుమారానికి తెరతీశాయి. ముంబై శక్తి మిల్స్ అత్యాచార నిందితుల్లోని ముగ్గురికి కోర్టు మరణ శిక్ష విధించిన నేపధ్యంలో ములాయం అన్న మాటలివి. ఈ మాటలు ఆయన పొరపాటుగా అన్న మాటలు కావనీ, రాజకీయ ప్రయోజనాల కోసమే అన్నారని చాలామంది విశ్లేషకులు, పత్రికలు వ్యాఖ్యానించినప్పటికీ ప్రొ రేపిస్టు లాబీ ఒకటి మన దేశంలో ఉందని చెప్పడానికి ములాయం సింగ్ మాటలు నిదర్శనం. ములాయం అంతటితోనే ఆగకుండా 2012లో ఢిల్లీ నగరంలో నిర్భయ అత్యాచారానికి మరియు హత్యకు గురైన అనంతరం వచ్చిన కొత్త అత్యాచార చట్టాలను దుర్వినియోగం చేస్తూ తమ బాయ్ ఫ్రెండ్స్‌ను శిక్షించడానికి ఉపయోగిస్తున్నారని వ్యాఖ్యానించాడు. "వారి స్నేహం ముగిసిపోయినపుడు తాను అత్యాచారానికి




శక్తిమిల్ అత్యాచార నిందితులను శిక్షించాలని నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు, హక్కుల సంఘాలు

గురయ్యానని అమ్మాయి ఫిర్యాదు చేస్తుందని" మహిళలపై ఘోరమైన నిందారోపన చేశాడు. ములాయం సింగ్‌కు మహిళల పట్ల ఉన్న అభిప్రాయం ఇదైతే, ఆయన అనుయాయి అసిమ్ అజ్మీ మాత్రం మూలాయం కంటే రెండాకులు ఎక్కువ చదివినట్లున్నాడు. "ముంబాయ్ వార్త పత్రికతో మాట్లాడుతూ '*ఏ మహిళ అయినా సరే, వివాహిత అయినా కాకపోయినా, తన అనుమతి ఉన్నా లేకపోయినా, ఒక పురుషుడితో వెళితే గనుక ఆమెను ఉరి తీయాలి"* వ్యాఖ్యానించాడు. విచారించదగ్గ విషయం ఏమిటంటే ఇటువంటి ధోరణులు కేవలం సమాజ్ వాదీ పార్టీకి మాత్రమే పరిమితం కావు. స్కూల్ అమ్మాయిలు గౌనులు వేసుకుంటున్నందున వారిపై అత్యాచారాలు జరుగుతున్నాయని భావిస్తున్న రాజస్థాన్ శాసన సభ్యుడి నుండి అమ్మాయిలు తమను తాము ఓవర్ కోట్‌తో కప్పుకోవాలని కోరే పుదుచ్చేరి మంత్రి వరకూ అందరూ పురుషాధిపత్య భావజాలంతోనే ఈ రకమైన కామెంట్లు చేస్తున్నారు.

ఇవ్వాళ ఈ పురుషాధిక్య భావజాలం అనేది కేవలం పురుషులకు మాత్రమే పరిమితం అనుకుంటే పొరపాటే ఎందుకంటే ***"దేశంలో జరుగనున్న వరుస అత్యాచారాలకు కారణం స్త్రీలు, పురుషులు రాసుకుపూసుకు తిరగడమే కారణమంటూ"*** గతంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ ఆరోపించడాన్ని గమనించాయి. దేశ వ్యాప్తంగా గత సంవత్సరం 24,003 అత్యాచార సంఘటనలు జరిగితే వాటిలో మైనారిటీ తీరని పసిపిల్లలపై 7058 అత్యాచారాలు జరిగినట్లు ఆ లెక్కలు చెబుతున్నాయి. అంటే అత్యాచార బాధితుల్లో 30 శాతం మంది పసిపిల్లలు ఉంటున్నారు. ఇక మన రాష్ట్రంలో గత సంవత్సరం 1442 అత్యాచార సంఘటనలు జరిగినట్లు పోలీసు రికార్డులు చెబుతుంటే వాటిలో 646 మంది బాధితులు పసిపిల్లలు ఉన్నారు. అంటే మన రాష్ట్రంలో దాదాపు 44.7 శాతం అత్యాచారాలు బాలికలపై, చిన్న పిల్లలపై జరిగినట్లు తెలుస్తోంది. మమతా బెనర్జీ గారు పరిపాలిస్తున్న రాష్టంలో గత సంవత్సరం మొత్తం 2363 మందిపై అత్యాచార ఘటనలు జరిగితే వాటిలో మైనారిటీ తిరని 345 మంది పసిపిల్లలు వున్నారని జాతీయ నేర పరిశోధన విభాగం చెబుతుంది. మరి ఇంతమంది పసిపిల్లలు అత్యాచారానికి గురికావడానికి ఆ పిల్లలు ఎవరిని రాసుకుపూసుకు తిరిగారో ఆవిడే సెలవివ్వాలి ఒక మహిళ ముఖ్యమంత్రి స్థాయిలో వుండి మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు ఇలాంటి చౌకబారు కారణాలు చెప్పడం భావ్యం కాదు.




**ముంబాయి సిటీ సివిల్ కోర్టు ముందు మాట్లాడుతున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్**

దేశానికి దిశా నిర్దేశం చేయాల్సిన ప్రజాప్రతినిధుల మాటలు ఈ విధంగా ఉంటే ఇక సమాజంలో ఎక్కడా న్యాయం జరగని ఆబల చివరకు న్యాయాన్ని వెతుక్కుంటూ వెళ్లేది కోర్టు మెట్లు మాత్రమే, అక్కడ కూడా పురుషాధిక్య భావజాలం మహిళలను వెంటాడితే ఇక మహిళకు ఎక్కడ సమాధానం దొరుకుతుందనేది ప్రశ్నార్థంగా మారింది. శక్తిమిల్ అత్యాచార బాధితురాలి తరపున వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ కోర్టులో మహిళ తరపున మాట్లాడుతూ ***"అత్యాచారం అనేది మహిళ శరీరంపై దాడి మాత్రమే కాదు. ఆమె మనసు, శీలం, ప్రతిష్ట, ఆత్మగౌరవంలపై దాడి కూడా. బాధితురాలు చనిపోతే తప్ప ఆ గాయాలు మానిపోవు"*** అని వ్యాఖ్యానించాడు. అత్యాచారానికి గురయిన స్త్రీ చనిపోవడం తప్ప మరో మార్గం లేదని చెప్పే వాదన ఎంత ఘోరం. ఎంత లోపభూయిష్టం! స్త్రీల శీలం, పరువు ప్రతిష్టలు అత్యాచారం వల్ల పోతాయని చెప్పడం కంటే మించిన పితృస్వామిక ఆధిపత్య భావజాల వ్యక్తీకరణ మరోకటి ఉంటుందా? బాధితులకు తరపున వాదించాల్సిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, జడ్జీలు తమ నరనరాన పితృస్వామ్య భావాజాలం ఎంతగా నిండిపోతే ఇలాంటి వాఖ్యలు చేయగలరో అంచనా వేయవచ్చు. అత్యాచారం అనేది జీవితానికి తగిలిన ఒక బలమైన గాయం మాత్రమే. అంతమాత్రాన జీవితం అయిపోయినట్లు కాదు. పరువు ప్రతిష్టలు, శీలం పేరుతో ఆ గాయాన్ని పెద్దది చేసి బాధితురాలు కోలుకోకుండా చేసే ప్రతి ఒక్కటి ఆమె జీవితంపై పదే పదే జరిగే అత్యాచారాలు మాత్రమే. భూస్వామ్య, పితృస్వామ్య భావాలకు చెందిన ఈ మెదళ్లు మారితే తప్ప స్త్రీల మనసును అర్థం చేసుకోవడం సాధ్యం కాదు.

**– వ్యాసకర్త ఓయూలో చరిత్ర పరిశోధకులు**

# వీరప్పన్‌లాగే ప్రభాకరన్ కూడా!

- నరేష్ నందం



వీరప్పన్-ఎల్‌టిటిఇ నేత వేలుపిళ్లై ప్రభాకరన్

గత నెలలో నెల్లూరు దగ్గర  ఒక ఊరుకు వెళ్లాను. అక్కడ ఒకతను పరిచయమయ్యాడు. పేరు శ్రీనివాస దురై. వయసు 65-70. తమిళనాడులోని చెంగల్పట్టు దగ్గర ఓ పల్లెటూరు. ఇప్పుడు అతని పరిచయం ఎందుకంటే....అతను వీరప్పన్‌నీ, ప్రభాకరన్‌నీ చూశాడు, మాట్లాడాడు. వాళ్ల గురించి కొద్దిగా...మిగిలిన వాళ్లకి తెలియవనుకుంటున్న విషయాలు చెప్తానన్నాడు. “సరే” అని ఒక హోటల్‌లో కూర్చున్నాం.ఆ సందర్భంగా మా ఇద్దరి మధ్య జరిగిన సంభాషనతో కూడిన ఇంటర్వ్యూ ఇక్కడ.

**# మీకు మాత్రమే తెలిసిన ఆ విషయాలేంటో చెప్పండి?**

వీరప్పన్ చాలా మంచివాడబ్బా...తన వాళ్లకోసం చాలా చేశాడు.

**#  ఎవరైనా తన వాళ్లకోసమే కదండీ ఏం చేసినా...లేకపోతే వాళ్లేమైనా చనిపోయాక తీసుకుపోతారా? ఆ మాత్రం తెలుసులెండి ఎవరికైనా.**

అదికాదబ్బా...వీరప్పన్ చుట్టూ చాలా బలగం ఉండేది. తమిళనాడు - కర్నాటక మధ్యన అతని సామ్రాజ్యం. ఊటీ - మైసూరు మధ్యన అడవుల్లోని చెట్లన్నీ అతనికి పరిచయమే. ఎవడైనా అతని అనుమతి లేకుండా అటువైపు వెళ్లాడా...ఇక అంతే. ప్రాణాలమీద ఆశలొదులుకోవాల్సిందే!

**# అంటే చంపేస్తాడా?**

ఉత్తినే చంపడబ్బా...ముందు అనుమానంగా తిరిగేటోడ్ని ఆడ (అక్కడ) జనాలే పట్టుకుంటారు. సత్యమంగళం అడవుల్లో అతని మనుషులు చాలామందే ఉండారు. ముందు నువ్వెవరూ అంటారు. ఈడకెందుకొచ్చినవ్, ఎట్టొచ్చినవ్ అంటారు. ఆడు సరైన సమాధానం చెప్పాడా బతికిపోతాడు. ఆ వచ్చినోడు పోలీసోడా కాదని వాళ్లు నమ్మాల. నమ్మితే తిండి పెట్టి దారి చూపిస్తరు. లేకపోతే ఈడ్చుకుపోతరు.

**#  ఎక్కడికి?**

ఇంకెక్కడికి? వీరప్పన్ మనుషులు మురుగేశన్, సుబ్రమణిలాంటోళ్ల దగ్గరికి. ఆళ్లు కొట్టి, హింసించి అడుగుతరు. అప్పటికీ ఆడు నిజం చెప్పలేదో..సరాసరి పులినోట్లోకే. (నేను బ్లాంక్ ఫేస్ పెట్టాను)

వీరప్పన్ దగ్గరకబ్బా.. కళ్లకు గంతలు కట్టి ఎక్కడో అడవుల్లో 40–50 కిలోమీటర్లు నడిపిస్తరు. కావాలనే నడిపిస్తరు. కొండచుట్టూ పది సార్లు తిప్పుతరు. ఇక వాడి పని ఐపోతుంది అనుకున్నప్పుడు, వీరప్పన్ ముందు నిలబెడతరు. ఈలోపు రెండు రోజులు గడుస్తయి.

**# ఎందుకలా, కొండచుట్టూ తిప్పటం? అనవసరంగా వాడిని తిప్పటంతో బాటు వీళ్లకి కూడా కాళ్లనొప్పులు కదా?**

మరదే. ఆడి ఒంట్లో ఓపిక మొత్తం అయిపోవాల. నాలుక ఎండిపోవాల. పట్టపగలే చుక్కలు కనిపించాల. అప్పుడు కదా, వాడు ఎక్కడికీ తప్పించుకునే ఆలోచన చేయకుండా గమ్మునుండేది? ఆ 50 కిలోమీటర్లు పోయేలోగా వాళ్లు పట్టేసుకుంటారని అనుకుంటడు. పారిపోటానికి కూడా భయపడుతడు.

**# మరి వాళ్ల మనుషుల సంగతి?**

వాళ్లదేముండాదబ్బా, వంతులేసుకుని తిప్పుతరు. నలుగురు పోయిన తర్వాత ఇంకో నలుగురు వస్తారు. వాడ్ని మళ్లీ చుట్టూ తిప్పుతరు.

**# అలా తిప్పటం వలన వాళ్లకేంటి లాభం?**

డబ్బులబ్బా...నిండా దుడ్డు (డబ్బులు) ఇచ్చేదున్నప్పుడు వేరే పని ఏం చేస్తారు?

**# మరి వీరప్పన్ ఏం చేస్తాడు తర్వాత?**

వెళ్లగానే తాగటానికి నీళ్లిస్తడు. మర్యాదగా అడుగుతడు. అప్పటివరకు వీరప్పన్ రాక్షసుడని విన్నోడికి అలా మంచిగా కనిపించేసరికి భయం పోతుంది. మనసులో ధైర్యం వస్తుంది. వీరప్పన్ అంటే ఇంతేనా అనిపిస్తుంది. అదిగో అక్కడే నోరు జారతడు. ఎక్కువ వాగేస్తడు.

**# అంటే నిజం చెప్తాడా?**

అక్కడిదాకా వెళ్లాక వాడు నిజం చెప్పినా అంతే, చెప్పకపోయినా అంతే. చావే.

**# ఇప్పుడేగా మంచిగా ఉంటాడన్నావ్?**

అవునబ్బా, చావబోయేటోడ్కి గుక్కెడు మంచినీళ్లు పోస్తే పుణ్యమొస్తదని వాళ్లమ్మ చెప్పినాదంటలే. ఏదైనా చెప్పేది వీరప్పన్ ముందుకెల్టానికి ముందే చెప్పాల. ఒప్పుకోవాల. అక్కడికెల్లాక ఒకటే. చెప్పినదాన్నిబట్టీ, పద్దతి బట్టీ చావు రకం ఉంటుంది.

**# రకాలేంటి?**

ఎక్కువగా కాల్చి చంపుతరు. వాడు పొగరుగా మాట్లాడితే నరికి చంపుతరు. ఎక్కువ బాధ అనుభవించాలి కదా. శవాన్ని పూడ్చిపెట్టటమో, నదిలో విసిరేయటమో చేస్తారు.

**# ఇంత రాక్షసంగా ఉంటే మంచివాడంటావేం?**

అక్కడికే వస్తున్నానబ్బా, వీరప్పన్ ఏనుగు దంతాలు, గంధం చెట్లను కొట్టించీ సంపాదించింది ఎవరికోసం? అసలు వీరప్పన్‌కి ఎంత డబ్బు వస్తదో, ఎట్ల వస్తదో తెలుసునా?

**# ఎలా?**

బ్రోకర్లబ్బా. పావువంతు వీరప్పన్‌కిస్తే ముప్పావు వంతు వాళ్లే తిన్నరు. వాళ్లే బాగుపడ్డరు. వచ్చిన దాన్ని అందరికీ పంచిపెట్టేటోడు. బలగమా ఎక్కువ. సంపాదన తక్కువ. తనకంటే కుటుంబం లేకపోయే. చుట్టూ ఉన్నోనికి ఉంటుంది కదా. వాడు ఇంట్లో ఇచ్చుకోవాలకదా? అందరూ ముత్తు (వీరప్పన్ భార్య)లా ఉండరు కదా.

**# అంటే వీరప్పన్ ఏమీ దాచుకోలేదా?**

ఏముందబ్బా దాచుకోటానికి? పెళ్లామా...రానియ్యడు. పిల్లలేమో తండ్రిని చూసిన గుర్తేలేదు.

**# మరి అన్ని నేరాలెందుకు చేశాడంటావ్?**

చూడబ్బా. నిన్ను ఒక వేషంలో చూసినప్పుడు జనం భయపడ్డారనుకో, నీకు ఇష్టమున్నా లేకపోయినా అదే వేషం వేస్తావ్. నిన్ను చూసి జనం భయపడేటప్పుడే నీ చుట్టూ కొంతమంది మూగుతరు. ఆ వేషం నువ్వు తీయకుండా కాపలా కాస్తరు. వీరప్పన్ కూడా అంతే. జనంలో అతనంటే భయం పోతుందనుకున్నప్పుడు ఒకడ్ని చంపేటోడు. చుట్టూ ఉన్నోళ్లు వీరప్పన్ పేరు చెప్పి చంపేటోళ్లు

**# మరి కిడ్నాపులు?**

అవి కూడా జనంలో, పేపర్లలో ఉండేందుకే.

**# పేపరంటే గుర్తొచ్చింది. గోపాల్ (నక్కీరన్ పత్రిక) ఎలా కలిశాడు?**

ఎట్లా ఏముండాదబ్బా? మీరెట్లా కలుస్తారు. నక్సలైట్లనీ? అట్లే.

**# మరింకేం తెలుసు వీరప్పన్ గురించి?**

వీరప్పన్ అడవికి అడవి, అందులో చెట్లు, జంతువు అన్నీ పరిచయమే. ఏ మొక్క దేనికి పనికొస్తదో ఏ దిక్కున పోతే ఏమొస్తదో ఎంత దూరంలో వస్తదో అంతా తెలుసు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న వీరప్పన్ భార్య ముత్తులక్ష్మి

**# అడవిలో అన్నేళ్లు ఉంటే ఎవరికైనా తెలుస్తుందిలే.**

అట్లనమాక. వీరప్పన్ కనక అలా స్మగ్లింగూ, చంపటాలు చెయ్యకపోతే, ఒక పెద్ద సైంటిస్టు అయ్యేవాడు. ఎవరికి తెలియని కొన్ని మూలికలుండేవి తెలుసా? అవి కాచి టీ లాగే తాగితే ఎంత పెద్దనొప్పులైనా చిటికెలో పోతాయంటారు. అలాంటివే లేకపోతే అన్నాళ్లు ఆ అడవిలో ఎలా ఉండేవాడు?

**# నువ్వు చూశావా పెద్దాయనా?**

లేదు. కాకపోతే వీరప్పన్ ప్యాంటు జేబులో ఉంటాయంటారు. నేను చూసినప్పుడు మాత్రం జేబులు ఎత్తుగానే ఉన్నాయి మరి.

**# డబ్బుల సంగతి?**

అమాయకుడిలా ఉన్నావే? అడవిలో డబ్బులెందుకు?

**# అంతేలే...మరి రాజ్‌కుమార్‌ని కిడ్నాప్ చేశాడు కదా? ఎందుకు?**

ఎందుకేంటి? అప్పుడు తమిళనాడు, కర్నాటకలో అతనిమీద ఒత్తిడి పెరిగింది. జనమా, పోలీసులకి భయపడుతున్నారు. తిండికి కూడా కష్టమవుతోంది. ఏం చేస్తాడు? సూపర్‌స్టార్‌ని కిడ్నాప్ చేశాడు. రాజ్‌కుమార్ అతని దగ్గరున్నప్పుడు పోలీసులు వెనక్కు వెళ్లారు. డబ్బు తీసుకుని చనిపోయిన తన మనుషుల ఇళ్లలో ఇచ్చాడు.

**# వీరప్పన్ డబ్బుని అడవిలో దాచిపెట్టాడంటారు కదా?**


అతనికి అంత డబ్బెక్కడిదబ్బా? వచ్చేదే తక్కువ. వచ్చినదాంట్లో కూడా పంచేదెక్కువ. ఐనా వీరప్పన్‌కి తెలుసబ్బా తననెప్పుడో కుక్కలా కాల్చి చంపేస్తారని. కాకపోతే తనతో పాటు పోలీసులను కూడా పైకి తీసుకెళ్లాలని అనుకునేవాడు.

**# మరైతే వీరప్పన్ ఎన్‌కౌంటర్ నిజమేనని నమ్ముతావా నువ్వు?**

మనదేశంలో జరిగిన అన్ని ఎన్‌కౌంటర్‌లో అన్ని నిజమంటే నువ్వేం చెప్తావ్?...నువ్వు నమ్మిన, నమ్మకపోయినా ఒప్పుకోవాల అంతే.

**# మరీ. ప్రభాకరన్ గురించి ఏం తెలుసు నీకు?**

ప్రభాకరన్ కూడా వీరప్పన్ లాంటోడేనబ్బా. నమ్మినోడ్ని మోసం చేయలా. మోసం చేసినోడ్ని విడిచిపెట్టలా.



**వీరప్పన్–కన్నడ సూపర్‌స్టార్ రాజ్‌కుమార్**

**# అంటే?**

అంటే ఏముండాది? చిన్నప్పట్నుంచి మావోళ్ల (తమిళుల) మీద జరిగిన దాడులు చూస్తావుండాడు. ఏదో ఒకనాటికి లంకోళ్లకి బుద్ధి చెప్పాలనుకున్నాడు. తోడువచ్చినోళ్లతో కలిసి పోరాటం చేశాడు.

**# ప్రభాకరన్‌ని చాలా మంది తమిళులు నమ్మారు. ఆశ్రయమిచ్చారు. కాని. చివరికి వాళ్లకేం మిగిలింది?**

చూడబ్బా. యుద్ధమంటే మాటలనుకుంటాండావా? అదేదో కిరికెట్ మ్యాచ్ టీవీలో చూడటమనుకుంటన్నావా? యుద్ధమంటే ఒకటేనబ్బా, చంపటం లేదా చావటం. అదీ చుట్టూ వాళ్లునప్పుడు మాట కోసం నిలబడాల. లొంగిపోయావా, ఇక నువ్వు బతికినా చచ్చినట్లే. ఆ బతుకు కన్నా చావటమే మేలు.

**# అంటే?**

ఏందబ్బా...అంటే అనేది ఊతపదమా ఏంది నీకు? ప్రతీది తెలియదంటాండావే?

**# అది కాదు. అసలెందుకు చేశాడంత యుద్ధం ప్రభాకరన్?**

ప్రభాకరన్ చిన్నప్పుడే తుపాకీ పట్టాడు. తమిళోళ్లని ఏడిపించుకుతినేటోళ్లమీద యుద్ధం మొదలెట్టాడు. తనతో నలుగురిని కలుపుకున్నాడు. సుమారు నలభై ఏళ్లు పోరాడాడు.

**# ఎవరికీ లేనిది ప్రభాకరన్‌కి ఎందుకు ఇంత కోపం?**

నీదే ఊరబ్బా?

**# తెనాలి. అసలైతే అమరావతి పక్కన. నా చిన్నప్పుడు తెనాలి వచ్చాం.**

సరే, నీపక్కింటోడు వచ్చి నీదీ ఊరు కాదు కదా. నీకు తాగటానికి నీళ్లియం, తినటానికి గింజలివ్వమంటే ఏం చేస్తావు?

**# వాళ్లిచ్చేదేముంది?**

అదేనబ్బా...నీకు ఏదీ అమ్మనీకుండా, వాళ్లు చెప్పినట్లుంటేనే బతకనిస్తాం అంటే?

**# నేనెందుకు ఒప్పుకోవాలి?**

ఏం ఎందుకొప్పుకోవు?

**# నన్ను వెళ్లిపొమ్మనటానికి వాళ్లకేమీ హక్కు లేదు కదా?**

నినొక్కడ్ని అంటేనే నువ్వు ఊరుకోలేకపోతున్నావే. లంకనుండి కొన్ని లక్షలమందిని వెళ్లిపొమన్నారబ్బా. కొంత మంది తిరగబడ్డారు. చంపారు. ఇంకొంత మంది ముఠా కట్టి ఎదురు దాడులు చేశారు. పట్టుకుని కాల్చి చంపారు. అప్పుడే కుర్రాళ్లకి కోపమొచ్చింది. పథకం ప్రకారం దాడులు మొదలుపెట్టారు.

**# అసలెందుకిదంతా?**

లంకలో ఉన్న అరవోళ్లంతా(తమిళులు) ఒకప్పుడు ఇక్కడోళ్లే. కూలీకి తీసుకెళ్లారంటెప్పుడో. అక్కడ లంకోళ్లు పెట్టే బాధలు పడలేక అరవోళ్లు తిరుగుబాటు చేశారు. అప్పుడే ప్రభాకరన్ తుపాకి పట్టుకున్నాడు.

(ఎల్‌టీటీఈ పుట్టుక, కారణాల గురించి, రాజీవ్‌గాంధీ హత్య కేసు దర్యాప్తు చేసిన శ్రీ.కార్తికేయన్ గారు, తన పుస్తకం – "నిప్పులాంటి నిజం"లో రాసారు.....అందులోంచి సంగ్రహిస్తే)

1815ల లంకలోని టీ, కాఫీ ఎస్టేట్లలో పని చేసేందుకు కూలీల కోసం బ్రిటిష్ ప్రభుత్వం ఇక్కడ్నుంచి మనుషులని తరలించింది. కొన్ని వేలమంది అలా ఇక్కడ్నుంచి బలవంతగా కాని, ఇష్టపడి కాని శ్రీలంక వెళ్లారు. అక్కడ వారికి ఎస్టేట్లలో కొంత భూమి ఉండటానికి ఇచ్చి కూలీ చేయించుకునేవాళ్లు. వందల సంవత్సరాలు అక్కడే ఉన్నా వాళ్లంతా ద్వితీయ శ్రేణి పౌరులుగానే మిగిలిపోయారు. అక్కడే పుట్టిన తర్వాతి తరం వాళ్లుకూడా వివక్షనెదుర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక కూడా వాళ్ల పరిస్థితి మారలేదు. అప్పటికి శ్రీలంకలో ఉన్న తమిళులు పది లక్షలమందికి పైనే. తమిళులు ఎక్కువగా ఉన్న తూర్పు, ఉత్తర ప్రాంతాల్లో భూములు వ్యవసాయానికి ఎక్కువగా పనికొచ్చేవి కాకపోవటంతో, వారు చదువుకి ప్రాధాన్యతనిచ్చారు. బ్రిటిషువారితో వచ్చిన మిషనరీలు ఇంగ్లీషు విద్యనందించాయి. పాలనా సౌలభ్యం కోసం బ్రిటీషువారు ఈ తమిళులని సింహళీయుల ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా డాక్టర్లుగా, ఇంజనీర్లుగా ఇతర ఆఫీసర్లుగా నియమించారు. ఇది శ్రీలంకలోని ప్రథమ పౌరులుగా చెప్పుకుంటున్న వారికి కోపం తెప్పించింది. దీనితో తమిళులలో సంఘీభావం పెరిగింది. 1947లో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో వారు ఏడుగురు సభ్యులని పార్లమెంటుకి పంపారు. ఈ సంఘటనతో సింహళీయులు మరింత జాగ్రత్త పడదామనుకున్నారు. మెజారిటీ సభ్యులు వాళ్లే కనుక 1948 – పౌరసత్వ చట్టం, 1949 – పార్లమెంటరీ ఎన్నికల చట్టం తీసుకువచ్చారు. ఫలితంగా టీ తోటల్లోని తమిళ కార్మికులంతా ఓటు హక్కు కోల్పోయారు. తమకంటూ ఒక్క రాష్ట్రం కూడా లేకుండా మిగిలిపోయారు. ప్రధానమంత్రి సేనా నాయకే తమిళ ప్రాంతాల్లో సింహళీయుల జనాభా పెరిగేందుకు, నీటి పథకాలతో కృషి చేశాడు. దీనితో తూర్పు ఉత్తర ప్రాంతాల్లో ఇరవై ఏళ్లలో సింహళీయుల జనాభా పదిరెట్లు పెరిగింది. ఇది అక్కడి జనాభా నిష్పత్తిని తీవ్రంగా ప్రభావితం చేసింది. దీనితో చరిత్ర పునరావృతమవుతుందేమో అని తమిళులు భయపడ్డారు. క్రీ.పూ. 101లో తమిళ రాజు ఎలారాను ఓడించిన సింహళరాజు దుత్తగామి కాలం మళ్లీ వస్తుందేమో అని వారు భావించారు. (అంటే లంకలో తమిళులు ఎప్పుడో ఉన్నారన్న మాట). 1956లో సింహళం శ్రీలంక అధికారిక భాషగా, బౌద్ధమతం జాతీయ మత విధానంగా ఆమోదింపబడినవి. సింహళీయులకి, తమిళులకి మధ్య జరిగిన ఘర్షణలతో, తమిళులు కొలంబో వదిలేసి జాఫ్నా వెళ్లిపోయారు. 1961లో వచ్చిన శ్రీలంక కొత్త రాజ్యాంగం శ్రీలంక గణతంత్ర రాజ్యంగా, సింహళం అధికార భాషగా, బౌద్ధం ప్రధాన మతంగా ప్రకటించింది. దీనితో సింహళీయుల ఆధిపత్యం ఒక్కసారిగా పెరిగింది. తమిళులు నేర్చుకున్న ఇంగ్లీషు కంటే సింహళానికే ప్రాధాన్యత పెరిగి తమిళ ఉద్యోగులు, విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. దీనితో తమ సమస్యల పరిష్కారం కోసం తమిళులు విభిన్న పంథాను ఎన్నుకున్నారు. అదే తీవ్రవాద పోరాటం. 1972లో తంగదురై, కుట్టిమణిల సారథ్యంలో ఏర్పడిన సంస్థ, తర్వాత 'తమిళ ఈలం లిబరేషన్ ఆర్గనైజేషన్ – 'టీఆర్ఎల్ఓ"గా మారింది. 1972లో "తమిళ న్యూ టైగర్స్" ని వేలుపిళ్లై ప్రభాకరన్ స్థాపించాడు. అప్పటికి అతనికి పద్దెనిమిదేళ్లు. 1975 జులై 27న జాఫ్నా మేయర్–ఆల్ఫ్రేడ్ దురైయప్పను ప్రభాకరన్ కాల్చి చంపాడు. తమిళుల హీరో అయ్యాడు. 1976 మే 5న ప్రభాకరన్ తన "టిఎన్‌టి"ని లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం (ఎల్‌టీటీఇ)గా మార్చాడు. తమిళ స్వరాజ్యమే తన ఏకైక లక్ష్యంగా ప్రకటించాడు)

**# సరే అదంతా తెలిసిన విషయమే కదా?**

అక్కడికే వస్తుండానబ్బా. వీరప్పన్‌లాగే ప్రభాకరన్ కూడా తన కోసం కన్నా తనను నమ్ముకున్న మనుషులకోసమే ఎక్కువ కష్టపడ్డాడు. అలాగే తనకెదురొచ్చిన ఎవరినైనా అడ్డుతొలగించుకున్నాడు.

**# కానీ ప్రభాకరన్ ఒక లక్ష్యం కోసం పోరాడాడు కదా? వీరప్పన్ అలా కాదు. అందరినీ బెదిరించి, దోపిడీ చేశాడు.**

అవునబ్బా..వీరప్పన్ దోపిడీ చేశాడు. కాదనటంలేదు. ఐతే ప్రభాకరన్ కూడా తన మనుషులకోసం దాడులు చేశాడు. ఆయుధాలు, డబ్బు దోచుకున్నాడు. అలాగే వీరప్పన్ కూడా తనని నమ్ముకున్న వాళ్లకి ఎంతో డబ్బు సాయం చేశాడు. ఎంతో మందికి పెళ్లిళ్లు చేశాడు. ఒకరకంగా చెప్పాలంటే వీరప్పన్ వల్ల తన చుట్టూ ఉన్న వాళ్లు బాగు పడ్డారు. ప్రభాకరన్ వల్ల అంతా నాశనం అయ్యారు.

**# ప్రభాకరన్ పోరాటయోధుడు, వీరప్పనేమో దోపిడీదారు. అసలు వీళ్లిద్దరినీ నువ్వెలా కలిశావ్? ఎప్పుడు కలిశావ్?**

వీరప్పన్ భార్య ముత్తులక్ష్మి అతన్ని ప్రేమించి పెళ్లిచేసుకుందబ్బా. ముత్తు లక్ష్మి నాన్న నాకు దూరపు బంధువు. వాళ్ల ఊరికి అప్పుడప్పుడు వచ్చిపోతుండేవాడు. అలా కలిసేవాణ్ణి. 1985 తర్వాత నేను శ్రీలంక వెళ్లాను. అక్కడ పనిచేయటానికి. మాంకులం (ముల్లైతీవు నుండి 100 కి.మీ. ఉంటుందేమో, నాకు గూగుల్ మ్యాప్‌లో కనిపించింది తర్వాత వెదికితే) దగ్గర ఒక పల్లెటూళ్లో నూనె ఫ్యాక్టరీలో ఐదేళ్లు పైనే పనిచేశాను. ప్రభాకరన్ రాజ్యమే అదంతా. అతనేది చెబితే అదే జరుగుతుంది అక్కడ. రాజీవ్ గాంధీని వాళ్లు చంపేశాక అక్కడి పరిస్థితులు బాగోలేదు. ఇండియా నుండి వచ్చిన వాళ్లు చాలా

మందే ఉన్నారప్పుడక్కడ. టైగర్ల గురించి చెప్పమని మిలటరీ వాళ్లు వేధించేవాళ్లు. ఇక ఉండలేక ఆరుగురం వచ్చేశాం అక్కడినుండి. అది ప్రభాకరన్ ప్రాంతమవటంతో అప్పుడప్పుడు జనాల్లోకి వచ్చేవాడు. తమిళ రాజ్యం రావాలంటే త్యాగాలు తప్పవనేవాడు. ఒక్కో ఇంటి నుంచి ఒక్కళ్లని తనతో పంపమని అడిగేవాడు. ఇండియా నుండి వచ్చిన సైనికులంటే మాత్రం అసహించుకునేవాడు. వాళ్ల వల్ల అమాయకులు బలవుతున్నారని అనేవాడు. పనిచేసుకోటానికి వచ్చిన వాళ్లని మాత్రం ఇబ్బంది పెట్టద్దనేవాడు. వాళ్లు ఇక్కడ బాగుంటేనే ఇండియాలో సహాయం చేస్తారని చెప్పేవాడు. కనీసం పదిసార్లు చూశాను నేను ప్రభాకరన్‌ని.

**# అంత ఈజీగా ప్రభాకరన్ దగ్గరకు వెళ్లే అవకాశం ఉంటే ఎప్పుడో చంపే వాళ్లు కదా?**

అదేమీ అంత ఈజీ కాదు. మేము పని కోసమే వెళ్లినా మా బాధ్యతంతా మా ఓనర్‌ల మీద ఉండేది. పూర్తిగా నమ్మకమైన వాళ్లనీ, అది కూడా అరవోళ్లని మాత్రం తెచ్చుకోమనే వాడు. పనోళ్లు తప్పు చేస్తే ఓనర్‌లను చంపేసేవాడు. అందుకే అంత త్వరగా ఎవరిని దగ్గరికి రానిచ్చేవారు కాదు.

**# మరి నువ్వెలా వెళ్లావ్?**

అదే చెబుతుండా...మా ఓనరు పేరుకే ఓనరు. ఆ మిల్లు ప్రభాకరన్ డబ్బులతో నడుస్తుండాదనేవారు. వాళ్లు అక్కడిక వస్తే మా మిల్లులోనే మీటింగు పెట్టేవాళ్లు. ఒకసారి నీళ్లు కావాలంటే మా ఓనరు నన్ను పంపాడు సీసా ఇచ్చి. అతని పక్కనున్నోళ్లు నన్ను తాగమన్నారు ముందు. అంత జాగ్రత్త. ఇక్కడేపని చేస్తావని అడిగాడు నన్ను. తమిళనాడులో ఎక్కడ నీ ఊరని అడిగాడు. తమిళ రాజ్యం వస్తే ఇక్కడికొచ్చేస్తారా అని అడిగాడు.

**# ఏమని చెప్పావ్ మరీ?**

రానని చెప్పా. అది నేను పుట్టిన ఊరని చెప్పా. నవ్వాడు. మరి ఇప్పుడెందుకొచ్చావ్? అని అడిగాడు. బతకటానికని చెప్పా. అంతా ఇక్కడ చంపుతున్నారని అనుకుంటుంటే నువ్వు బతకటానికొచ్చావా? అని అడిగాడు. బతికే ఉన్నాను కదా ఇప్పుడని నవ్వానునేను కూడా. తర్వాత మా ఓనరు తిట్టాడు నన్ను అలా మాట్లాడానని.

**# మిగతా వాళ్లకి తెలియని విషయాలేంటి మరి?**

ప్రభాకరన్ ఏదుంటే అది తినేస్తాడు. ఉన్నప్పుడు బాగా తింటాడు. పాటలు పాడతాడు. రేడియో వింటాడు. పెళ్లాం పిల్లలంటే ప్రేమ ఉండేది బాగా. తన జీవితం గురించి తెలిసి కూడా తనని పెళ్లిచేసుకుందని పెళ్లాన్ని బాగా చూసుకునేవాడు. తను చనిపోయినా పెళ్లాం పిల్లలు బాగుండాలని కోరేవాడు.

**# ప్రభాకరన్ మంచోడా? లేక వీరప్పన్ మంచోడా?**

ఇద్దరూ ఇద్దరేనబ్బా...అనుకున్న దానికోసం ప్రాణాలిస్తామన్నారు. అలాగే పోయారు. ఈలోకంలో ఎవడూ మంచోడు కాదబ్బా అందరికీ మంచిగా కనిపించటం కూడా కుదరదు.



కుటుంబ సభ్యులతో ప్రభాకరన్

**# ఇద్దరిలో ఏం పోలికలు చూశారు మీరు?**

ప్రభాకరన్, వీరప్పన్ ఇద్దరూ తమ చుట్టూ ఉన్న వాళ్లకోసమే కదా ఏం చేసినా? ఇద్దరూ మంచి గురిగాళ్లు. శతృవుని చంపేటప్పుడు క్రూరంగా చంపేవోళ్లు. అలా ఐనా తమకోసం వచ్చేవాళ్లు భయపడి వెనక్కి తగ్గుతారని వీరప్పన్ అనేవాడు. వాడు రావటం ఎందుకు? నా చేతిలో చావటం ఎందుకని అనేవాడు. ఇద్దరూ డబ్బుని పక్కన వాళ్లకోసమే ఖర్చు చేశారు. ప్రభాకరన్ వ్యాపారాలు చేశాడంటారు, మరదేమయిందో కాని, వీరప్పన్ ఏమీ మిగుల్చుకోలేదనుకుంటా. ఇద్దరూ పెళ్లాం, పిల్లలకు దూరంగా ఎక్కువ కాలం గడిపారు కదా? కాని ఇద్దరి పెళ్లాలూ, వాళ్ల గురించి తెలిసే ఇష్టపడి చేసుకున్నారు. ఇద్దరూ కూడా ఎన్‌కౌంటర్లోనే చనిపోయారు కదా.

**# నేను చాలా టైం తీసుకున్నాను పెద్దాయనా, వాళ్లిద్దరికీ డూపులున్నారని అనేవాళ్లు కదా. ఎంతవరకూ నిజం?**

ఏరబ్బా...డూపులు? వాళ్లు చచ్చి ఇన్నాళ్లయింది కదా? మీ వాళ్లు ఊరికే వదులుతారా? ఈ పాటికి ఒక్కడ్నైనా లాగి జనాలకి చూపందే ఊరుకుంటారా?

**# సరే...మరి వీళ్ల ఎన్‌కౌంటర్లు నిజమేనంటావా?**

ఒకటబ్బా...వాళ్లైనా, పోలీసులైనా మనుషులే కదా?...వాళ్లకి దొరికినోళ్లని హింసించి చంపారు కదా? పోలీసులు మాత్రం ఊరుకుంటారా? నేనైతే అంతే చేస్తానబ్బా. ఐనా అది జరిగినప్పుడు నువ్వూ, నేను దగ్గర లేము కదా? మనకెందుకు ఆ గొడవ?

★ ఇక్కడ ఒక విషయం నేను చెప్పాలి. శ్రీనివాస దురై ఎంత వరకు నిజాలు చెప్పారన్నది నేను విశ్లేషించలేను. కనుక ఈ విషయాలన్నీ నిజమేనని నేను ఎవరికీ ఎంత మాత్రం హామీ ఇవ్వటం లేదు. కొన్నింటిని నాకు తెలిసిన అదనపు విషయాలను మాత్రం జోడించాను. అనుకోకుండా కలిసిన వ్యక్తితో ఒక చిన్న టీ హోటల్‌లో జరిగిన ఈ సంభాషణకు నా దగ్గర ఎటువంటి రికార్డులు కూడా లేవు, పేర్లు సంవత్సరాలు, రాసుకున్న చిన్న కాగితం తప్ప.

– రచయిత సీనియర్ జర్నలిస్ట్

# 'కమ్మ' సామాజిక వర్గ ఆధిపత్యం రాష్ట్రాల సరిహద్దులు

– దలేల్ బెన్ బబాలీ

దలేల్ బెన్ బబాలీ సామాజిక భౌగోళిక శాస్త్రాలలో యూనివర్సిటీ ఆఫ్ ప్యారిస్ నుంచి పిహెచ్‌డీ పూర్తిచేసింది. ప్రస్తుతం ఆమె లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్ నుంచి ఆంథ్రోపాలజీ సబ్జెక్ట్‌లో పోస్ట్ డాక్టరేట్ చేస్తున్న దలేల్, భారతదేశంలోని పేదరికం, అసమానత్వంపై లోతైన పరిశోధన చేస్తుంది. ఇందులో భాగంగా, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఒక ప్రధాన సామాజిక వర్గమైన కమ్మ కులంపై ఒక పుస్తకం రాసింది. ఇందులో ఆమె "కమ్మ సామాజిక వర్గ ఆధిపత్యం – రాష్ట్రాల సరిహద్దులు" అనే అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది కమ్మ సామాజిక వర్గం తన అధిపత్యాన్ని నిలుపుకునేందుకు అవలంభించిన విధానాలతోపాటు ఆసక్తికరమైన అనేక అంశాలు ఆమె అందులో వివరించింది. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో కమ్మ సామాజిక వర్గం తెలంగాణకు అడుగడున ఎందుకు అడ్డుపడిందో, దానికి కారణాలేంటో క్షేత్ర స్థాయిలో పరిశోధించి వివరించడం జరిగింది. ప్రస్తుతం రాష్ట్రం విడిపోయిన నేపథ్యంలో కమ్మ సామాజిక వర్గం ఆధిపత్యం – రాష్ట్ర విభజన అనే అంశంపై నవంబర్ 7, 2013 ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో ఇచ్చిన ఉపన్యాసాన్ని పాఠకులకు ఉపయోగార్థం ప్రచురిస్తున్నాము – ఎడిటర్.

దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్‌లో "కమ్మ సామాజిక వర్గ ఆధిపత్యం – రాష్ట్రాల సరిహద్దులు". నేను ఎంచుకున్న సబ్జెక్ట్ సామాజిక, భౌగోళిక శాస్త్రం కనుక సామాజిక అంశంపై లోతుగా విశ్లేషించడం జరిగింది. భౌగోళిక సరిహద్దులపై అనేక పుస్తకాలు వెలువడినా అందులో సరిహద్దులు అనే అంశం సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలతో ముడిపడి ఉందన్న వాఖ్యం ఎక్కడా కనిపించదు. ఒక సామాజిక వర్గ ఆధిపత్యం సరిహద్దుల నియంత్రణతో పోల్చకుండా అర్థం చేసుకోలేదన్నది నావాదన. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సామాజిక అంశంతో ముడిపడి ఉందన్నది నా వాదనకు దగ్గరగా ఉంది. కమ్మ సామాజిక వర్గం కోస్తా ప్రాంతాల్లో బలంగా ఉండగా, రెడ్డి సామాజిక వర్గం రాయలసీమ, తెలంగాణ ప్రాంతంలో బలంగా కనబడుతుంది. 1956లో రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఈ రెండు సామాజిక వర్గాలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను శాసిస్తున్నాయి. అంతకుముందు భాషా ప్రయుక్త రాష్ట్రం కావాలని ఇరువర్గాల వాళ్లు పోరాటాలు చేశారు. అయితే ఈ సామాజిక వర్గాలు అప్పుడే పుట్టినవి కావు. పురాణాలలోని నాలుగు వర్ణాల నుంచి పుట్టుకొచ్చాయి. కమ్మ వర్గం, రెడ్డి వర్గం రెండూ ధనిక వర్గమే. కోస్తా ప్రాంతంలోని కృష్ణ, గోదావరి బేసిన్లలో మంచి వ్యవసాయ భూములున్నాయి. ఆ భూములమీదనే కమ్మ సామాజిక వర్గం ఆధారపడి ఎక్కువగా సంపాదిస్తోంది. రెడ్డి వర్గం దక్కన్ పీఠభూముల్నే నమ్ముకొనుంది. కమ్మ సామాజిక వర్గం ఆర్థికంగా బలంగా ఉన్నప్పటికీ రాజకీయంగా మాత్రం రెడ్డి సామాజిక వర్గం కంటే వెనుకే ఉన్నారని చెప్పవచ్చు. ఇందుకు కారణం కూడా ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ సహాయంతో రెడ్లు రాష్ట్రంపై ఆధిపత్యం సాగిస్తూ వచ్చారు.

సినీనటుడు ఎన్టీ రామారావు తెలుగు దేశం పార్టీని ఏర్పాటు చేసి మొదటి కమ్మ ముఖ్యమంత్రిగా 1983లో గద్దెనెక్కాడు. ఆ తర్వాత ఆయన అల్లుడు నారా చంద్రబాబునాయుడు సి.ఎం పీఠాన్ని ఆధిష్టించాడు. కమ్మ సామాజిక వర్గం ఎక్కువగా వలసలు వెళ్లి అక్కడ సినిమాలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా, రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలైనవి చేసి పైకి వచ్చారు. కొంతమంది పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటకలకు వెళ్లి వ్యాపారాలు చేస్తూ స్థిరపడితే, ఇంకోంతమంది విదేశాల్లో కూడా స్థిరపడ్డారు. అమెరికాలోని కాలిఫోర్నియా, న్యూ జెర్సీలలో స్థిర పడినవారిలో అత్యధికంగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారు. అక్కడి ఐటి పరిశ్రమల్లో పనిచేస్తూ, వ్యాపారాలు చేస్తూ సెటిలయ్యారు.


అమెరికాలో అక్కినేని నాగేశ్వరరావును అభినందిస్తున్న తానా సభ్యులు

ఆమెరికాలో స్థిరపడ్డ కమ్మ సంఘం వారు తెలుగు అసోషియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా)ను ఏర్పాటు చేసుకోగా, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు అమెరికా తెలుగు అసోషియేషన్ (ఆటా)ను ఏర్పాటు చేసుకున్నారు. దీన్ని బట్టి చూస్తే ఆంధ్ర ప్రదేశ్ చెందిన ఇరు వర్గాల వాళ్లు ఆమెరికాలో ఉన్నట్లు మనం గమనించవచ్చు.

కమ్మ సామాజిక వర్గం ఆధిపత్యం సాగిస్తున్న ప్రాంతాల్లో వలసలను అడ్డుకునేందుకు ఎలాంటి చర్యలను తీసుకోవాలో అనేదానిపై నేను పరిశోధన చేసాను. అయితే 1950లో డా॥శ్రీనివాస్ అనే వ్యక్తి చేసిన పరిశోధనపై మరింత విశ్లేషణ ఇచ్చే ప్రయత్నం చేశాను. శ్రీనివాస్ గారు తన పరిశోధనను గ్రామ స్థాయిలో చేస్తే. నేను దాన్ని సమకాలిన భారతదేశ చరిత్రలో, ప్రస్తుతం నెలకొన్న పట్టణీకరణ, ఆర్థిక రాజకీయ కోణాల్లో సామాజిక వర్గం ఎలాంటి పాత్ర పోషిస్తుంది అన్న అంశంపై కృషి చేశాను. శ్రీనివాస్ గారి ప్రకారం ***"ఒక సామాజిక వర్గం బలీయమైనదిగా ఎదగాలంటే స్థానికంగా ఉన్న భూములకు అధిపతైై ఉండటంతో పాటు అక్కడి స్థానికులు ఆ వర్గానికి అండగా నిలవాలి. సమాజంలో ఉన్నత స్థాయిని అందుకోగలగాలి"***. ఆంధ్రప్రదేశ్ మొత్తం మీద ఒక్క కృష్ణ డెల్టాలోనే అత్యధిక వ్యవసాయ భూములను 20 శాతం కమ్మ సామాజిక వర్గీయులు సొంతం చేసుకున్నారు. జనాభా పరంగా తక్కువే ఉన్నా, వారికున్న భూములే ఆర్థికంగానూ, సామాజికంగానూ, రాజకీయంగానూ ఉన్నత స్థానం కల్పించాయి. మరోవైపు 1983లో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత కమ్మ సామాజిక వర్గాన్ని మరింత బలపడేలా చేసింది. ఈ బలమే తెలుగు మీడియా, సినిమా రంగాల్లో వారు ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు తోడ్పడింది. అయితే ఈ అధిపత్యాన్ని కొన్ని వెనుకబడిన సామాజిక వర్గాలు సవాలు చేశాయి. వెనుకబడిన వర్గాలను అణిచివేస్తున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. తెలంగాణ కోరుకుంటున్న వారు కూడా కమ్మ సామాజిక వర్గాన్ని వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్‌పై రగడ మొదలైంది. తాము సంవత్సరాలుగా ఏర్పరచుకున్న ఆస్తులకు రాష్ట్ర విభజనతో నష్టం వాటిల్లుతుందేమోనని కమ్మ సామాజిక వర్గంలో ఆందోళన మొదలైంది.

**కమ్మ సామాజిక వర్గ చరిత్ర:**

కమ్మ సామాజిక వర్గం భౌద్ద మతంతో అవినాభావ సంబంధం కలిగి ఉంది. మూడవ శతాబ్దంలో కృష్ణా లోయలో భౌద్ధ మతం ఎంతో ప్రభావం చూపింది. భౌగోళికంగా మూడవ శతాబ్దంలో కృష్ణ డెల్టాను కమ్మనాడు అని పిలిచేవారు. వ్యవసాయం మీదే ఒక వర్గం ఆధారపడి జీవనం సాగిస్తుండటంతో ఆ వర్గానికి 'కమ్మ' అనే పేరు వచ్చింది. అయిదే పదవ శతాబ్దం తరువాతే హిందూ వ్యవసాయ సామాజిక వర్గంగా కమ్మ సామాజిక వర్గం గుర్తింపులోకి వచ్చింది. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు ముఖ్యంగా చిన్న చిన్న రైతులు కాకతీయ సామ్రాజ్యంలో సైనికులుగా కూడా పనిచేశారు. అయితే కమ్మ సామాజిక వర్గం ఎక్కడినుంచి పుట్టిందో కనుక్కునేందుకు అదే సామాజిక వర్గానికి చెందిన చరిత్ర కారుడు కె.బి చౌదరి ప్రయత్నం చేశారు. కమ్మ సామాజిక వర్గం కాకతీయ వంశానికి చెందిన వారిని వివాహమాడారని ఆయన తన పుస్తకంలో పేర్కొన్నారు. కమ్మ సామాజిక వర్గం వారు వ్యవసాయ వర్గానికి చెందిన వారైనా సమాజంలో క్షత్రియులుగా పరిగణించబడుతున్నారని కె.బి. చౌదరి పేర్కొన్నారు. అయితే విజయనగర సామ్రాజ్యంలో కమ్మ వర్గానికి చెందిన వారు సైన్యాధిపతులుగా తమిళనాడుపై యుద్ధానికి దిగి తమిళనాడును వశపరుచుకున్నారు. అప్పట్లో యుద్ధాల్లో ఓడిపోయినవారు రాజ్యాలను కోల్పోవాల్సి ఉండటంతో కమ్మ వర్గీయులు తమిళనాడులోనే సెటిలయ్యారు. అక్కడ వ్యవసాయ వృత్తిని కొనసాగించిన కమ్మ సెటిలర్స్ అడవిలోని చెట్లను తొలగించేందుకు తెలుగు మాట్లాడే నిమ్న వర్గానికి చెందిన మనుషులను తెచ్చుకున్నారు. వారినే తమిళనాడులో "సెకిలీయులు" అని పిలుస్తారు. దానితోపాటు దక్కన్ భూములను కూడా కొంత అక్రమించుకున్నారు. ఆ ఆక్రమణే గిరిజనులకు వీరికి మధ్య గొడవకు దారితీసింది. ఆ సమయంలో తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలిస్తున్న ముస్లింలు పన్నులను ఆక్కడున్న ఆధిపత్య సామాజిక వర్గం ద్వారా సేకరించేవారు. వారే చౌదరిలుగా పిలవబడ్డారు. ముస్లిం కింద పనిచేసే చౌదరిలు ఒక ఉన్నత స్థానానికి చేరుకోగలిగితే అదే సామాజిక వర్గానికి చెందిన వారు కోస్తాంధ్రలో 'కమ్మ' సామాజిక వర్గంగా పిలువబడుతూ భూస్వాములయ్యారు. 19వ శతాబ్దంలో బ్రిటీషర్లు కోస్తాంధ్ర ప్రాంతంలో ఎన్నో డ్యాంలు

కట్టడంతో ఆ ప్రాంతం ఎంతో అభివృద్ధికి నోచుకుంది. దీంతో చెరకు, వరి పంటలు పండించి ధనవంతులయ్యారు. ఈ క్రమంలోనే దక్కన్ ప్రాంతంలో మంచి పంట పండేందుకు ఆంధ్ర ప్రాంతంలో ఉన్న అనుభవజ్ఞులైన కమ్మ వర్గానికి చెందిన రైతులను నిజాం పాలకులు ఆహ్వానించడంతో దీన్ని మంచి అవకాశంగా తీసుకున్న కమ్మ సామాజిక వర్గం వాళ్లు కోస్తా ప్రాంతంలో ఒక్క ఎకరాన్ని విక్రయించి తెలంగాణ ప్రాంతంలో 10 ఎకరాల బీడు భూములను కొన్నారు.

వ్యవసాయం వ్యాపారమయం కావడంతో కృష్ణ డెల్టా త్వరితగతిన అభివృద్ధి చెందింది. విజయవాడలో అతి పెద్ద రైల్వే జంక్షన్ ఏర్పడటంతో రవాణా సౌకర్యం సులభతరంగా మారింది. సొంత ఊర్లో ఉన్న భూమిపై వచ్చే ఆదాయంతో ఇతర పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టసాగారు. అంతకు మించి వడ్డీకి డబ్బులు ఇచ్చే స్థాయికి కూడా చేరుకున్నారు. అయితే ఎన్ని అవాంతరాలు వచ్చినా కమ్మ సామాజిక వర్గం ఒకే తాటిపై నిలిచింది. కొంత మంది ఆ వర్గానికి చెందిన ధనికులు ఆ వర్గానికే చెందిన పేదలకు సహాయ సహకారాలు అందించేవారు. చదువుని మాత్రం ఎక్కడా విస్మరించలేదు. ఇంగ్లీష్ మీడియం చదవాలనే ఉద్దేశ్యంతో నగరాలకు వలస వచ్చారు. కమ్మ హాస్టళ్లను నిర్మించుకున్నారు. కొందరు బెనారస్ విశ్వవిద్యాలయానికి వెళ్లి బ్రహ్మణులకు సొంతమైన వేద మంత్రాలను కూడా నేర్చుకున్నారు. అందుకు కారణం వారే వివాహాలు జరపొచ్చన్న ఆలోచన. అయితే అప్పటికే బ్రహ్మణ వ్యతిరేక ఉద్యమం తీవ్ర స్థాయిలో ఉండటంతో ఆ ప్రభావం కమ్మ వర్గంపై పడింది. అప్పుడు కొందరు బ్రహ్మణేతర పార్టీల్లో చేరడం జరిగింది. మద్రాస్ ప్రెసిడెన్సీలో తమకు రిజర్వేషన్లు కావాలని డిమాండ్ చేశారు. పాలన వ్యవస్థలో కమ్మలది పైచేయి అవుతుందని భావించిన బ్రిటీషర్లు కమ్మ సామాజిక వర్గాల డిమాండ్లకు అంగీకారం తెలిపారు. అంతేకాదు బ్రహ్మణులు జాతీయవాదులుగా తెరపైకి వచ్చే అవకాశముందన్న భయం తెల్లవారిని వెంటాడింది.



**తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు రైతాంగ దళసభ్యులు**

1930లో సంభవించిన ఆర్థిక సంక్షోభంతో పన్నులు విపరీతంగా పెరిగి రైతులను దెబ్బతీసాయి. దీంతో కొందరు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు జాతీయ వాదులుగా అవతారమెత్తారు. ఈ నేపథ్యంలోనే కమ్మ సామాజిక వర్గీయులు సారథ్యం వహించిన ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ తెరపైకి వచ్చింది. మరికొందరు భూస్వాములపై జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కూడా పాల్గొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన ఒక సంవత్సరంలోనే సంస్థానాలను భారత్‌లో విలీనం చేసేందుకు ప్రధాని నెహ్రూ ప్రభుత్వం సైనిక చర్యకు ఆదేశించాడు. దీంతో నిజాం సంస్థానంలోని ప్రాంతాలు ప్రత్యేకించి తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌లో కలిపి హైదరాబాద్‌ను రాజధానిగా చేశారు. అప్పటికి భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా ఏర్పడిన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ మొదటిది. అయితే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటినుంచో ఉన్నప్పటికీ, తెలుగు వారిపై తమిళులు ఆధిపత్యం సహించలేక కమ్మ వర్గం వారు కమ్యూనిస్టు పార్టీకి మద్దతు పలికారు. ఈ సందర్భంగా డా॥బి.ఆర్.అంబేద్కర్ అన్న కొన్ని మాటలు నేను గుర్తుచేస్తాను. "మనదేశంలో భాషా ప్రయుక్తమంటే కమ్యూనిజానికి మరోపేరు. ఆంధ్రనే తీసుకోండి, ఒకే భాష మాట్లాడుతున్న కమ్మ, రెడ్లు అనే రెండు వర్గాలు రాజ్యమేలుతున్నాయి. అటు కార్యాలయాలలో, ఇటు వ్యాపారాలలో వారిదే ఆధిపత్యం వెనకబడిన వర్గాలు వారి మోచేతీ నీళ్లు తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచి 30 ఏండ్లు ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలించింది. అందులో రెడ్డి సామాజిక వర్గం వాళ్లే ఎక్కువ. అటు తర్వాత కమ్మ వర్గీయులు హైదరాబాద్‌కు వలసొచ్చారు. విద్య పరంగా కమ్మ వర్గీయులు ఎంతో ముందుండేవారు. నిజాం పాలన పోయిందనుకుంటే ఆంధ్రుల పాలన వచ్చిందన్న భయం తెలంగాణ స్థానికుల్లో కనబడింది.

తెలంగాణ ప్రాంతం, ఆంధ్ర ప్రాంతం భాష ఒకటే అయినా వారి చరిత్ర, సంస్కృతులు, పద్ధతులు వేరుగా ఉండటం వలన ఎస్సార్సీ కమీషన్ ఆంధ్ర ఏర్పాటుక మద్దతుగా నిలవలేదు. భౌగోళికంగా ఆంధ్ర ప్రాంతం సారవంతంగా కలకలలాడుతుండగా, బీడు భూములతో దక్కన్ ప్రాంతం వెలవెల పోయింది. నిజాం కాలంలో తెలంగాణ అణచివేయబడటమే కాకుండా ఆధునిక విద్యను అభ్యసించేందుకు వీలులేకుండా పోయింది. తెలంగాణ భూస్వాములు కూడా ఒకనొక సమయంలో నష్టపోగా ఆంధ్ర ప్రాంతంలోని కమ్మ వర్గీయులు మాత్రం బ్రిటీషర్ల అండతో అభివృద్ధి పథంలో దూసుకెళ్లారు. స్వాతంత్ర్యం తర్వాత ఎక్కువ వ్యవసాయ ప్రాజెక్టులు కోస్తాంధ్ర ప్రాంతానికి రావడంతో ఆ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందింది. అదే సమయంలో 1960లో హరిత విప్లవం రావడంతో

కమ్మ వర్గీయులు అధికంగా రావడం జరిగింది. అప్పటికే వారి వద్ద ఉన్న డబ్బును ఆధునీకరణకు వాడటంతో వారు మరింత లబ్ధి పొందారు. అప్పటి బ్రహ్మణ వర్గానికి చెందిన పి.వి నర్సింహరావు ప్రవేశ పెట్టిన లాండ్ సీలింగ్ యాక్ట్ కమ్మ వర్గానికి విపరీతమైన ఆగ్రహాన్ని తెప్పించింది. ఈ చట్టం వారి ఆర్థిక విధి విధానాలను దెబ్బతీసేలా ఉందంటూ మండిపోయారు. అయితే ల్యాండ్ సీలింగ్ చట్టం ఆంధ్ర ప్రాంతంలో పెద్దగా ప్రభావం చూపలేదనే చెప్పాలి. ఎందుకంటే ఎక్కువ భూమి కలిగిఉన్న వారు, వారి కుటుంబ సభ్యుల మధ్య పంచుకోవడం జరిగింది. హరిత విప్లవంతో బాగా లబ్ధి పొందిన కమ్మ వర్గం వారు ఇక ఏ మాత్రం వ్యవసాయం చేయదలచుకోలేదు. పంటలో తమకు వచ్చిన లాభానంతా ఇతర పరిశ్రమల్లో పెట్టుబడులుగా పెట్టి లాభానార్జించగలిగారు. ఇదే వారిని హైదరాబాద్‌వైపు అడుగులు వేయించింది. చదువుకోసం హైదరాబాద్ చేరుకుని ఇక్కడే స్థిరపడిపోయారు. తెలంగాణ ప్రాంతంలోనే కొంత భూమిని కొని వ్యవసాయాన్ని చేసి లాభాలను పొందొచ్చని వారు తలచారు. ఇది కాకుండా రియల్ఎస్టేట్స్‌పై కూడా కన్నేశారు. తెలంగాణలో సెటిలైన కమ్మ వర్గం వారు బీడు భూములను సారవంతంగా చేశామనే ప్రచారం చేసుకున్నారు. డబ్బు అవసరం ఉన్న పేద రైతుల వద్ద భూమిని లీజుకు తీసుకున్నారు. ఎప్పుడైతే తీసుకున్న డబ్బు తిరిగి చెల్లించలేదు ఆ భూమిని కమ్మ వర్గీయులు సొంతం చేసుకున్నారు. అయితే ఆంధ్ర ప్రాంతం బ్రిటీష్ ఆదీనంలో ఉండటం మూలంగా వారు తెలంగాణ వారికంటే ముందుండేవారు. దీంతో ఆంధ్ర ప్రాంత వలసదారులకే విద్య, ఉపాధి అవకాశాలు ఎక్కువ ఉండేవి. అణచివేత ధోరణి అని భావించిన తెలంగాణ వాదులు 1969లో తెలంగాణ ఉద్యమం చేపట్టారు. అయితే పూర్తి స్థాయిలో కమ్మ వర్గీయులు హైదరాబాద్‌కు వలస రావడం మాత్రం 1980వ దశకంలో జరిగింది.

కమ్మ వర్గానికి చెందిన ఎన్టీ రామరావు తెలుగు దేశం పార్టీని పెట్టడం, ఆఖండ మెజారిటీతో గెలుపొంది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో వలసదారులకు ఒకింత ధైర్యం వచ్చింది. ఎన్టీయార్ ఆనాడు ఒక్కడే రాష్ట్ర మొత్తం ప్రచారం చేశాడు. అందుకు కమ్మ వర్గానికే చెందిన రామోజీ రావు తన ఈనాడుతో ఎన్టీయార్‌ను మరింతగా హైలెట్ చేశాడు. ఎన్టీయార్ ప్రవేశపెడతానన్న పథకాలతో పాటు ఆయన ఒక సినిమా స్టార్ చరిష్మా అతని విజయంలో కీలక పాత్ర పోషించింది. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఎన్టీయార్ ఆ తర్వాత ఒక సిని స్టార్‌గా వెలుగొంది రాష్ట్ర పగ్గాలు చేపట్టడం ఒక వింతనే చెప్పాలి. భారత్‌లో రెండవ అతి పెద్ద చిత్ర పరిశ్రమగా తెలుగు సిని పరిశ్రమ ఉంది . ఇందుకు అందులో ఉన్న హీరోలు, దర్శకులు, నిర్మాతలు కమ్మ వర్గానికి చెందిన వారు కావడం. అంతేకాదు ఇండస్ట్రీలో కమ్మ వర్గానికే ఆధిపత్యం. అయితే ఇందుకు చిరంజీవిలాంటి వాళ్లు మినహాయింపు. కమ్మ వర్గానికి చెందిన వారు విద్యా, ఆరోగ్య రంగాల్లో ఎక్కువగా పెట్టుబడులు పెట్టారు. మొదటి తరం డాక్టర్లు వైద్య విద్యను ఇంగ్లండ్‌లో చేపట్టి, ఆ తర్వాత 1980లో తిరిగి హైదరాబాద్ చేరుకొని ఎన్టీయార్ ప్రొద్భలంతో ప్రైవేట్ ఆసుపత్రిలను నెలకొల్పారు. మెడిసిన్ తర్వాత ఇంజనీరింగ్‌వైపు మొగ్గుచూపేవారు. కమ్మ వర్గీయులకు రిజర్వేషన్లు లేకపోవడంతో అందుకు వారు కమ్మ వర్గం వారు స్థాపించిన విద్యా సంస్థల్లోనే చదివేవారు. ఫీజులు ఎక్కువగా ఉండటంతో ఇతర సామాజిక వర్గాల వాళ్లు చదువుకునే అవకాశం లేకుండా పోయింది. నేషనల్ లిబరలైజేషన్ ప్రారంభం కాకముందే కమ్మ వర్గీయులు పేరుగాంచిన విద్యా సంస్థలను 80 దశకంలోనే నెలకొల్పారు.

ఎన్టీయార్ తర్వాత రాష్ట్ర పగ్గాలు చేపట్టిన చంద్రబాబు నాయుడు ఆర్థిక సంస్కరణలపై దృష్టి సారించాడు. ఎప్పుడూ ఒక చిన్న రాష్ట్రానికి ఋణమివ్వని ప్రపంచ బ్యాంక్ చంద్రబాబు విధానాలను చూసి ఋణమివ్వడం అప్పట్లో పెద్ద వార్తే అయ్యింది. చంద్రబాబు ఐటిని అభివృద్ధి చేయడం, అందులో భాగంగా హైదరాబాద్‌కు పశ్చిమ దిశగా ఉన్న హైటెక్ సిటిపై ఫోకస్ చేశాడు. అటు జూబ్లీ హిల్స్‌కు ఇటు కూకట్ పల్లికి హైటెక్ సిటి దగ్గరగా ఉండటం ఒక కారణం అయితే ఈ ప్రాంతంలోనే కమ్మ వర్గీయులు అధికంగా నివసిస్తున్నారనేది మరో కారణం. కమ్మ వ్యాపార వర్గాలు రాజకీయ అండతో హైటెక్ సిటివద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి బాగా లాభపడ్డారు. కమ్మ వర్గీయులనే చంద్రబాబు అదరించారని అప్పట్లో చాలా ఆరోపణలు వచ్చాయి. 1999లో విడుదలైన సర్వే ప్రకారం 87 శాతం కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు చంద్రబాబును ముఖ్యమంత్రిగా ఎన్నుకొన్నట్లు తెలిపింది. 9 ఏండ్ల చంద్రబాబు పాలనలో కమ్మ సామాజిక వర్గం ఒక బలీయమైన శక్తిగా ఎదిగింది. ఆ తర్వాత వలస వచ్చిన సామాజిక వర్గం వారు మీడియాలో పెట్టుబడులు పెట్టి మరింత లాభపడ్డారు. 1997- 2004 మధ్యలోనే దాదాపు 3 వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడటాన్ని గమనించాలి. వీరిలో ఎక్కువగా తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు చెందిన వారు కావడం విశేషం.

రాష్ట్ర విభజన నేపథ్యంలో కృష్ణ డెల్టా వద్ద ఉన్న విజయవాడ ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఉదాహరణకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన తర్వాత కృష్ణ డెల్టా ప్రాంతంలోని విజయవాడలో భూముల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఎందుకంటే కొత్త రాష్ట్రానికి విజయవాడ రాజధాని అయ్యే

అవకాశాలు ఉన్నటు ఊహాగానాలు రావడంతో జనాలు అక్కడ పెద్ద ఎత్తును భూములు కొనుగోలు చేశారు. విదేశాల్లో ఉన్న కమ్మ వర్గం వారు కూడా విజయవాడ దగ్గర భూములు కొనేందుకు పోటీలు పడుతున్నారు. వరకట్నం కింద కూడా భూములు ఇవ్వటం, వివాహ వేడుకలు భారీ స్థాయిలో నిర్వహించడంతో కమ్మలు ఎంతో ఫేమస్. భారీ మొత్తంలో భూమిని, బంగారాన్ని కట్న కానుకలుగా ఇవ్వడానికి వారు వెనుకాడరు. అయితే 2004 వరకు కమ్మలు ఆర్థికంగా,రాజకీయంగా పెత్తనం చెలాయించినా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. వారు తమ రాజకీయ ప్రభావాన్ని కొంత కోల్పోయ్యారు. తెలంగాణ ఏర్పాటు వారి మనుగడకు కొంత ఇబ్బంది మారినా ఒక వేళ, విజయవాడ ఆంధ్రకు రాజధాని అయితే కమ్మలదే పూర్తి ఆధిపత్యం అని చెప్పవచ్చు. తమ పెట్టుబడులకు విజయవాడకు తరలించి అక్కడ పాతుకుపోవచ్చు.

తెలంగాణ ప్రాంతంలో వారి నాయకత్వం చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, రాష్ట్రం విడిపోతే మాత్రం ఆంధ్రలో కమ్మవారే అధికారంలోకి వచ్చే అవకాశం ఉంది. కమ్మలు ఆర్థికంగా, రాజకీయంగా తమ ఆధిపత్యాన్ని కోల్పోలేదు కానీ, సామాజికంగా, సాంస్కృతికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒకప్పుడు వారు ఎవరినైతే వ్యవసాయ కూలీలుగా ఉపయోగించుకున్నారో అలాంటి దళితుల నుంచి వ్యతిరేకత వచ్చింది. కోస్తా జిల్లాల్లోనే అత్యంత అభివృద్ధి చెందిన కారంచేడు అనే గ్రామంలో దళిత ఉద్యమం చోటుచేసుకుంది. వర్గ విభేదాలు ఎక్కువగా వెనుకబడిన ప్రాంతాల్లోనే వెలుగు చూసేసి. 1985లో ఆంధ్రప్రదేశ్‌లోని కారంచేడులో మొదలైన దళిత ఉద్యమం కమ్మ భూస్వాముల వలనే వ్యాప్తి చెందింది. ఇదే సమయంలో దళిత వర్గాలైన మాల, మాదిగ వర్గాలను క్రిష్టియన్ మిషనరీలు, రిజర్వేషన్లు వంటివి ప్రభావితం చేశాయి. వారు కూడా తమ పిల్లలను స్కూల్‌కు పంపడం ప్రారంభించారు. దీంతో ఉద్యోగ అవకాశాలు లభించడంతో వ్యవసాయాన్ని వదిలేశారు. కమ్మ వర్గానికి కష్టాలు ప్రారంభమయ్యాయి. దళితులు ఆర్థికంగానూ, రాజకీయంగానూ తమ హక్కులను పొందుతూ వచ్చారు. ఎప్పుడైతే తెలుగుదేశం పార్టీని స్థాపించారో అప్పటినుంచి కారంచేడులోని దళితులు కమ్మవారి ఆధిపత్యానికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌కు ఓటు వేయడం మొదలు పెట్టారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు దీన్ని ప్రమాదంగా భావించారు. ఎలాగైన వారిపై దాడిచేసి బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నారు. ఈ నిర్ణయం వల్ల కారంచేడులో ఓ చిన్న సంఘటన జరిగింది. మంచినీటి కాలువలో గేదెలను కడుగుతున్న ఒక కమ్మ అబ్బాయిని తిట్టడంతో అసలు గొడవ మొదలైంది. ఎప్పుడు అవకాశం వస్తుందా అని కాచూకు కూర్చున కమ్మ భూస్వాములు పథకం పన్నారు. మాదిగలు నివసిస్తున్న వాడపై దాడికి దిగారు. వాళ్ల గుడిసెలు తగలబెట్టారు. మహిళలు అని చూడకుండా విరుచుకుపడ్డారు. పురుషులపై గొడ్డళ్లతో దాడిచేశారు. ఆరుగురిని అత్యంత కిరాతకంగా హత్య చేశారు. అనేకమందిని తీవ్రంగా గాయపరిచారు. ఇంతటి దారుణం చోటు చేసుకోవడంతో దళితులంతా ఏకమయ్యారు. దళిత మహాసభ పేరిట సరికొత్త వేదికను ఏర్పాటు చేసుకున్నారు. ఈ మాట ఆనోట ఈనోట రాష్ట్ర మంతటా పాకింది. తమపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత మహాసభ ప్రతినిధులు డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిలో కొంతమంది కమ్మలు అప్పటి ముఖ్యమంతి ఎన్టీ రామరావుకు బంధువులే అందులో ఒక వ్యక్తి ఈ మారణ కాండలో పాలు పంచుకున్నారని తేలింది. అయితే 92 మంది నిందితుల జాబితాలో కనీసం అతని పేరు చేర్చలేదు. 23 సంవత్సరాల సుదీర్ఘ విచారణ అనంతరం ఒకే ఒక వ్యక్తికి యావజ్జీవ శిక్ష పడింది. మిగిలిన 30 మందికి మూడేళ్ల జైల్లో ఉంచారు. దీంతో బాధిత కుటుంబాలు నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరగలేదని బాధ పడ్డారు. ఇదే సమయంలో ఎన్టీయార్ బందువు ఎవరైతే శిక్ష నుంచి తప్పించుకున్నారో అతన్ని కొన్నాళ్లకు నక్సలైట్లు హతమార్చారు.

పీపుల్స్ వార్ గ్రూప్‌గా ఏర్పడ్డ నక్సలైట్స్ అప్పట్లో తెలంగాణ ప్రాంతంలో క్రియాశీలంగా ఉండేవారు. గెరిల్లా పద్దతిలో తమ పోరాటాన్ని తీవ్ర తరం చేశారు. కమ్మలు, రెడ్లు మావోయిస్టులకు ప్రధాన శత్రువులగా మారారు. పెద్దపెద్ద భూస్వాములను, పాలకులను ఆధిపత్యం చెలాయించే సామాజిక వర్గంగా చెప్పుకోవచ్చు.అందుకే వారు నక్సలైట్లను అంతమొందించేదుకు అధికారాన్ని వాడుకోవాలని చూశారు. ఇక్కడ నేను పౌరహక్కుల నేత కె. బాలగోపాల్ చెప్పిన మాటలను ప్రస్తావించాలనుకుంటాను. **"తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చాక నక్సలైట్లపై నిర్భంధం విపరీతంగా పెరిగిపోయింది. కాంట్రాక్టర్లు, భూస్వాములు, ఫైనాన్సియర్లు, పారిశ్రామిక వేత్తలకు**



**సాయుధ నక్సలైట్లు (ఫోటో గూగుల్ నుండి)**

**కొమ్ము కాసేల ప్రభుత్వం వ్యవహరించింది. సాక్షాత్తు అసెంబ్లీలో కూడా ఇలాంటి వారే రాజ్యమేలుతున్నారు. గ్రామ స్థాయిలో పేదలను అణగదొక్కేందుకే ఇలాంటి వారిని ప్రోత్సహిస్తున్నారు. కూలీలకు అధిక వేతనం ఇస్తేనో, భూముల పంపిణీతోనే వారి ఆస్తులపై ప్రభావం చూపదు. ఇది కేవలం వారికి తప్పనిసరి రాజకీయ అవసరంగా మారింది."**దని బాలగోపాల్ అన్నారు.

ఇక ఎన్టీయార్, చంద్రబాబు నాయుడు పాలన కాలంలో పారా మిలటరీల బలగాలు వందల సంఖ్యలో నక్సలైట్లను హతమార్చాయి. అంతేకాకుండా నక్సల్స్ సానుభూతిపరుల పేరుమీద అనేకమంది గిరిజనుల నకిలి ఎన్‌కౌంటర్ల పేరుతో పొట్టన పెట్టుకున్నారు. అందుకే మావోయిస్టులు ఆంధ్రప్రదేశ్ నుంచి పక్క రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌కు తరలి వెళ్లారు. మొత్తానికి దీని వల్ల అర్థమయ్యేది ఏమిటంటే రాష్ట్రంలో అధికారంలో ఉండాలంటే ఏదో ఒక కుల, వర్గాలను ప్రోత్సహించడం తప్పని సరిగా మారింది. కులపరమైన ఆధిక్యత వల్ల కొన్ని ప్రాంతాల్లో పట్టు నిలుపుకోవచ్చు. అందుకే తమిళనాడు, కర్నాటకలో ఉన్న కమ్మ వర్గం వారు. ఇక్కడ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నంతగా ఆధిక్యత ఉన్నట్లు కనిపించదు. ఎందుకంటే రాష్ట్రం బయట తెలుగు మాట్లాడే వారిని మైనారిటీలుగా భావిస్తారు. అందుకే వారు బయటి రాష్ట్రాల్లో రాజకీయ శక్తిగా ఎదగలేకపోయారు. ఇదే సమయంలో ఉత్తర కర్నాటకకు వలస వెళ్లిన వారు మాత్రం కొందరు ధనవంతులుగా ఎదిగారు. తుంగభద్ర నది పరిసరాల్లో భూములు కొన్నవారంతా స్థానికంగా పరపతి సాధించారు. తమిళనాడులోని కోయంబత్తూరు వంటి చోట్ల కూడా కమ్మ వర్గీయులు బలంగా ఉన్నారు. చాలా వరకు వస్త్ర పరిశ్రమలు వారివే. నేను ఇలాంటి అనేక ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటన నిర్వహించాను. అక్కడ కమ్మల ప్రభావం ఏ మేరకు ఉందన్న దానిపై పరిశీలన జరిపాను. ఈ వివరాలను సేకరించడంలో నేను పూర్తి శాస్త్రీయ పద్ధతులను అవలంభించాను. రెండు వందల మంది కమ్మల ఇళ్లకు వెళ్లి సర్వే చేశాను. వారికి ప్రశ్నావళి ఇవ్వడం, ఇంటర్వ్యూల ద్వారా సమాచారాన్ని నిక్షిప్తం చేశాను. కృష్ణా డెల్టాలోని గోదావరి జిల్లాలో వంద నివాసాలు, హైదరాబాద్‌లో ఉండే కూకట్‌పల్లిలో కూడా సర్వే నిర్వహించాను. దీని ద్వారా పట్టణ ప్రాంతాల్లో ఉన్న కమ్మలను, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కమ్మలకు సాంఘీక, ఆర్థిక స్థితిగతుల్లో ఉండే తేడాను అంచనా వేశాను. వారికి నేను ఇచ్చిన ప్రశ్నావళిలో ఎందుకు వాళ్లు ఎక్కువగా వలస వచ్చారు, వారి చదువులు, ఆర్థిక స్థితిగతులు, కుటుంబ పరిస్థితులు, రాజకీయాలపై అవగాహన వంటి వాటినే ప్రశ్నించాను. సామాజికంగా చూస్తే వలసలు అత్యంత ప్రభావం చూపే అంశంగా చెప్పుకోవచ్చు.

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కూడా కమ్మలు విదేశాల్లోనుంచి వారి కొడుకులు, కూతుళ్లు పంపే సొమ్ముతో ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకున్నారు. విద్య పరంగా చూస్తే గ్రామీణ ప్రాంతంలో ఉండే కమ్మల కంటే కూడా పట్టణ ప్రాంతాల్లో ఉండే వారు ఎంతో ముందంజలో ఉన్నారు. ఈ కోవల్లోనే గ్రామంలోని అనేక మంది వ్యవసాయం కంటే పట్టణాల్లో ఏదో ఒక ఉద్యోగం చేసేందుకు ఇష్టపడుతున్నారు. ఇలా చాలా కుటుంబాల్లో సంతానాన్ని ఇద్దరికే పరిమితం చేస్తూ తమ ఆస్తులు విభజింపబడకుండా జాగ్రత్త పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో మినహా సజాతి వివాహాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఉపకులాల మధ్య పెళ్లిళ్ల సర్వ సాధారణంగా జరుగుతున్నాయి. పట్టణాల్లో స్థిరపడ్డ కమ్మ కులస్థులు సామాజికంగా, ఆర్థికంగా పై స్థాయిలో ఉంటే, గ్రామీణ ప్రాంతంలోని వారు మాత్రం వెనుకబడి కులాలు, దళితులపై ఆధిక్యంతో ఉన్నారు. కులాల ఆధిపత్యం పట్టణ ప్రాంతాల్లో ఒక ప్రత్యేక పరిస్థితిలో మనకు కనిపిస్తుంది. విజయవాడ, కోయంబత్తూరు తదితర ప్రాంతాల్లో



**దేశ, రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న కమ్మ సామాజిక నాయకులు (ఎడమ నుంచి వెంకయ్య నాయుడు, నారాయణ, చంద్రబాబు, బి.వి.రాఘవులు, జయప్రకాశ్ నారాయణ)**

నేను చేసిన సర్వేలో ఎన్నో విషయాలు వెలుగుచూశాయి. విజయవాడలోని కమ్మలు వ్యాపారపరంగా, ఆర్థిక పరంగా చాలా తక్కువ సమయంలోనే ఎదిగారు. సంపాదన కోసం వారు చేయని పనిలేదు. కొందరు అక్రమ మార్గాలను కూడా అనుసరించారు. అయితే కోయంబత్తూరు ప్రాంతంలో మాత్రం ఈ వర్గం వారంతా వస్త్ర పరిశ్రమల్లోనే సత్తా చాటారు. అక్కడికి వలస వెళ్లినప్పుడు వారంతా కేవలం పత్తి రైతులు మాత్రమే. కొన్ని శతాబ్దాల క్రితం తమిళనాడుకు వెళ్లిన దొరల కుటుంబాలు సైన్యంలో కమాండర్లుగా, పెద్ద పెద్ద భూస్వాములుగా స్థిరపడ్డారు. ఒక రకంగా ఆంధ్రప్రదేశ్‌లోని కమ్మలకు, ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డవారికి ఎంతో తేడా ఉంది. వారి సంస్కృతి సంప్రదాయాల్లో ఎక్కడా పోలిక కుదరదు. తెలుగు మాట్లాడిన అందులో కొన్ని తమిళపదాలు అప్రయత్నంగా దొర్లుతుంటాయి. అంత మాత్రం చేత వారు కార్మికులతో వ్యవహరించడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొవడం లేదు. సాధారణంగా నిమ్న కులాలకు చెందిన అమ్మాయిలను అక్కడి వారు పనిలోకి పెట్టుకుంటారు. మూడేళ్ల ఒప్పందంపై పురుష కార్మికులను నియమించుకుంటారు. స్త్రీ కార్మికులు అనేకమంది ఇక్కడ పనిచేసే కార్మికులనే పెళ్లి చేసుకొని తమ సంపాదనలో మిగుల్చుకున్న సొమ్మును కట్నంగా ఇచ్చుకుంటారు. కేవలం మూడేళ్ల కాంట్రాక్టుకే కార్మికులను నియమించుకోవడం వెనుక కారణం లేకపోలేదు. ఎక్కువ కాలం ఒకే కార్మికుడు పనిచేస్తే యూనియన్‌లుగా ఏర్పడి ఎక్కడ ధర్నాలు చేస్తారన్న భయంతో వారిని ఎప్పటికప్పుడు మారుస్తుంటారు. కోయంబత్తూరులో ఈ తరహా కాంట్రాక్టు విధానం సర్వసాధారణంగా కనిపిస్తుంది. ఇదే సమయంలో కోయంబత్తూరులో పాతుకుపోయిన పెట్టుబడిదారులు తమ పరపతిని పెంచుకునేందుకు కొన్ని ప్రయోజపకరమైన కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. హాస్పటళ్లు, విద్యాలయాళ్లు, ట్రస్టులు ఏర్పాటు చేసి జనంలో మంచి పేరుకోసం ప్రయత్నిస్తుంటారు. విజయవాడలో మాత్రం కేవలం డబ్బు సంపాధనకోసం మాత్రమే విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నారు. ఇది ఫక్తు వ్యాపారంగా మారింది.

కోయంబత్తూరులో కమ్మల రాజకీయ ఆధిపత్యం విజయవాడతో పోలుస్తే చాలా తక్కువగానే ఉందని చెప్పాలి. విజయవాడలో కాపు, కమ్మల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు ఎన్నో రాజకీయ దాడులకు, హత్యలకు కారణంగా మారింది. ఈ నగరాలే కాకుండా నేను తెలంగాణ, కర్నాటకల్లోని కొన్ని గ్రామీణ ప్రాంతాలను కూడా పర్యటించాను. తెలంగాణలో శ్రీరాం సాగర్ ప్రాజెక్టుకు ఆకర్షితులైన కమ్మలు దాని పరిసరాల్లో ఎక్కువగా సెటిలయ్యారు. అదే కర్నాటక విషయానికి వస్తే బళ్లారి, రాయచూర్ జిల్లాల్లో ఉన్న తుంగభద్ర ప్రాజెక్టు వద్ద ఎక్కువ మంది స్థిరపడ్డారు. తాము వచ్చి వ్యవసాయం చేయడం వల్లే ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందాయని కమ్మ రైతులు భావిస్తారు ఎంతైనా తామూ వలస వచ్చామని మాత్రం ఒప్పుకోరు. తెలంగాణలో మంచి, మంచి సాగుభూములంతా సెటిలర్ల చేతిలోనే ఉన్నాయి. ఇటివల హైదరాబాద్‌లో నన్ను ఇంటర్వ్యూ చేసిన చంద్రలత అనే కమ్మ రచయిత రేగడి విత్తులు అనే నవల వివాదం చోటుచేసుకుంది. అందులో ఆమె రైతు ఐన తన తండ్రి ఆంధ్ర ప్రాంతం నుంచి తెలంగాణకు వలస ఎలా వచ్చాడో తెలిపింది. వ్యవసాయానికి ఎంతో అనుకూలమైన నల్లరేగడి భూముల నుంచి తెలంగాణకు వలసవచ్చామని చెప్పింది. తాము వచ్చిన ప్రాంతానికి తగ్గట్టే తన పుస్తకానికి కూడా రేగడి విత్తులు అనే పేరునే చంద్రలత పెట్టింది. కమ్మ వాళ్లు నల్లరేగడి భూముల్లో వ్యవసాయం తనకే సొంతమని భావిస్తుంటారు. ఈ పుస్తకాన్ని అత్యుత్తమ నవలగా తానా వాళ్లు గుర్తించారు కూడా. అయితే ఇది తెలంగాణలో వివాదం సృష్టించింది. తానా కులాభిమానంతోనే రేగడి విత్తులు నవలకు అనుకూలంగా వ్యవహరించిందని కొందరూ ఆరోపించారు. 'తానా'లో కమ్మల ఆధిపత్యం అధికంగా ఉంది కాబట్టే, తమ రచయితకు పెద్దపీట వేశారని విమర్శించారు. తెలంగాణ సంస్కృతిని, తెలంగాణ భూములను అక్కడివారు అభివృద్ధి చేసుకోలేరనే దృష్ప్రచారంలో భాగమే ఇదంటూ తెలంగాణ వాదులు మండేదాకా వచ్చింది. మొత్తానికి ఈ పుస్తకంపై నెలకొన్న వివాధాన్ని చూస్తే తమ సెంటిమెంట్ సీమాంధ్రుల ఆధిపత్యంనుండే కాకుండా, సాంస్కృతిక ఆధిపత్యంనుండి కూడా పుట్టిందనే చెప్పుకోవచ్చు. ఉదహారణకు సినిపరిశ్రమ విషయాన్ని చూస్తే ఎక్కువ శాతం ఆంధ్ర ప్రాంతంకు చెందిన కమ్మలే. వీళ్లు నిర్మించే సినిమాల్లో నేరస్తులు, విలన్లను తెలంగాణ యాసలో మాట్లాడిస్తారు. ఒకే కులాల ఆధిపత్యం అనేక రూపాల్లో కనిపిస్తుంది. దాని తీరు ప్రభావం అనేక అంశాలపై అధారపడి ఉంది. అది పట్టణ ప్రాంతమా, గ్రామీణ ప్రాంతమా? చిన్న నగరమా? పెద్ద నగరమా? అనేది కూడా చూడాలి. కులాధిపత్యం ఇక్కడొక విధంగా, అక్కడొక విధంగా ఉంటుంది. అసలు ప్రస్తుతం కుల ఆధిపత్యం ముందు నేను చెప్పినట్లుగా భూములపై, హక్కులపై మాత్రమే పరిమితం కాలేదు. వీటిస్వాధీనంలో మరికొన్ని అంశాలు వచ్చి చేరాయి. సంస్కృతి, మౌళిక సిద్ధాంతాలు వంటి వాటికి కూడా ఇది విస్తరించింది. మిడియా, వినోద పరిశ్రమ, రాజకీయాలు ఈ అంశాలను ప్రభావితం చేయడంలో కీలక భూమిక పోషిస్తున్నాయి. అందుకే నేను నా పరిశోధనలో ఆధిపత్యంపైనే ఎక్కువగా దృష్టి సారించాను. కమ్మ సామాజిక వర్గంపై నా అధ్యయంలో ఎంతగానో ఉపయోగపడింది. ఏదైమైనా ఒక విషయాన్ని మనమంతా గుర్తుపెట్టుకోవాలి. అందేంటంటే ఆధిపత్య ధోరణి అనేది అన్నింటా వ్యాప్తిచెంది ఉందనేది మాత్రం వాస్తవం.

# నిత్య చైతన్య స్ఫూర్తి 'చే గువేరా'

– బి.ప్రసాద్

నేటి విద్యార్థి–యువకులకు క్రేజీ అభిమాని 'చే' అసలు పేరు ఎర్నెస్టో గువేరా డి లాసెర్నా. 1928 జూన్ 14న అర్జెంటీనాలోని రోసిరోలో జన్మించాడు. బ్యూనస్ ఎయిర్స్‌లో వైద్యవిద్యను అభ్యసించాడు. చదువుపూర్తైన తరువాత లాటిన్ అమెరికా అంతటా పర్యటించాడు.'' సామ్రాజ్యవాదానికి సింహస్వప్నం, స్వేచ్ఛమైన సామ్యవాద వ్యక్తిత్వానికి నిదర్శనంగా నిలిచిన ఈయనకు క్యూబన్లు పెట్టిన పేరే 'చే'. అర్జెంటైనాలో ఆత్మీయంగా పిలుచుకునే పేరుగా చెప్పవచ్చును. ప్రధమ సోషలిస్టు విప్లవానికి దారితీసిన అక్టోబర్ విప్లవం, ప్రపంచ రూపురేఖలనే మార్చడానికి దోహదడిన చైనా విప్లవం వంటి వాటితో ప్రత్యక్ష సంబంధం లేకున్నా విప్లవం అంటే నేడు విశ్వవ్యాప్తంగా స్ఫురణకు వచ్చేపేరే 'చే' అని చెప్పవచ్చును.

చే భావాలు. అతని అసాధారణ ఆదర్శం అణచివేతకు, అన్యాయాలకు గురైన వారికి పోరాట భావుటాలుగా ఉన్నాయి. ' తాము పట్టిన పతాకం నీడన కాక వేరొక పతాకం నీడన చిందించే ప్రతి రక్తపుబొట్టూ అనుభవం రూపంలో తమ దేశ విముక్తికి వినియోగించాలి. అక్కడ సాధించిన స్వాతంత్ర్యం తమ దేశంలో మొదటి అడుగుగా ఉపయోగపడుతుంది" అనే చే సందేశం ప్రపంచం నలుమూలల్లో విద్యార్థులకు, మేధావులకు ఓ ఉద్వేగ భరితమైన ఆశక్తిని రేకేత్తించాయి. సామ్రాజ్యవాదదేశమైన అమెరికాలో కూడా నల్లజాతీయులు, పురోగామి విద్యార్థులు చే ని ప్రేరణగా తీసుకోని ముందుకు సాగుతున్నారు. ఆ రూపం, పేరు అతి కొద్దికాలంలోనే ఓ ప్రేరక శక్తిగా మారటం బహుశా ఇంతకుముందెన్నేడూ సంభవించలేదేమో !.

నిరంతర విప్లవకారుడైన చే 1954లో గ్వాటిమాలను చేరుకొని ప్రజలెన్నుకున్న జాకబ్ ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని సహించలేని అమెరికా సిఐఎ ప్రోద్బలంతో కూలదోసిన తీరును కళ్ళారా చూశాడు. ఇక్కడే క్యూబా విప్లవం పై చే ఆశక్తిని పెంచుకున్నాడని చెప్పచ్చును. కాస్ట్రో బృందంలో 'నికో' అనే యోధుని ద్వారా క్యూబా విప్లవం గురించి మొదటి సారిగా తెల్సుకున్నాడు. అత్యంత వెనుకబడిన చదువులేని కుటుంబం నుండి వచ్చిన నికో మనాన రేవులో కూలీగా బరువులు మోస్తూ అక్కడ తెల్సుకున్న విప్లభావాలను నలుమూలల ప్రచారం చేసేవాడు. ఆ తరువాత కొంతకాలానికి పరిచయమైన ఫైడల్ కాస్ట్రోలోని క్రమశిక్షణ. విప్లవసాధన పట్ల అంకితభావం చే లో విప్లవభావాలపై ఆత్మవిశ్వాన్ని నింపాయని చెప్పవచ్చును. 1965లో కాంగో,తూర్పు యూరఫ్ దేశాలను సందర్శించి వచ్చాడు. క్యూబా తిరిగి వచ్చాక కాస్ట్రో సలహామేరకు విప్లవ దళంను ఏర్పాటు చేసుకొని ప్రత్యేక శిక్షణను తీసుకున్న చే రహస్యంగా 1966లో మారువేశంలో ఐరోపా మీదుగా బొలీవియా వెళ్ళాడు.

చీలీ, అర్జెంటైనా, పరాగ్వే సరిహద్దుల్లో గెరీల్లా స్థావరాలను ఏర్పాటు చేసుకొన్న చే బొలీవియా సైనిక ప్రభుత్వం పై 11నెలల పాటు విప్లవ పోరాటాన్ని సాగించాడు. 50 మంది దళంలో 17 మంది మాత్రమే క్యూబన్లు ఉన్న చే దళం సైనిక ప్రభుత్వంను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళను తాగించేది. ఎక్కడవుండి పోరాటాలకు రూపకల్పన చేస్తుందనేది సైనిక ప్రభుత్వంకు అర్ధం అయ్యేదే కాదు. *"ప్రతి చర్య సామ్రాజ్యవాదం పై పోరుగానే ఉంటుందని*' చే ప్రకటించాడు. విప్లవంలో తనసుతాను ఓ సైనికునిగానే చే భావించాడు. అందులో నుండి ప్రాణాలతో బయటపడటం గురించి అతనికి ఆలోచనే లేదు. ఎన్నడూ కలతచెందలేదు. బొలీవియా గెరిల్లా వీరులతో చే ఒక రోజు ఇట్లా అన్నాడట **"ఇటువంటి పోరాటం మనకు విప్లవ కారులుగా మారుటకు, మానవులలో అత్యున్నత జాతి మనషులుగా మారడానికి ఇదో ఆవకాశం. ఈ రెండుదశల్లో ఎదో ఒకటి చేరుకోలేని వారు పోరాటం వదిలి వెళ్ళవచ్చు"** అమెరికా శిక్షణను పొందిన బొలీవియా సైన్యాలు 1967లో అక్టోబర్ 8న పట్టుకున్నాయి. తెల్లారే చే ని క్రూరంగా చంపేశాయి.

" క్యూబా విప్లవం అసాధారణమైనది. చే మరణంతో ఒక గొప్ప మేధస్సును కోల్పోయాము.చే వైద్యరంగం నుండి వచ్చినా



**క్యూబా మాజీ అధ్యక్షుడు ఫైడల్‌కాస్ట్రోతో చేగువేరా**



**చేగువేరా మృతదేహాన్ని చూపుతున్న బొలీవియన్ సైనికులు**

అసాధారణమైన విప్లవ విజ్ఞానం కల్గిన వాడు. ఉద్రేకి. సాహసికుడు. ధైర్యవంతుడు. మార్క్సిస్టు అవగాహనకు నిరంతరం పరిశోధనలు, అధ్యయనాలు చేసేవాడు. చే ఎప్పుడూ పదవుల కోసం,నాయకత్వం కోసం, గౌరవాల కోసం ప్రాకులాడిన మనిషి కాదు. మారుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక మార్పులను క్షుణ్ణంగా అధ్యయనం చేసేవాడు. స్వార్థం, ద్వేషం ఉండేది కాదు. స్నేహశీలత, ధృఢ విశ్వాసం, వీరోచిత పోరాట స్ఫూర్తి అతనిలో కొట్టొచ్చిన్నట్లు కనపడేది. నాయకుడుగా ఉన్నా పనిలో సాధారణ కార్యకర్తలాగా మెలిగేవాడు. ఎంత కష్టమైన పనినైనా వాలంటీర్‌గా ముందుకొచ్చి చేస్తాననే వాడు.

చే కామ్రేడ్లీతత్వం, కార్యకర్తల కష్ట–సుఖాల్లో అనునిత్యం పాలుపంచునేవాడు.ఉద్యమం ముందుకు సాగాలంటే ఉద్యమ కార్యకర్తల మధ్య ఐక్యతే కీలకమని, విప్లవ పురోగమనానికి చేటుతెచ్చే శత్రువుకు మనపై సైద్ధాంతికంగా దాడి చేసే అవకాశం ఇవ్వకూడదు. మనం సమయాన్ని ఏ మాత్రం చేజార్చుకోవద్దు. అది మనపై మానసికంగా ఆధిపత్యం చెలాయించే అవకాశంనే మనం ఇవ్వకూడదని కార్యకర్తలకు పదేపదే బోధించేవాడని స్వయంగా ఫైడల్ కాస్ట్రో చే 20వ, వర్ధంతి సందర్భంగా ఇటాలియన్ పాత్రికేయుడు గియానీ మీనాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొనటం చూస్తేనే చే లో దాగిఉన్న గొప్ప విప్లవ లక్షణాలను తేటతెల్లం అవుతున్నాయి. ఇవి నేడు విప్లవోద్యమాలలో పని చేస్తున్న ప్రతి కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాల్సిన అంశాలుగా చెప్పవచ్చును. అణగారిన ప్రజల కోసం, తన దేశం కాని దేశమైన క్యూబాను సామ్రాజ్యవాద దేశమైన అమెరికా దురాగతాల నుండివిముక్తి చేయ్యడం కోసం తన ప్రాణాలనే ఫణంగా పెట్టాడు. ప్రతి విప్లవ కారుడు చే జీవితాన్ని ఒక నమూనాగా తీసుకోవాలి. భవిష్యత్ మనదేననే ఆశావాదంలో సామ్రాజ్యవాద దేశాలు, పెట్టుబడి దారుల కుయుక్తులను ఎదుర్కోవాలి. ఎప్పుడూ కొత్త ఉత్సాహంతో ముందుకు సాగాలి. విప్లవ పోరాటాలకు సంఘీభావాన్ని ప్రకటించాలి.

చే పోరాట తెగువ ప్రజాపోరాటాలకు నిర్దిష్ట రూపం, అంతార్జాతీయ సమైఖ్యపోరాటాలను మమేకం చేయ్యడానికి ఊతం ఇచ్చింది. అలసట, హద్దులు లేని చే విప్లవ ప్రస్థానం కమ్యూనిస్టు భావజాలం విజయం వైపు చూసే విధంగా చేశాయని చెప్పవచ్చును. చే పోరాటాల స్ఫూర్తి సామ్రాజ్యవాద దేశమైన అమెరికాకు నేడు లాటిన్ అమెరికా దేశాలు పక్కలో బల్లెంగా మారాయి.క్యూబా, పేరూ, బొలీవియా,నికరాగువా, వెనుజులా, బ్రెజిల్, ఉరుగ్వే, చీలీ, అర్జెంటైనా దేశాలలో నేడు వామపక్ష, సామ్యవాద భావజాలం కల్గిన అధినేతలు అధ్యక్షులుగా విజయకేతనం ఎగురవేయడమే దీనికి నిదర్శనం. ప్రజాపోరాటాలే ప్రత్యామ్నాయ ప్రభుత్వాల ఏర్పాటుకు దారితీస్తున్నతీరు కార్మిక వర్గపోరాటాల కమ్యూనిస్టు భావజాల పురోగామిశక్తులకు ఉత్తేజకరమైనది. ప్రగతి నిరోధక శక్తులకు చెంపదెబ్బ.

– వ్యాసకర్త యాక్టివిస్ట్


**సామాజిక,రాజకీయ,ఆర్థిక మాసపత్రిక**

**క్యాంపస్ వాయిస్‌ను చదవండి, చదివించండి. చందాదారులుగా చేరండి**

*చందాలు,రచనలు,అభిప్రాయాలు పంపవలసిన చిరునామా:*

చందావివరాలు:

సంవత్సరం చందా

₹ 300/-


ఎడిటర్

క్యాంపస్ వాయిస్

రూం.నెంబర్ 34, నర్మద హాస్టల్

ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్–500 007

email:oucampusvoice@gmail.com



జూన్ 14న
లాటిన్ అమెరికన్ విప్లవ యోధుడు
'చే' గువేరా
86వ జయంతి